




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 31 ఆదివారం ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 347

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్..



3

## చొరబాట్ల స్పెషలిస్ట్ బాగూఖాన్ ఖేల్ ఖతం



3

## జూబ్లీహిల్స్ బై పోల్ కాంగ్రెస్ అభ్యర్థి ఫిక్స్..?

ఎవరీ నవీన్ యాదవ్..?



2

## జూబ్లీహిల్స్ బై పోల్ వేళ

# కోదండరామ్, అజార్‌కు కీలక పదవులు

- రేవంత్ వ్యూహాత్మక నిర్ణయాలు
- సుప్రీంకోర్టు తీర్పుతో ఎమ్మెల్సీ పదవి కోల్పోయిన కోదండరామ్
- ఉస్మానియా సభలో హామీ - మళ్లీ ఎమ్మెల్సీగా అవకాశం
- కేబినెట్ తీర్మానం - గవర్నర్ కోటా ద్వారా కోదండరామ్ రీ ఎంట్రీ
- అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజాహరుద్దీన్‌కు ఛాన్స్
- జూబ్లీహిల్స్ బైపోల్ నుంచి అజార్‌ను తప్పించిన రేవంత్ ప్లాన్
- మైనారిటీ కాకుండా బీసీ అభ్యర్థి అవసరమని ఢిల్లీ పర్యటనలో రేవంత్ వివరణ
- కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో రేవంత్ మార్క్ గేమ్



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

సీఎం రేవంత్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. జూబ్లీహిల్స్ బై పోల్ వేళ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. సుప్రీం తీర్పుతో ఎమ్మెల్సీగా అవకాశం కోల్పోయిన ప్రొఫెసర్ కోదండరామ్ కు తిరిగి పదవి ఖరారు చేసారు. అదే విధంగా జూబ్లీహిల్స్ బై పోల్ లో తానే కాంగ్రెస్ అభ్యర్థి అని ప్రచారం చేసుకుంటున్న అజాహరుద్దీన్ కు షాక్ ఇచ్చారు. ఆయనకు పోటీ లేకుండానే చట్ట సభలకు పంపే అవకాశం కల్పించారు. దీని ద్వారా జూబ్లీహిల్స్‌లో రేవంత్ తన మార్క్ వ్యూహాలు అమలుకు సిద్ధం అయ్యారు. తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నాటి ఒప్పందంలో భాగంగా ప్రొఫెసర్ కోదండరామ్ కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఆయనతో పాటుగా అమీర్ అలీ ఖాన్ ను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసారు. దీని పైన అప్పటికే గవర్నర్ కోటాకు సిఫారసు అయిన బీఆర్ఎస్ అభ్యర్థులు న్యాయ పోరాటం చేసారు. తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో కోదండ రామ్, అలీ ఖాన్ ఎమ్మెల్సీలుగా అవకాశం కోల్పోయారు. దీంతో, కోదండరామ్ కు తిరిగి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తానని రేవంత్ తాజాగా ఉస్మానియా యూనివర్సిటీ సభలో ప్రకటించారు. ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో తిరిగి గవర్నర్ కోటాలోనే ప్రొఫెసర్ కోదండరామ్ ను ఎమ్మెల్సీగా సిఫారసు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసారు. కాగా, రెండో ఎమ్మెల్సీ

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో రిజర్వేషన్‌పై గత ప్రభుత్వం విధించిన పరిమితిని

# కృష్ణమ్మకు జల హారతి

- కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు విజయవంతంగా చేరిన కృష్ణా జలాలు
- హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్లు ప్రయాణించిన కృష్ణమ్మ
- సంప్రదాయ పంచెకట్టులో కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి
- వేదమంత్రోచ్ఛారణల మధ్య పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు
- జై చంద్రబాబు నినాదాలతో మార్మోగిన కుప్పం పరిసరాలు

2

అమరావతి-నవభూమి ప్రతినిధి

దశాబ్దాలుగా కుప్పం నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న కల నెరవేరింది. శ్రీశైలం జలాశయం నుంచి బయలుదేరిన కృష్ణా జలాలు, సుమారు 738 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ద్వారా కుప్పం గడ్డను తాకాయి. ఈ చారిత్రక సందర్భానికి గుర్తుగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద కృష్ణమ్మకు భక్తిశ్రద్ధలతో జలహారతి ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సంప్రదాయ పంచెకట్టులో హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణా జలాలకు పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణమ్మకు హారతి ఇచ్చి, రాష్ట్ర ప్రజలకు జలసిరులు అందించాలని ప్రార్థించారు. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ పనులు పూర్తికావడంతో, కుప్పం




నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు భూములకు సైతం సాగునీరు అందడంపై స్థానిక రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. కుప్పంలో కృష్ణమ్మకు జల హారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాల్వల విస్తరణ పనుల ద్వారా కుప్పంలో చివరి భూముల వరకు కృష్ణ జలాలు చేరాయని సంతోషం వ్యక్తం చేశారు. పరమసముద్రంలో బహిరంగ సభలో కుప్పం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన

## ట్రంప్‌కు ఏమైంది?

- ట్రంప్ ఎక్కడ? - అమెరికా అంతటా ఉత్కంఠ
- బయటికి రాని అధ్యక్షుడు - షెడ్యూల్ ఖాళీగా ఎందుకు?
- చేతిపై గాయాలు - ఫోటోలతో చర్చ
- రూమర్లకు తెరలేపిన మీడియా గైర్హాజరు

2



వాషింగ్టన్-నవభూమి బ్యూరో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనారోగ్యానికి గురయ్యారా.. ఇటీవల ట్రంప్ బహిరంగంగా కనిపించక పోవడం, అధికారిక షెడ్యూల్‌లో ఎలాంటి ఈవెంట్లు లేకపోవడంతో ట్రంప్ ఎక్కడున్నారనే వార్త ఇప్పుడు చక్కర్లు కొడుతోంది. ఇటీవల మీడియా ముందుకు రాని ట్రంప్.. మరో రెండు రోజుల పాటు ఎలాంటి మీటింగ్స్ షెడ్యూల్ చేసుకోలేదని వైట్‌హౌస్ వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో ట్రంప్ మిస్సింగ్ అంటూ వార్తలు వెలువడుతున్నాయి. అదే సమయంలో ట్రంప్ తన ప్రకటనలను నేరుగా కాకుండా సోషల్ మీడియాలో పేర్కొంటుండటం కూడా అనుమానాలకు మరింత బలాన్నిస్తోంది. అయితే ట్రంప్ సన్నిహితులు మాత్రం.. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారంటూ చెబుతున్నారు. 79 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్



## బీఆర్ఎస్ సభ్యుల నిరసన

### సభలో ఉద్రిక్తత తెలంగాణ అసెంబ్లీ ఫస్ట్ డే

- ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
- ఆలస్యంగా హాజరైన బీఆర్ఎస్ రైతు సమస్యలపై తీర్మానం డిమాండ్
- స్పీకర్ ప్రసాదరావు స్పష్టత - మొదటి రోజున ఇతర అంశాలకే ప్రాధాన్యం
- బీఆర్ఎస్ సభ్యుల నిరసన - సభలో ఉద్రిక్తత వాతావరణం
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై సంతాప తీర్మానం

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు.. శనివారం ప్రారంభమ య్యాయి. తొలిరోజు సహజంగానే ఏ సభ అయినా.. ప్రశాంత వాతావరణంలో ప్రారంభమవుతుంది. అలానే తెలంగాణ అసెంబ్లీ కూడా ప్రశాంతంగా ప్రారంభమైంది. కానీ, సభలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పక్షం ఆలస్యంగా వచ్చింది. వచ్చిన తర్వాత.. రైతుల సమస్యలపై చర్చకు తీర్మానం ఇచ్చారు. కానీ, తొలిరోజు పలు విషయాలు ఉన్నాయని.. ముందు వాటిని తీసుకుంటామని స్పీకర్ ప్రసాదరావు స్పష్టం చేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు తమ తమ స్థానాల్లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు.. తొలిరోజు అసెంబ్లీలో మూడు మాసాల కిందట అనారోగ్యంతో మృతి చెందిన జూబ్లీహిల్స్ బీఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సంతాపం ప్రకటించారు. దీనిపై



## అమ్మో.. ఎంత పెద్ద లడ్డో..!

- తెనాలిలో భారీ లడ్డూ
- మిర్చి స్నాక్స్ ప్రత్యేకత
- శివలింగాకృతి లడ్డూ
- గాజువాక గణపతికి నైవేద్యం
- 15 మంది కృషి..అడుగుల ఎత్తు
- గిన్నిస్ రికార్డ్ ఆశలు
- ప్రత్యేక వాహనంలో తరలింపు

2

గుంటూరు-నవభూమిబ్యూరో

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులు వివిధ రకాలుగా తమ భక్తిని ప్రదర్శిస్తూ.. ఉంటారు. కోరిన కోరికలు తీర్చాలని వినాయకుడికి ప్రసాదాలతో.. వివిధ రకాల మొక్కులతో వేడుకుంటారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం గాజువాక లంక గ్రౌండ్స్‌లో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన సుందర వస్త్ర మహా గణపతికి నైవేద్యంగా 2 వేల కిలోలు భారీ లడ్డూను నిర్వాహకులు తయారు చేయించి వారి భక్తిని చాటుకున్నారు. 2 టన్నుల లడ్డూ చూసిన ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తెనాలిలో ఓ స్వీట్ షాపు నిర్వాహకులు వినాయక చవితి సందర్భంగా భారీ లడ్డూను తయారు చేశారు. సుల్తానాబాద్‌లోని మిర్చి స్నాక్స్ నిర్వాహకులు 2 టన్నుల(

## ముంచుకొస్తున్న మరో ముప్పు

### మళ్లీ కుండపోత - ఈ ప్రాంతాలకు తాజా హెచ్చరిక..!!



అమరావతి-నవభూమి ప్రతినిధి

తెలుగు రాష్ట్రాలకు వర్షాలు వీడటం లేదు. భారీ వర్షాలతో పలు ప్రాంతాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఇదే సమయంలో వాతావరణ శాఖ మరో బిగ్ అలర్ట్ ఇచ్చింది. బంగాళాఖాతంలో రెండు అల్ప పీడనాలు ఏర్పడనున్నాయి. ఈ ప్రభావంతో మరో సారి భారీ వర్షాలు తప్పవని అంచనా వేస్తోంది. కామారెడ్డితో పరిస్థితి క్రమేణా మెరుగవుతోంది. తాజా అల్పపీడనాలతో ఏపీలోని పలు జిల్లాలకు భారీ వర్ష హెచ్చరికలు జారీ అయ్యాయి. బంగాఖాతంలో వరుస అల్పపీడనాలు ఏర్పడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని విపత్తుల నిర్వహణ శాఖ వెల్లడించింది. సెప్టెంబర్ 3 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని... ఆ తరువాత అది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి, సెప్టెంబర్ 5 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. సెప్టెంబర్ రెండో వారంలో వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్ప పీడనమూ ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీంతో, వచ్చే మంగళ.. బుధవారాల్లో రాష్ట్రంలోని ఉత్తర కోస్తాలోని పలు ప్రాతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో.. అధికారులు అప్రమత్తం అయ్యారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు నిర్ణయాలు

## 50 ఆయుధాలకే పాక్ కాళ్ల బేరానికి వచ్చింది

- పహల్గాం దాడికి ప్రతీకారం
- ఆపరేషన్ సిందూర్ ప్రారంభం
- పాక్‌ను చర్చలకు రప్పించిన భారత్
- ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ కీలక వ్యాఖ్యలు
- యుద్ధం సులభం, ముగింపు కష్టం
- వైమానిక దళం అనుభవం



2

న్యూదిల్లీ-నవభూమి ప్రతినిధి

ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. కశ్మీర్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేసింది. పాక్ ప్రతిదాడులు చేయగా దీటుగా బదులిచ్చి ప్రపంచం మొత్తం మన దేశం గురించి మాట్లాడుకునేలా చేసింది. అయితే తాజాగా ఆ ఆపరేషన్‌కు సంబంధించిన సరికొత్త విషయాలను ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ వెల్లడించారు. 50 కంటే తక్కువ ఆయుధాలను వాడగానే పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ప్రాముఖ్యత గురించి ఓ జాతీయ మీడియా సదస్సులో భారత వైమానిక దళం వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ మాట్లాడుతూ.. "యుద్ధాన్ని ప్రారంభించడం చాలా సులభం, కానీ దాన్ని ముగించడం అంత సులభం కాదు. ఆపరేషన్ సింధూర్‌లో కేవలం 50 కంటే తక్కువ ఆయుధాలను ఉపయోగించడం ద్వారానే మేము ప్రత్యర్థిని చర్చల బల్ల వద్దకు తీసుకురాగలిగాం. ఇది

## కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై నేడు అసెంబ్లీలో చర్చ

- కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న సీఎం రేవంత్
- ఉదయం 9 గంటలకు రిపోర్ట్ సమర్పణకు సిద్ధమైన సీఎం
- కేరళ పర్యటన అనంతరం తిరిగి సభలో పాల్గొనబోతున్న రేవంత్




హైదరాబాద్-నవభూమిబ్యూరో

కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై నేడు తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరుగనుంది. సీఎం రేవంత్ రెడ్డి నేడు ఉ.9 గంటలకు శాసనసభలో రిపోర్ట్ ప్రవేశపెట్టబోతున్నారు. అనంతరం ఉ.9:30 గంటలకు కేరళ వెళ్లి, సా.3:40 కి తిరిగి అసెంబ్లీకి సీఎం రేవంత్ చేరుకుంటారు.

ఇలా ఉండగా, రేపటి నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీఏసీ సమావేశం నిర్వహించారు. స్పీకర్ కార్యాలయంలో మొదలైన బీఏసీ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ హాజరుకాగా, బీఆర్ఎస్ నుండి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. బీజేపీ నుండి ఏలేటి మహేశ్వర్ రెడ్డి బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. అయితే, బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్ మధ్యలోనే వాకౌట్ చేసింది. ఎరువుల కొరత , వరదలపై చర్చించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టుబట్టింది. అయితే, ప్రభుత్వం దీనికి అంగీకరించలేదు. దీనికి నిరసనగా బీఏసీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్ చేసింది. ఇలా ఉండగా, ఇవాళ అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క మీడియాతో చిట్ చాట్ జరిపారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ పై

2

## బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుకు అవమానం



హైదరాబాద్-నవభూమిబ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం టీబీజేపీ సన్నాహక సమావేశం సాక్షిగా తెలంగాణ బీజేపీలో విభేదాలు బయటపడ్డాయి. శనివారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక కోసం తెలంగాణ బీజేపీ సన్నాహక సమావేశం జరి గింది. ఈ భేటీలో టీబీజేపీ చీఫ్‌గా రాంచందర్‌రావు పేరుకు బదులుగా.. పదే పదే కిషన్‌రెడ్డి పేరును ప్రస్తావించారు ఎంపీ రఘునందన్ రావు. రాంచందర్, రఘునందన్ మధ్య విభేదాల నేపథ్యంలోనే రఘునరన్ కావాలనే ఇలా అవమానించారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. ఇది ముమ్మాటికీ బీజేపీ అధ్యక్షుడు రాం చందర్ రావుకు జరిగిన అవమానమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అల్పపీడనం ప్రభావం..

## తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు..!

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో రాగల నాలుగు రోజులు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గతవారంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. వరదలు ముంచెత్తగా జనజీవనం అస్తవ్యస్తమైంది. తాజాగా వాతావరణశాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది.



# గోదావరి ఉగ్రరూపం.. బాసర సరస్వతి ఆలయం వరకు వరద..



ఎగువన భారీ వర్షాతో బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద పెరడంతో బాసర పట్టణం జలదిగ్బంధమైంది. సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వ్యాస మహర్షి గుడి, ఆలయ ఆవరణలోని టీటీడీ గృహాల వరకు వరద చేరింది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు లాడ్జ్‌లు, సత్రాలు, పుష్కరఘాట్ నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే దారి నీటమునిగాయి. గోదావరిపై వంతెనను తాకుతూ వరద ప్రవహిస్తుండటంతో గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, వైశ్య సత్రం వరకు బ్యాక్ వాటర్ చేరాయి. అక్షర కాలనీలో వరద నీటిలో చిక్కుకున్న వారిని అధికారులు ట్రాక్టర్ల సహాయంతో తరలించారు. వరద చుట్టుముట్టడంతో నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు చిక్కుకున్నారు. దీంతో వారంతా భవనంపై అంతస్తుకు వెళ్లారు. దీంతో వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లిన 8 మంది కూడా వరద నీటిలో చిక్కుకుపోయారు. కాగా, మరికొన్ని గంటల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## నవ వార్త



## అమ్మో.. ఎంత పెద్ద లడ్డో..!

**(1వపేజీ తరువాయి)**ఏర్పాటు చేసిన సుందర వస్త్ర మహా గణపతికి నైవేద్యంగా ఈ లడ్డూను సిద్ధం చేయించినట్లు తయారీదారులు ఉప్పల కిషోర్ తెలిపారు. తమ ఖారా?నాలోని 15 మంది సిబ్బంది నాలుగు రోజుల పాటు శ్రమించి, 8 అడుగుల ఎత్తు, 2 వేల కిలోల బరువు గల శివలింగం లడ్డూని తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇది దేశంలోనే అత్యంత భారీ లడ్డూ అని, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కూడా లభించే అవకాశం ఉందన్నారు. తాము గతంలో కూడా విభిన్న ఆకృతులలో లడ్డూలు, మహా ప్రసాదాలను తయారు చేసినట్లు తెలియజేశారు. కాగా భారీ లడ్డూను తిలకించేందుకు పరిసర ప్రాంత ప్రజలు తరలివస్తున్నారు. ప్రత్యేక వాహనంలో గాజువాకకు ఈ భారీ లడ్డూను తరలించినట్లు ఆయన స్పష్టం చేశారు.

## 50 ఆయుధాలకే పాక్ కాళ్లబేరానికి వచ్చింది

**(1వపేజీ తరువాయి)**వైమానిక శక్తి యొక్క ఖర్చు-లాభ విశ్లేషణకు ఒక గొప్ప ఉదాహరణ" అని వ్యాఖ్యానించారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఈ ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. ముఖ్యంగా డ్రోన్లు, ఇతర సైనిక విమానాలతో అత్యంత కచ్చితత్వంతో ఉగ్రస్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో దాదాపు 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. మరోవైపు పాకిస్థాన్ కూడా డ్రోన్లతో ఎదురు దాడులు చేసింది. అయితే భారత వైమానిక దళం అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఆ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి.

## కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై నేడు అసెంబ్లీలో చర్చ

**(1వపేజీ తరువాయి)**చర్చ అంటే బిఆర్ఎస్ కు భయం ఎందుకు అని ఆమె ప్రశ్నించారు. కోర్ట్ లో ఏం తేలకపోవడంతో యూరియా అంశాన్ని బిఆర్ఎస్ తెరపైకి తెచ్చిందని ఆమె విమర్శించారు. కాళేశ్వరం పై చర్చ జరగకుండా ఉండేందుకు యూరియా పేరు తో బిఆర్ఎస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కాళేశ్వరం రిపోర్ట్ అసెంబ్లీ పెట్టకుండా ఉండేందుకు బిఆర్ఎస్ శతవిధాల ప్రయత్నం చేస్తోందని మంత్రి అన్నారు.

## తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు..!

**(1వపేజీ తరువాయి)**సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. నైరుతి వైపునకు వంగి ఉందని పేర్కొంది. ఈ క్రమంలో శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగితాల్య, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. సెప్టెంబర్ ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. 2న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. 3న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.


## స్పెషలిస్టులకు ప్రమోషన్ ఇస్తూ ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు



అమరావతి, ఆగస్టు 30 : 2024 - 25 ప్యానల్ ఇయర్‌కు సంబంధించి సివిల్ సర్జిన్ స్పెషలిస్టులకు ప్రమోషన్ ఇస్తూ ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో..ప్రస్తుతం నెల్లూరు జిల్లా రాపూర్ సీహెచ్ సీ లో పనిచేస్తున్న డాక్టర్ వి సరస్వతిని నరసాపురం పశ్చిమ గోదావరి జిల్లా ఏహెచ్ కు బదిలీ చేశారు. డాక్టర్ ఎం ఉషాబాలను ఎంసిహెచ్ ఒంగోలు నుంచి, ఏహెచ్ కావలి నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. డాక్టర్ ఎన్ శైలజను ఏహెచ్ ధర్మవరం అనంతపురం నుంచి, ఏహెచ్ ఎమ్మిగనూరు కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. డాక్టర్ ఎన్ వనజ కుమారిని సిహెచ్‌సి ఏలేశ్వరం ఈస్ట్ గోదావరి నుంచి, ఏహెచ్ రంపచోడవరంకు బదిలీ చేశారు. ఆర్డర్ అందుకున్న పదిహేను రోజుల్లోగా ఆయా స్థానాల్లో జాయిన్ కావాలని ఆదేశిస్తు ఉత్తర్వులు జారీ చేశారు వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంపి కృష్ణబాబు. అటు, ఢిల్లీలో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్న లవ్ అగర్వాల్‌ను మినిస్టరీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అడిషనల్ సెక్రటరీగా నియమించడంతో ఆయన్ను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సివిల్‌సప్లైస్ కమిషనర్ సౌరభ్ గౌర్‌కు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## వామ్మో.. హైదరాబాద్ లోని ఆ ప్రాంతంలో నెలకు

# రూ. 5.4 కోట్లు అద్దె.. అడ్వాన్స్ రూ. 42 కోట్లు..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ మహానగరం విశ్వ నగరంగా రూపుదిద్దుకుంటోంది. రోజురోజుకూ రియల్ ఎస్టేట్ రంగం విస్తరిస్తోంది. హైదరాబాద్ లో వాతావరణం, సేఫ్ టీ దృష్ట్యా మరిన్ని టెక్ కంపెనీలు భాగ్య నగరానికి క్యూ కడుతున్నాయి. అయితే తాజాగా అమెరికా టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. హైదరాబాద్ లో వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు భారీ డీల్ కుదుర్చుకుంది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో ఏకంగా 2,64,000 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ ను మైక్రోసాఫ్ట్ ఇండియా సంస్థ తాజాగా లీజుకు తీసుకుంది. 2025, జులై 1 నుంచి ఇది అమల్లోకి వచ్చిందని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని ఫీనిక్స్ సెంటార్స్ బిల్డింగ్ లో 2.65 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకుంది. బిల్డింగ్ లోని 3, 4 ఫ్లోర్లలో ఈ కార్యాలయ స్థలం విస్తరించి ఉంది. హైదరాబాద్ లోని ఆఫీస్ స్పేస్ మార్కెట్ విభాగంలో ఇప్పటివరకు కుదిరిన అతిపెద్ద లీజు ఒప్పందాల్లో ఇదొకటిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. చదరపు అడుగుకు రూ.67 చొప్పున మొత్తం స్థలానికి మైక్రోసాఫ్ట్ నెలకు రూ.1.77 కోట్ల కనీస అద్దెగా ఉంది. అలాగే నిర్వహణ వ్యయాలు, ఇతర ఛార్జీలు కలిపి మొత్తం రూ. 5.4 కోట్లు చెల్లించనుంది. అంతేకాక ఏటా అద్దె 4.8 శాతం పెరగనుంది. ఇక సెక్యూరిటీ డిపాజిట్ కింద మైక్రోసాఫ్ట్ రూ.42.15 కోట్లు జమ చేసినట్లు ప్రాప్ స్టాక్ తెలిపింది. అలాగే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద రూ. 92.94 లక్షలు చెల్లించింది. హైదరాబాద్ లో 2024లో టీసీఎస్ సంస్థ 10.18 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసు కుంది. ఇక్కడ నెల అద్దె రూ. 4.3 కోట్లుగా ఉంది. అలాగే 2024 డిసెం బరులో ఫేస్ బుక్ సంస్థ తన ఆఫీస్ స్పేస్ లీజింగ్ డీల్ ను రెన్యూవల్ చేసుకుంది. మొత్తం ఇది 3.7 లక్షల చదరపు అడుగులు కాగా.. నెల అద్దె రూ. 2.8 కోట్లుగా ఉంది. భారత్ లోనే ప్రీమియం, ఏ గ్రేడ్ ఆఫీస్ స్పేస్ అద్దాల్లో హైదరాబాద్ ఒకటిగా ఉంది. పలు అంతర్జాతీయ టెక్నాలజీ, ఆర్థిక సేవల కంపెనీల కార్యాలయాలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు అనువైన ప్రదేశంగా భాగ్యనగరం ఉంది.

# జూబ్లీహిల్స్ బై పోల్ కాంగ్రెస్ అభ్యర్థి ఫిక్స్..?



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దగ్గరపడుతున్న క్రమంలో రోజురోజుకూ సమీకరణాలు మారుతున్నాయి. అయితే ఈ బై పోల్ లో ఎవరిని నిలబెట్టాలి అన్న అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఓ క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ సీనియర్ నేత మాగంటి గోపినాథ్ జూన్ 8న మరణించిన విషయం తెలిసిందే. ఆయన ఆకస్మిక మరణంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఖాళీ స్థానంలో ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఏడాది చివరిలో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈ సమయంలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ను ప్రకటిస్తుందని స్పష్టం అవుతోంది. అయితే ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ముందున్న ప్రధాన లక్ష్యం.. జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడమే. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం ఈ సారి ఆ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని పలు ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేసారు. అయితే ఈ రేసులో ప్రధానంగా మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్, పీజేఆర్ కూతురు విజయారెడ్డి, నాంపల్లిలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన ఫిరోజ్ ఖాన్ అలాగే గతంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓడిన నవీన్ యాదవ్ ల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. మరోవైపు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన అజహరుద్దీన్... ఉపఎన్నిక బరిలో నిలవాలని భావించారు. ఈ క్రమంలోనే టికెట్ తనకే వస్తుందని కూడా ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే అధిష్టానంతో పరిచయాలు ఉన్న అజహరుద్దీన్‌కే కాంగ్రెస్ టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం బలపడింది. అయితే తాజాగా ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ. కోదండరాం.. అలాగే మైనారిటీ నాయకుడు, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవులకు తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. ఈ మేరకు ఇద్దరి పేర్లను గవర్నర్ ఆమోదానికి పంపింది. గతంలో కోదండ రాం, అమీర్ అలీ ఖాన్ లు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టారు. అయితే వారి నామినేషన్లు ప్రక్రియను తప్పుబట్టిన సుప్రీంకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఇక జూబ్లీహిల్స్ టికెట్ తనకే వస్తుందని అజారుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. అంతేకాక ఇటీవల ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అయితే తాజాగా ఆయనకు ఎమ్మెల్సీ రావడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ టికెట్ రేసు నుంచి ఆయన తప్పుకున్నట్టుగా భావించవచ్చు. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న సమీకరణాల దృష్ట్యా నవీన్ యాదవ్ కే కాంగ్రెస్ టికెట్ దక్కవచ్చనే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు జూబ్లీహిల్స్ టికెట్ స్థానికులకే ఇస్తామని, ఈ విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని కాంగ్రెస్ సీనియర్ నేత, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల ప్రకటన చేశారు. దీంతో నవీన్ యాదవ్ కే టికెట్ అని కాంగ్రెస్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. బీసీ వర్గానికి చెందిన నవీన్ యాదవ్.. జూబ్లీహిల్స్ ప్రజలకు సుపరిచితుడిగా ఉన్నారు. ఎప్పటినుంచో స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓటమి చెందారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్ కోసం పనిచేశారు.

# జూనియర్ ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీ పక్కా.. ఎపుడంటే ?

**హైదరాబాద్-నవభూమి:** జూనియర్ ఎన్టీఆర్ ఈ రోజున గ్లోబల్ స్టార్ గా ఎదిగారు. అతి చిన్న వయసులోనే స్టార్ డం సాధించి టాలీవుడ్ లో తన సత్తా చాటుకుని సరికొత్త రికార్డులకు తెర తీసిన జూనియర్ కి సినీ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఎంతో ఉంది. ఆయన ప్రస్తుతం నాలుగు పదుల వయసులో ఉన్నారు సినీ సీమలో ఇంకా ఎక్కవలసిన శిఖరాలు అనేకం ఉన్నాయి. జూనియర్ కూడా ఎన్నో పాత్రలు చేయాలని జనం మదిలో వెండి తెర వేలుపు గా గుర్తుండిపోవాలని పట్టుదలగా పనిచేస్తున్నారు. ఆయన సినిమా ప్రేమికుడు. మరి అలాంటి జూనియర్ రాజకీయాల్లోకి వస్తారా వస్తే ఎపుడు అది ఇవే అందరినీ ఆలోచింపచేస్తున్న విషయాలు. జూనియర్ ది సినీ వారసత్వం మాత్రమే కాదు నిండైన మెండైన రాజకీయ నేపథ్యం కూడా ఉంది. తాత సీనియర్ ఎన్టీఆర్ సినీ రాజకీయ రంగాలలో గొప్పగా రాణించారు. ఆయన ముమ్మారు సీఎం గా ఉమ్మడి ఏపీకి పనిచేశారు. ఇక తండ్రి హరి క్రిష్ణ ఎమ్మెల్యేగా మంత్రిగా రాజ్యసభ సభ్యుడిగా పనిచేసారు. దాని కంటే ముందు ఆయన టీడీపీ చైతన్య రథ సారధిగా ఉన్నారు. పార్టీ పునాదుల నుంచి పనిచేశారు. అందువల్ల జూనియర్ ని రాజకీయంగా చూస్తే బలమైన నేపథ్యమే ఉంది అని చెప్పాల్సి ఉంది. తమ్ముడు వస్తాడంటూ : ఇదిలా ఉంటే తాజాగా జరిగిన హరిక్రిష్ణ వర్ధంతి సందర్భంగా ఆయనకు కుమార్తె సుహాసిని ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమెని మీడియా జూనియర్ గురించి ప్రశ్నించినపుడు తమ్ముడు తప్పకుండా రాజకీయాల్లోకి వస్తారు అని పక్కా స్టేట్మెంట్ ఇచ్చేసారు. ప్రస్తుతం సినిమాల్లో బిజీగా ఉన్నాడని అవకాశం వచ్చినపుడు పొలిటికల్ ఎంట్రీ గ్యారంటీ అని ఆమె స్పష్టం చేశారు దీంతో సుహాసిని ఇచ్చిన ఈ స్టేట్మెంట్ ని జూనియర్ ఫ్యాన్స్ అంతా పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో షేర్ చేసి వైరల్ చేస్తున్నారు. వారంతా ఫుల్ ఖుషీగా ఉన్నారు. సరైన టైం లో : ఇదిలా ఉంటే జూనియర్ ఎంట్రీ ఇపుడపుడే ఉండకపోవచ్చు అని అంటున్నారు. ఆయన సినీ రంగంలో చేయాల్సి సినిమాలు అన్నీ పూర్తి చేసుకుని సరైన సమయంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తారు అని అంటున్నారు. సినీ రంగంలో ఆయన ప్రస్తుతం బిజీగా ఉన్నారు. అందువల్ల ఆయన రాజకీయాల గురించి ఇప్పటి నుంచే చర్చలు అనవసరం అన్న వారూ ఉన్నారు ఏది ఏమైనా రాజకీయ కుటుంబమే కాబట్టి కచ్చితంగా జూనియర్ ఆ రంగాన్ని విడిచిపెట్టరు అని అంటున్నారు. దశాబ్దన్నర కాలం :ా జూనియర్ పొలిటికల్ ఎంట్రీకి మరో దశాబ్దన్నర కాలం పట్టవచ్చు అని అంటున్నారు. ఆయన ఈ కాలమంతా సినిమాల విషయంలోనే ఫుల్ ఫోకస్ పెడతారు అని అంటున్నారు. ఇక ఏపీలో చూసుకుంటే సార్వత్రిక ఎన్నికలు 2029లో జరుగుతాయి. అలాగే షెడ్యూల్ ప్రకారం 2034లో జరుగుతాయి. ఈ రెండు ఎన్నికల్లోనూ జూనియర్ బరిలోకి దిగకపోవచ్చు అనే అంటున్నారు. ఆయన ముందు ఉన్న సినిమా కమిట్మెంట్స్ వాటి బిజీ అలాంటిదే అంటున్నారు. అయితే కచ్చితంగా 2039 నాటికి మాత్రం జూనియర్ పొలిటికల్ అరంగేట్రం ఉంటుందని అంతా ఊహిస్తున్నారు. టోటల్ చేంజి : అప్పటికి ఏపీ రాజకీయం కూడా ఈ విధంగా ఉండకపోవచ్చు అని అంటున్నారు. చంద్రబాబు 2029 ఎన్నికలకు సైతం సారధ్యం వహిస్తారు అని. ఆ మీదట ఆయన వారసుడు టీడీపీ పగ్గాలు అందుకుంటారని అంటున్నారు లోకేష్ నాయకత్వంలో టీడీపీ పవన్ నాయకత్వంలో జనసేన అలాగే జగన్ నేతృత్వంలో వైసీపీ ఏపీలో కనిపించే రాజకీయ శక్తులుగా ఉంటాయని అంటున్నారు. అయితే 2034 తరువాత రాజకీయ శూన్యత ఏపీ పాలిటిక్స్ లో ఏర్పడే అవకాశం ఉంటుందని అదే అదనుగా భావించి జూనియర్ ఎంట్రీ ఇవ్వవచ్చు అన్నది దూర దృష్టితో రాజకీయాలు విశ్లేషించేవారు చెబుతున్న మాట. అప్పటికి ఆయన ఏజ్ కూడా పక్కగా సరిపోతుందని అన్ని విధాలుగా చూసుకునే బరిలోకి దిగవచ్చు అని అంటున్నారు.

# ఏఐ డేటా కోర్సులకు కేంద్ర సంస్థల ఆన్‌లైన్ శిక్షణ, అర్హతలు..!!

**హైదరాబాద్-నవభూమి:**ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్. ఏఐకి ఇప్పుడు అనేక కీలక రంగాల్లో ప్రాధాన్యత పెరుగుతోంది. ఏఐ ప్రభావం సాఫ్ట్ వేర్ ఉద్యోగాల పైన పడుతోంది. ప్రభుత్వాలు సైతం ఏఐ ఆధారిత సేవలను విస్తరించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. పలు ప్రముఖ విద్యా సంస్థలు ఏఐ కోర్సులను ప్రవేశ పెడుతున్నాయి. పెరుగుతున్న డిమాండ్ కు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్హత ఉన్న వారికి ఆన్ లైన్ లో ఏఐ కోర్సుల శిక్షణ ఇచ్చేందుకు సంస్థలు ముందుకు వచ్చాయి. దరఖాస్తుల ను ఆహ్వానిస్తున్నాయి. నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ.. కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ ఇవ్వనుంది. సైబర్ సెక్యూరిటీ, ఏఐ డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్ మరియు బిజినెస్ అనలిటిక్స్ ఉన్నాయి. అదనపు కోర్సులలో ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చెయిన్, డీప్ లెర్నింగ్, సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా, ఒరాకిల్, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైన్ కోర్సు లతో పాటు 100కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల నుండి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. వీటి కోసం ఆన్ లైన్ లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ప్రోగ్రామ్ ఇంటర్ పాస్, ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు . నేషనల్ స్కిల్ అకాడమీ విద్యార్థులు సరికొత్త సాఫ్ట్వేర్ టెక్నాలజీలలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తోంది. అదే విధంగా కోర్సులు ఈ-లెర్నింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ అందించబడుతుంది, తర్వాత పరీక్షలను నిర్వహిస్తారు. పాస్ అయిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన సర్టిఫికేట్‌ను అందుకుంటారు. కోర్సు వ్యవధి 2 నెలల నుండి 10 నెలల వరకు ఉంటుంది, సబ్జెక్ట్‌లో ఇన్ డెప్త్ నాల్డెజ్ పొందేందుకు విద్యార్థులకు ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది. అప్లికేషన్ సమాచారం ఆసక్తి గల అభ్యర్థులు www.nationalskillacademy.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని నిర్వాహకులు వెల్లడించారు.

## కృష్ణమ్మకు జల హారతి

**(1వపేజీ తరువాయి)**ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పానికి రెండేళ్లు ముందుగానే కృష్ణా పుష్కరాలు వచ్చాయన్నారు. తన జీవితంలో పవిత్రమైన రోజు అన్న చంద్రబాబు కుప్పం ప్రజల ఆనందాన్ని చూస్తే తృప్తి కలుగుతోందన్నారు. తన జీవితంలో ఇది పవిత్రమైన రోజు అని చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. మీ ఇంటి బిడ్డగా కుప్పం ప్రజలు తనను ఆదరించారని గుర్తు చేశారు. కృష్ణమ్మను కుప్పానికి తెచ్చాను.. నా ఆనందం మాటల్లో చెప్పలేను.. నా సంకల్పం నిజమైంది అంటూ చంద్రబాబు సంతోషంగా చెప్పారు. 738 కిలో మీటర్ల నుంచి కుప్పం పరమసముద్రానికి కృష్ణా జలాలు తెచ్చామన్నారు. ఎన్టీఆర్ ను గుర్తు చేసుకున్న చంద్రబాబు ఏడు వందల మీటర్లు ఎత్తుకు నీళ్లు తెచ్చామని ఆయన పేర్కొన్నారు. ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీల నిర్మాణంతో గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిస్థితి మారిందని, అందుకే శతాబ్దాలు గడిచినా... కాటన్ దొరను గోదావరి ప్రజలు ఇంకా మరువలేదన్నారు. అలాగే రాయలసీమకు నీళ్లు తెచ్చేందుకు సంకల్పం తీసుకున్న ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని చంద్రబాబు గుర్తు చేశారు. శ్రీశైలం మల్లన్న దగ్గరున్న జలాలను కుప్పం మల్లన్న వద్దకు తెచ్చాం పశువులను కాపాడుకోవడానికి రైళ్లల్లో నీళ్లు తెప్పించాల్సిన దారుణమైన కరవు రాయలసీమలో ఉండేది.. అప్పుడే చాలా బాధపడ్డాను.. ఈ పరిస్థితి మార్చాలనుకున్నా అని పేర్కొన్న చంద్రబాబు చంద్రబాబు 1999లో హంద్రీ-నీవాకు శంకుస్థాపన చేశానన్నారు. ప్రస్తుతం శ్రీశైలం మల్లన్న దగ్గరున్న జలాలను కుప్పం మల్లన్న వద్దకు చేర్చామని పేర్కొన్నారు. గంగమ్మ ఆశీర్వదించింది... కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని చంద్రబాబు ఏం చేశారు.

## కోదండరామ్, అజార్‌కు కీలక పదవలు

**(1వపేజీ తరువాయి)**విషయంలో రేవంత్ మార్క్ నిర్ణయం జరిగింది. అలీ ఖాన్ స్థానంలో అనూహ్యంగా అజాహరుద్దీన్ ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేసారు. జూబ్లీహిల్స్ బై పోల్ లో తానే కాంగ్రెస్ అభ్యర్దిగా పోటీ చేస్తానని అజార్ చెబుతూ వచ్చారు. ప్రచారం ప్రారంభించారు. అయితే, తాజా ఢిల్లీ పర్యటనలో బై పోల్ లో గెలవాలంటే మైనార్టీ అభ్యర్థి కాకుండా.. బీసీ అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉందని రేవంత్ పార్టీ అధినాయకత్వానికి వివరించారు. దీంతో... అజార్ కు పోటీ లేకుండానే చట్ట సభకు ఎంపిక చేసారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ లో బీసీ అభ్యర్థిని అధికారికంగా కాంగ్రెస్ ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. ఇక.. రిజర్వేషన్ల విషయంలోనూ కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్ల అమలుకు వీలుగా జీవో ఇవ్వటం ద్వారా.. సెప్టెంబర్ లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాసంది.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

**(1వపేజీ తరువాయి)**ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. దీని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎంపిక చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. గతంలో అమీర్ ఖాన్‌కు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈసారి ఆయన స్థానంలో అజారుద్దీన్‌కు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు కోదండరామ్, అజారుద్దీన్‌ల పేర్లను సిఫార్సు చేస్తూ గవర్నర్‌కు పంపించింది.

## ట్రంప్‌కు ఏమైంది

**(1వపేజీ తరువాయి)**ఆరోగ్యంపై ఇటీవల చాలా రూమర్లు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడంతో.. ట్రంప్ మిస్సింగ్ అంటూ ప్రచారం జరుగుతోంది. గతకొన్ని రోజులుగా మీడియా ముందుకురాని ట్రంప్.. ఏదైనా చెప్పాలనుకుంటే మాత్రం తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ ద్వారానే వెల్లడిస్తున్నారు. ఇక ఆగస్ట్ 30, 31వ తేదీల్లోనూ.. ట్రంప్‌కు సంబంధించి ఎలాంటి పబ్లిక్ ఈవెంట్లు లేవని వైట్‌హౌస్ షెడ్యూల్ ద్వారా తెలుస్తోంది. దీంతో ట్రంప్ ఆరోగ్యంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ట్రంప్ అనారోగ్యం బారిన పడ్డారని వార్తలు వస్తున్న వేళ.. ఇటీవల ఆయన చేతిపై గాయాలు కనిపించడం.. సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే ఒక వ్యక్తి ఎక్స్‌లో చేసిన ఓ పోస్ట్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత 24 గంటలుగా ట్రంప్ బయటికి కనిపించలేదు.. మరో 2 రోజులు కూడా ఆయన ఎలాంటి పబ్లిక్ మీటింగ్‌లకు హాజరయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. అసలు ఏం జరుగుతోందంటూ ఆ వ్యక్తి తన పోస్ట్‌లో వెల్లడించాడు. అయితే ట్రంప్ ఆరోగ్యంపై వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని.. ఆయన ఫిట్‌గా ఉన్నారని.. అందుకు ట్రంప్ చేసిన ట్రూత్ సోషల్ పోస్ట్‌లు చెబుతున్నాయని మరికొందరు చెబుతున్నారు. సెప్టెంబర్ 1వ తేదీన కార్మిక దినోత్సవం సందర్భంగా ఆయన.. ఈనెల 30, 31వ తేదీల్లో ఎలాంటి ఈవెంట్లకు హాజరుకావడం లేదని.. అదే కారణమని పేర్కొంటున్నారు. మరోవైపు.. ట్రంప్ అనారోగ్యంపై పదే పదే వార్తలు వస్తున్నాయి. ఇటీవల చేతిపై గాయంతో ట్రంప్ కనిపించడం.. గతంలో ఆ గాయాన్ని దాచేందుకు చేతికి మేకప్ వేసుకొని కనిపించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై ట్రంప్ పర్సనల్ డాక్టర్ సీన్ బార్బబెల్లా ఒక క్లారిటీ ఇచ్చారు. ట్రంప్‌కు గాయం అయింది నిజమేనని వెల్లడించారు. ఆయన తరచూ షేక్ హ్యాండ్స్ ఇవ్వడం, ఆస్ప్రిన్ వాడటం వల్ల ఆ గాయం ఏర్పడినట్లు తెలిపారు. అయితే.. ట్రంప్ సంపూర్ణ ఆరోగ్యంతోనే ఉన్నారని.. సీన్ బార్బబెల్లా తేల్చి చెప్పారు.


## తెలంగాణ అసెంబ్లీ ఫస్ట్ డే

**(1వపేజీ తరువాయి**మంత్రులు సంతాప తీర్మానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఈ తీర్మానం ప్రవేశ పెట్టామని.. మంచి నేత విషయంలో చర్చించేందుకు తమకు భేషజాలు లేవన్నారు. తనకు మాగంటితో అనేక విషయాల్లో సంబంధ బాంధవ్యాలు ఉన్నాయని చెప్పారు. ఆయన మంచి నాయకుడిగా ప్రజల గుర్తింపు సాధించారని తెలిపారు. టీడీపీలో ఉన్నప్పుడు ఇరువురు.. చేసిన పనులను ఈ సందర్భంగా సీఎం చెప్పారు. విద్యార్థి స్థాయిలోనే మాగంటి రాజకీయాల్లోకి వచ్చారని, ఆయన అనేక రంగాల్లో తన ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. విద్యార్థి నేతగా , ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారన్నారు. అనంతరం... పలువురు మంత్రులు కూడా సంతాప తీర్మానంపై ప్రసంగించారు. మండలిలో.. శాసన మండలి సమావేశాలు కూడా శనివారమే ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొత్తగా మండలిలో ప్రవేశించిన వారికి రాజ్యాంగ ప్రతులు అందించారు. అనంతరం వారిని సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమం తర్వాత.. మండలిలోనూ.. సంతాప తీర్మానాలు ప్రవేశ పెట్టారు. మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతిపట్ల సభ్యులు తమతమ భావాలను వ్యక్తం చేశారు. సోమవారానికి వాయిదా.. ఈ సంతాప తీర్మానాల అనంతరం.. ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడనున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | ఆదివారం | 30 । ఆగస్టు । 2025

## ప్రధాని పర్యటనకు ముందు.. వినాయకుడి చిత్రాన్ని షేర్ చేసిన చైనా..!






**బీజింగ్-నవభూమి:**ప్రధాని నరేంద్ర మోదీ జపాన్ పర్యటన ముగించుకొని చైనాకు బయలుదేరారు. ప్రధాని చైనా పర్యటనకు ముందు శనివారం భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. భారత్-చైనా కళ, విశ్వాసం, సంస్కృతులను పంచుకున్నాయని పేర్కొంది. చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి యు జింగ్ ట్వీట్ చేస్తూ.. 'చైనాలోని టాంగ్ రాజవంశం, మొగావో గుహలలో గణేశుడి ప్రతిమను చూడవచ్చు! శతాబ్దాల కిందట చైనా, భారత్ కళ, విశ్వాసం, సంస్కృతిని ఎలా పంచుకున్నాయనేదానికి ఇది రుజువు' పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు చైనాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతారు. భారతదేశం-అమెరికా మధ్య సుంకాల వివాదం కొనసాగుతున్న సమయంలో భారత్, చైనా తమ సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చైనా పర్యటన కీలకంగా పరిగణిస్తున్నారు. భారత్-చైనా దేశాలు వేల సంవత్సరాల నుంచి సాంస్కృతిక, చారిత్రక సంబంధాలను కలిగి ఉన్నాయి. రెండుదేశాల మధ్య నమ్మకం, సహకారానానికి సాంస్కృతిక దౌత్యం కీలకమైందని నిపుణులు పేర్కొంటున్నారు. చైనాలోని భారత రాయబార కార్యాలయం రెండు దేశాల మధ్య చారిత్రక సంబంధాలను సైతం ప్రస్తావించింది. చైనాలోని భారత రాయబార కార్యాలయం 'భారత్-చైనా మధ్య సంబంధాల గురించి కనీసం రెండో శతాబ్దం నుంచి లిఖితపూర్వకంగా రికార్డులు ఉన్నాయి.

## హార్ట్ సర్జన్‌కు గుండెపోటు.. హాస్పిటల్‌లో రౌండ్స్‌లో ఉండగా కుప్పకూలిపోయాడు



**చెన్నై-నవభూమి:**ఆయనో యువ హార్ట్ సర్జన్ విధుల్లో భాగంగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హృద్రోగులను పరిశీలిస్తున్నారు. ఇంతలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తోటి వైద్యులు ఎంత ప్రయత్నించిన లాభం లేకుండాపోయింది. ఈ ఘటన చెన్నైలోని ఓ హాస్పిటల్‌లో చోటుచేసుకున్నది. 39 ఏండ్ల డాక్టర్ గ్రాడ్లిన్ రాయ్ చెన్నైలోని సవితా మెడికల్ కాలేజీలో కార్డియాక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. గత బుధవారం విధుల్లో భాగంగా రౌండ్స్ నిర్వహిస్తుండగా కుప్పకూలిపోయాడు. తోటి వైద్యులు అతడిని రక్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. సీపీఆర్‌తోపాటు అత్యవసర అంజియోప్లాస్టీ, ఇంట్రా-ఆరోటిక్ బెలూన్ పంప్, ఈసీఎంఓ చేసినప్పటికీ వైద్యులు డాక్టర్ గ్రాడ్లిన్ ప్రాణాలను నిలుపలేకపోయారని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ చెప్పారు. 30 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్సున్న యువ వైద్యులు ఆకస్మికంగా గుండెపోటు బారినపడటం సాధారణ విషయం కాదన్నారు. పని ఒత్తిడి, సరిగా ఆహారం తినక పోవడం, గంటల తరబడి విధులు నిర్వహించడం వల్ల ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని వెల్లడించారు. డాక్టర్లు రోజులో 12 నుంచి 18 గంటలపాటు పనిచేస్తున్నారని, కొన్నిసార్లు ఒకే షిఫ్ట్‌లో 24 గంటల కంటే అధికంగా విధులు నిర్వహించాల్సి వస్తుందని చెప్పారు. దీనివల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా భారీ అంచనాలు, మెడికో లీగల్ కేసులు, చావో రేవో తేల్చుకోవాల్సిన సందర్భాలు కూడా ఒత్తిడికి కారణమవుతున్నాయని తెలిపారు. వీటికితోడు అనారోగ్యకరమైన జీవన విధానం, శారీరక వ్యాయామం లేకపోవడం, తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోకపోవడం కూడా గుండె పోటుకు కారణమవుతున్నాయని చెప్పారు.

## శాశ్వత శత్రువులు శాశ్వత మిత్రులు ఉండరు.. రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆత్మనిర్భర్ భారత్, రక్షణ రంగంలో స్వయం సమృద్ధి అత్యావశ్యకమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశాల మధ్య శాశ్వత శత్రుత్వం, శాశ్వత మిత్రత్వం అనేది ఉండదని, శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని నొక్కిచెప్పారు. అమెరికాతో టారిఫ్ ఉద్రిక్తతలు, ప్రధాన మంత్రి మోదీ చైనా పర్యటనలో నేపథ్యంలో ఇండియా-చైనా సంబంధాలపై భారత్ అనుసరిస్తున్న వైఖరిని ఆదివారంనాడిక్కడ జరిగిన ఓ జాతీయ మీడియా సదస్సులో రాజ్‌నాథ్ వివరించారు.

ముఖ్యాంశాలు..1. మన వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా ఆత్మనిర్భరత అనేది చాలా ముఖ్యం. మనకు శాశ్వత శత్రుత్వం, శాశ్వత మిత్రత్వం అనేది ఉండదు. శాశ్వత ప్రయోజనాలే ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యపరంగా యుద్ధం తరహా పరిస్థితి ప్రస్తుతం ఉంది. అమెరికా అధ్యక్షుడు భారత్ వస్తువులపై 50 శాతం సుంకం విధించారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఇండియా రాజీ పడదు. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా భారతదేశం రైతులు, చిన్న వ్యాపారులు, దుకాణదారులు, పశువుల పెంపకందారులు, సాధారణ ప్రజానీకం ప్రయోజనాలకు నిరంతరం ప్రాధాన్యతనిస్తుంది. ఇండియా ఎవరినీ శత్రువుగా భావించదు. ఇదే సమయంలో ప్రజల ప్రయోజనాలకు భంగం కలగనీయం.

2. సెల్ఫ్ రిలయెన్స్ అనేది కేవలం అడ్వాంటేజ్ కాదు, అనివార్యం. ప్రపంచం వేగంగా మారుతోంది. కొత్త సవాళ్లు పుట్టుకొస్తున్నాయి. రక్షణరంగంలో ఇతరులపై ఎంతోకాలం ఆధారపడలేం. ప్రస్తుత పరిస్థితుల్లో స్వయం సమృద్ధి ఇటు ఆర్థిక వ్యవస్థకు మన భద్రతకు చాలా ముఖ్యం.

3. భవిష్యత్ యుద్ధ నౌకలన్నీ దేశీయంగానే తయారవుతారు. త్వరలోనే సుదర్శన్ చక్ర డిఫెన్స్ సిస్టంను ఆవిష్కరించనున్నాం.

4.స్వదేశీ డిఫెన్స్ సిస్టమ్‌ల సమర్థత ఏమిటో పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో చాటి చెప్పాం.

5.2014లో రూ.700 కోట్లు ఉన్న రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఇవాళ రూ.24,000 కోట్లకు పెరిగాయి. దిగుమతుదారు నుంచి ఎగువతిదారుగా భారత్ ఎదిగింది.

## గర్భిణిని చేసి మోసం చేశాడు..




**చెన్నై-నవభూమి:**తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భిణిని చేశాడంటూ నటుడు మాదంపట్టి రంగరాజ్‌పై ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ జాయ్ కిరిసిల్డా ఆరోపించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం చెన్నై నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ... మాదంపట్టి రంగరాజ్ మాదంపట్టి కేటరింగ్ సంస్థను నడుపుతుండగా, ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు తనతో పరిచయం ఏర్పడిందన్నారు.ఆ తర్వాత చెన్నైలోని ఓ ఆలయంలో పెళ్లి చేసుకుని ఒకే ఇంటిలో కాపురం ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం తాను ఆరు నెలల గర్భిణిని అని, ఈ నేపథ్యంలో తనను వదిలివెళ్ళిపోయారని పేర్కొన్నారు. తనను పెళ్లి పేరుతో మోసం చేశారని, అందువల్ల ఆయనపై తగిన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

## ఓట్ల చోరీపై అప్రమత్తంగా ఉండండి..

**చెన్నై-నవభూమి:**బిహార్ తరహాలో రాష్ట్రంలోనూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - సర్) పేరుతో ఓట్ల చోరీకి పాల్పడే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయంలో పార్టీ శ్రేణులు, ప్రత్యేకించి పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జిలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. నగరంలో శుక్రవారం ఉదయం జరిగిన డీఎంకే న్యాయవిభాగం కార్యదర్శి, ఎంపీ ఎన్ఆర్ ఇళంగో కుమార్తె రాఘవి వివాహ వేడుకల్లో ఆయన సతీమణి దుర్గాస్టాలిన్‌తో పాటు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## ఇండోర్ జబ్ వి మెట్ స్టోరీ: ప్రియుడిని పెళ్లాడేందుకు వెళ్లి.. మరొకరిని వివాహమాడి తిరిగొచ్చింది!



**ఇండోర్-నవభూమి:** మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఓ ఘటన.. ఒకప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'జబ్ వుయ్ మెట్' సినిమా కథను తలపించింది. ప్రేమికుడిని పెళ్లాడేందుకు ఇల్లు వదిలి పారిపోయిన ఒక యువతి.. అనూహ్యంగా మరొకరిని పెళ్లాడి తిరిగి ఇంటితి రావడంతో ఈ ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ యువతి తీసుకున్న నిర్ణయం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు సినిమా స్క్రిప్ట్‌ను తలపిస్తూ సంతోషకరమైన ముగింపునకు చేరుకున్నాయి. మరి ఆ కథ ఏంటో మనమూ ఇప్పుడు తెలుసుకుందామా..?ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. ఇండోర్‌కు చెందిన 18 ఏళ్ల శ్రద్ధా తివారీ అనే యువతి సార్థక్ అనే తన ప్రియుడిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. పెద్దల అంగీకారం లభించదని భావించి ఆగస్టు 23వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. రైల్వే స్టేషన్‌లో ప్రియుడి కోసం ఎదురు చూసింది. గంటలు గడుస్తున్నా అతడు అక్కడికి రాకపోవడంతో.. పదే పేద ఫోన్ చేసింది. మొదట్లో ఫోన్ లిఫ్ట్ చేయకపోయినా చివరకు ఫోన్ లేపాడు. నాకు నిన్ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని తేల్చి చెప్పాడు. ఊహించని ఈ పరిణామంతో శ్రద్ధా మనసు పూర్తిగా విరిగిపోయింది.ఎటు వెళ్లాలో తెలియక, ఏం చేయాలో తోచని స్థితిలో కనిపించిన రైలు ఎక్కేసింది. ఆ రైలు ఆమెను రత్లామ్ అనే పట్టణానికి తీసుకెళ్లింది. అక్కడ రైలు దిగిన శ్రద్ధా తివీరా.. ఓ బెంచీపై కూర్చుని ఏం చేయాలా అని ఆలోచిస్తూ, తనలో తానే మదన పడుతూ కూర్చుంది. అయితే అప్పుడే అక్కడకు శ్రద్ధా చదివిన కాలేజీలోనే చదువుకున్న కరణ్ అనే యువకుడు వచ్చాడు. కంటతడి పెడుతూ కూర్చున్న శ్రద్ధను చూసి ఏమైందని అడిగాడు. అప్పటి వరకు తనలో తాను బాధతో కుంగిపోయిన శ్రద్ధకు.. తెలిసిన వ్యక్తి కనిపించగా అతడిని పట్టుకుని ఏడ్చేసింది. తనకు జరిగిందంతా చెప్పేసింది. దీంతో అతడు తిరిగి ఇంటికి వెళ్లిపోమని సూచించాడు.కానీ శ్రద్ధా తివారీ అందుకు అంగీకరించలేదు. పెళ్లి చేసుకోకుండా ఇంటికి తిరిగి వెళ్లలేనని.. అలా వెళ్తే తాను బతికి ఉండలేనని స్పష్టం చేసింది. ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్న కరణ్.. క్షణం కూడా ఆలోచించకుండా నన్ను పెళ్లి చేసుకుంటావా అని అడిగాడు. అందుకు శ్రద్ధా కూడా సరేనని చెప్పింది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి మహేశ్వర్-మండలేశ్వర్‌కు వెళ్లి అక్కడి ఆలయంలో నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నారు. అక్కడి నుంచి మందసౌర్‌కు బయలుదేరారు. మధ్యలో హోటల్ గది దొరకకపోవడంతో.. శ్రద్ధా తన తండ్రి అనిల్ తివారీకి ఫోన్ చేసి, తాను సురక్షితంగా ఉన్నానని, పెళ్లి కూడా చేసుకున్నానని తెలిపింది. మొదట షాక్‌కు గురైన ఆమె తండ్రి.. ఆ తర్వాత పరిస్థితిని అర్థం చేసుకుని వారిద్దరికీ ఇండోర్‌కు తిరిగి రావడానికి రైలు టికెట్ల కోసం కొంత డబ్బు పంపించాడు.విధి ఆడిన నాటకంలో ఇద్దరూ చివరికి ఇండోర్ చేరుకున్నారు. కరణ్ స్వయంగా శ్రద్ధాను ఇండోర్‌లోని ఎంఐజీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ పోలీసులు శ్రద్ధా తండ్రి అనిల్ తివారీకి సమాచారం అందించారు. శ్రద్ధా, కరణ్ ఇద్దరినీ పోలీసులు వారి తండ్రి ముందు ప్రవేశపెట్టారు. అన్ని విషయాలు తెలుసుకున్న అనిల్ తివారీ.. మొదట కొద్దిగా కలత చెందినా, ఆ తర్వాత తన కూతురు క్షేమంగా తిరిగి వచ్చినందుకు సంతోషించారు. తన మొదటి ప్రియుడిని మరిచిపోయి, ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఆమె సిద్ధపడటం చూసి ఆయన కూడా వీరి పెళ్లికి అంగీకరించారు. అయితే వారని ఓ పది రోజుల పాటు విడిగా ఉంచుతానని.. ఆ తర్వాత కూడా వీరిద్దరూ పెళ్లి చేసుకోవానుకుంటే వివాహం జరిపిస్తానని హామీ ఇచ్చాడు.

## కోచింగ్ సెంటర్ టెర్రస్ పైనుంచి దూకబోయిన నీట్ విద్యార్థిని..



దేశవ్యాప్తంగా నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు, ఆత్మహత్యా యత్నాలు ఆగడం లేదు. ఇష్టం లేని చదువులు చదవలేక.. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టలేక.. చాలా మంది యువకులు, యువతులు ప్రాణాలు తీసుకుంటున్న సంఘటనలు ఇటీవలి కాలంలో చాలా చూస్తున్నాం. ఇష్టం లేక కొందరు.. ఎంత చదివినా అది బుర్రకెక్కక మరికొందరు.. బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అదే సమయంలో నీట్ అంటే పరీక్షల ఒత్తిడి, మార్కుల టెన్షన్ ఉంటుంది. వాటిని తట్టుకోలేక.. నీట్‌లో సీటు రాదనే భయాలు.. రిజల్ట్స్ భయాలతో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక నీట్ కోచింగ్‌లకు దేశవ్యాప్తంగా రాజస్థాన్ బాగా ఫేమస్. రాజస్థాన్‌లోని కోటాలో నీట్ విద్యార్థుల ఆత్మహత్య చేసుకున్న వార్తలు మనం ఎన్నో చూశాం. తాజాగా రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో అలాంటి సంఘటనే ఒకటి చోటు చేసుకుంది.నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఒక విద్యార్థిని.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో.. ఆత్మహత్యాయత్నం చేసింది. ఒక ప్రముఖ కోచింగ్ సెంటర్‌లో నీట్ కోచింగ్ తీసుకుంటున్న యువతి.. ఆ భవనం పైకెక్కి దూకేస్తానని అందర్నీ బెదిరించింది. దీంతో అక్కడ ఉన్నవారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. చివరికి అక్కడ ఉన్నవారు నచ్చజెప్పి.. దగ్గరికి వెళ్లి ఆమెను అతి కష్టం మీద కిందికి తీసుకువచ్చారు. అనంతరం ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు.

ఈ ఘటనపై స్పందించిన పోలీసులు.. ఆత్మహత్యకు యత్నించిన ఆ విద్యార్థిని.. గత కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతోందని తెలిపారు. నీట్ కోచింగ్‌లో భాగంగా నిర్వహించే పరీక్షలు రాయడం ఆ యువతి మానేసిందని.. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే తిడతారని భయపడి.. ప్రాణాలు తీసుకోవాలనే కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇక ఆ యువతి.. బిల్డింగ్ పైకి ఎక్కి.. దూకేందుకు ప్రయత్నించగా.. అక్కడ ఉన్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో తెగ వైరల్ అవుతోంది. ఆ విద్యార్థిని.. కోచింగ్ సెంటర్ బిల్డింగ్ అంచున కూర్చొని.. కాళ్లను వేలాడ దీసి.. కిందికి దూకేస్తానని బెదిరించడం ఆ వీడియోల్లో కనిపిస్తోంది. అది గమనించిన కోచింగ్ సెంటర్ సిబ్బంది, స్థానికులు.. ఆ యువతిని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు కూడా ఆ వీడియోలో ఉన్నాయి. యువతి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించడంతో.. ఆ రోడ్డుపై భారీగా జనం గుమిగూడారు.

### జపాన్ నుంచే ట్రంప్‌కి హెచ్చరిక..

## చైనాతో బంధంపై మోదీ కీలక వ్యాఖ్యలు



**జపాన్-నవభూమి:**జపాన్ పర్యటనలో చైనాతో సంబంధాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనాతో బలమైన సంబంధాలు చాలా కీలకమని, ఇవి ప్రాంతీయ , శ్రేయస్సు, శాంతిపై సానుకూల ప్రభావం చూపుతాయని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని తీసుకొస్తాయని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతమే లక్ష్యంగా రెండు రోజుల జపాన్ పర్యటనకు వెళ్లిన మోదీ... భారత్ కొనుగోలుచేయా లనుకుంటోన్న అధునాతన బుల్లెట్ రైలు ఈ10 షింకాన్‌సెన్ తయారీ పరిశ్రమ సహా నాలుగు ఫ్యాక్టరీలను సందర్శిస్తారు. అలాగే, రక్షణ, వాణిజ్య, టెక్నాలజీ, వ్యాపారం రంగాల్లో ఒప్పందాలు చేసుకోనున్నారు.జపాన్ పర్యటన ముగించుకుని అటు నుంచి అటే మోదీ చైనాకు పయనమవుతారు. షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ)లో పాల్గొంటారు. ఎస్-సీఓలో రష్యా, ఇరాన్, కిజికిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్‌లు కూడా సభ్యులుగా ఉన్నాయి. మోదీ జపాన్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ఇక్కడ నుంచి తియాజిన్ (చైనా)కు వెళ్తున్నాను.. గతేడాది రష్యాలోని కజాన్‌లో జిన్‌పింగ్‌తో భేటీ తర్వాత మా ద్వైపాక్షిక సంబంధాల్లో స్థిరమైన, సానుకూల పురోగతి ఉంది' అని మోదీ వ్యాఖ్యానించారు."భూమిపై రెండు అతిపెద్ద దేశాలైన భారత్, చైనాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపుతాయి..'అని ఇటీవల ఢిల్లీలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జరిగిన భేటీ అనంతరం మోదీ వ్యాఖ్యానించారు. 'ఇది భిన్నధ్రువ ఆసియా, ప్రపంచానికి కూడా అత్యంత ముఖ్యం' అని అన్నారు.

ఉక్రెయిన్- రష్యా యుద్ధం, గాజాపై ఇజ్రాయెల్ దాడులు, అమెరికా 50 శాతం సుంకాలతో తలెత్తిన ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ సంక్షోభాన్ని భారత్ ఎదుర్కొంటుంది. ఈ తరుణంలో ఎస్‌సీఓ సభ్య దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం జరుగుతోంది. అయితే, అమెరికా అధినేత ట్రంప్ అదనపు సుంకాల నిర్ణయం దశాబ్ద కాలంగా భారత్, చైనాల మధ్య కొనసాగుతోన్న సైనిక ఉద్రిక్తతలకు

## జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్..

### ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు సహా 11 మంది మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:**జమ్మూ కాశ్మీర్‌లోని రాంబన్, రియాసి జిల్లాల్లో ఆకస్మికంగా సంభవించిన భారీ మేఘావృతం (క్లౌడ్‌బర్స్ట్) వినాశనాన్ని సృష్టించింది. ఈ భీకర ప్రకృతి విపత్తులో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగు సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మరెంతో మంది వరదల్లో కొట్టుకుపోయారు. అలాగే అనేక ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున గందరగోళం నెలకొంది.రాంబన్‌లోని రాజ్‌గఢ్ ప్రాంతంలో శుక్రవారం రోజు రాత్రి సంభవించిన ఈ మేఘావృతంతో ఒక్కసారిగా భీకరమైన వరదలు పోటెత్తాయి. వరదల ధాటికి పలు ఇళ్లు, చెట్లు, కరెంటు స్తంభాలు వంటివన్నీ కొట్టుకుపోయాయి. ఈ దుర్ఘటనలో బద్దర్ గ్రామానికి చెందిన 38 ఏళ్ల నజీర్ అహ్మద్ ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయింది. రాత్రిపూట నేరుగా ఈయన ఇంటిపైనే కొండచరియలు విరిగిపడడంతో.. ఇంట్లో నిద్రిస్తున్న నజీర్ అహ్మద్, ఆనయ భార్య, 5 నుంచి 13 ఏళ్ల మధ్య వయసున్న ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. అయితే శిథిలాల కింద నుంచి వీరందరి మృతదేహాలను అధికారులు బయటకు తీశారు.అలాగే రాంబల్ జిల్లాలోని రాజ్‌గ్రా గ్రామంలోనూ కొండచరియలు విరిగిపడగా... ఐదుగురు వ్యక్తులు వరదల్లో కొట్టుకుపోయారు. ఇందులో ఇప్పటికే నలుగురు మృతదేహాలు లభ్యం కాగా.. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. మృతి చెందిన వాళ్లలో ఓం రాజ్, విధియా దేవి, ద్వారకా నాథ్, మరో గుర్తు తెలియని వ్యక్తి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య మరితంగా పెరిగే అవకాశం ఉందని కూడా వివరిస్తున్నారు. అదృశ్యమైన వారి కోసం సహాయక బృందాలు ఇప్పటికీ గాలింపు చేస్తూనే ఉన్నాయి.ఈ భీకర వరదల కారణంగా చాలా గ్రామాలతో బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యంగా జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై పలు చోట్ల కొండ చరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బాధితులకు అవసరమైన ఆహారం, నీరు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. తాజా వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కాశ్మీర్ లోయలోని అన్ని పాఠశాలలను తాత్కాలికంగా మూసివేశారు.గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలే ఈ మేఘావృతానికి, కొండచరియలు విరిగిపడటానికి ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఇండియన్ మెటరలాజికల్ డిపార్ట్‌మెంట్ హెచ్చరికలు జారీ చేసింది. ఆ హెచ్చరికల ప్రకారం రుతుపవనాలు, వెస్ట్రన్ డిస్టర్బెన్స్ కలయిక కారణంగా ఈ విధమైన విపత్తులు సంభవించే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ఈ పరిస్థితి ఇంకా 10 నుంచి 15 రోజుల పాటు కొనసాగే ప్రమాదం ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## చొరబాట్ల స్పెషలిస్ట్ బాగూఖాన్ ఖేల్ ఖతం.. ఎన్‌కౌంటర్‌లో హతం



**శ్రీనగర్-నవభూమి:** జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు మరో విజయాన్ని సాధించాయి. గురెజ్ సెక్టార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. చొరబాట్ల స్పెషలిస్ట్, 100కు పైగా చొరబాట్లకు కారకుడు, ఉగ్రవాద క్యాడెర్‌లో హ్యూమన్ జీపీఎస్‌గా పిలువబడే బాగూఖాన్ ను ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు కాల్చిచంపాయి.సమందర్ చాచాగా కూడా పాపులర్ అయిన బాగూఖాన్ 1995 నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఎలాంటి క్లిష్ట మార్గాలలోనైనా ఉగ్రమూకలను భారత్‌లోకి చొరబడేలా ఇతను సహాయం చేసేవాడు. నౌషెరా నార్ ఏరియాలో మరో ఉగ్రవాదితో కలిసి చొరబాటు ప్రయత్నం చేస్తుండగా భద్రతా దళాలు శనివారంనాడు కాల్చిచంపాయి.సెక్యూరిటీ గ్రిడ్ వర్గాల సమాచారం ప్రకారం, గురెజ్ సెక్టార్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 100కు పైగా చొరబాట్లకు బాగూఖాన్ సూత్రధారిగా వ్యవహరించాడు. ఆ ప్రాంతంలోని రహస్య మార్గాలు అణువణువునా తెలిసి ఉండటంతో చొరబాటు యత్నాలన్నీ దాదాపు విజయవంతమయ్యాయి. బాగూఖాన్ హిజ్బుల్ కమాండర్‌గా ఉన్నప్పుడు గురెజ్ సెక్టార్ నుంచి నియంత్రణ రేఖ వెంబడి దేశంలోకి చొరబడేందుకు ఉగ్ర సంస్థలకు సహకరించేవాడు. ఏళ్ల తరబడి భద్రతా బలగాల కళ్లుకప్పి తిరుగుతున్న బాగూఖాన్ అదృష్టం తాజా చొరబాటు యత్నంలో తిరగబడంది. భద్రతా బలగాలు మట్టుబెట్టడంతో అతని ఆటకట్టింది. దీంతో నౌషెరా ఏరియాలోని ఉగ్రసంస్థల లాజిస్టికల్ నెట్‌వర్క్‌కు గట్టిదెబ్బ తగిలింది.

## 1991 లోక్‌సభ ఎన్నికల్లో నన్ను మోసపూరితంగా ఓడించారు



**బెంగళూరు-నవభూమి:** కొప్పళ లోక్‌సభ స్థానం నుంచి 1991లో తాను జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తనను మోసపూరితంగా ఓడించారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో తనపై కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్ పాటిల్ అన్వరి గెలిచారని, 11,200 కంటే తక్కువ ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని తెలిపారు. అయితే కౌంటింగ్‌లో 22,243 ఓట్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారని, అదే తన ఓటమికి కారణమని, ఆ ఓట్లను లెక్కించి ఉంటే తాను గెలిచేవాడినని వివరించారు. మాజీ అడ్వకేట్ జనరల్ ప్రొఫెసర్ రవివర్మ కుమార్ న్యాయవాద వృత్తిని చేపట్టి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా విధానసౌధలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిద్దరామయ్య నాటి ఎన్నికల గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో రవివర్మ తనకు సాయం చేశారని గుర్తుచేసుకున్నారు. అయితే, ఓట్ల చౌర్యంపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్న తరుణంలోనే సిద్దరామయ్య..అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్‌పాటిల్ తనపై మోసపూరితంగా గెలిచారని చెప్పడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ మోసం చేసి గెలిచినట్లు సిద్దరామయ్యే స్వయంగా ప్రకటించారని బీజేపీ విమర్శించింది.

## అమెరికా మాదిరి సరిహద్దు గోడ కడతారా

**న్యూఢిల్లీ-నవభూమి:** అక్రమ వలసదారులను నిరోధించడానికి అమెరికాలో మాదిరిగా సరిహద్దుల్లో గోడ నిర్మిస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారిని తిప్పి పంపించడానికి అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్ఓపీ) ఏమిటని అడిగింది. వీటిపై సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. బెంగాలీ మాట్లాడుతున్న వలస కార్మికులను బంగ్లాదేశీయులు అన్న అనుమానంతో పలు చోట్ల అదుపులోకి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ వలసదార్ల సంక్షేమ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ ప్రారంభించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఇలాంటి విషయాల్లో అసలైన బాధితులు వేసిన పిటిషన్లను స్వీకరించాలే తప్ప సంస్థలు, సంఘాలు వేసినవి కావని అన్నారు. కొన్ని సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు కూడా ఉందని, కొన్ని ప్రభుత్వాలు అక్రమ వలసదార్ల కారణంగా మనుగడ సాగిస్తున్నాయని తెలిపారు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
ఆదివారం
30 । ఆగస్టు । 2025





## ఎంపీలందరి మద్దతు కోరుతా

**ముంబై- నవభూమి:** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరినీ కోరుతానని ప్రతిపక్షాల అభ్యర్థి బీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి పార్టీలకు అతీతంగా ఎంపీలందరికీ లేఖలు రాస్తానని ప్రకటించారు. ఉపరాష్ట్రపతిగా తనకు అవకాశం లభిస్తే రాజ్యాంగాన్ని కాపాడతానని పేర్కొన్నారు. మహారాష్ట్రలో శుక్రవారం పర్యటించిన బీ సుదర్శన్ రెడ్డి.. శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌ను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన సుదర్శన్‌రెడ్డి.. ఉపరాష్ట్రపతి ఎన్నికను దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీగా చూడడం తగదన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, ఏ పార్టీలోనూ చేరే ఆలోచన కూడా లేదని చెప్పారు. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నికలో తమతోపాటు మహావికాస్ అఘాడీలోని పార్టీలకు చెందిన ఎంపీలందరి మద్దతు ప్రతిపక్షాల అభ్యర్థికేనని తన కలిసిన బీ సుదర్శన్‌రెడ్డికి ఉద్ధవ్ ఠాక్రే హామీ ఇచ్చారు. దేశం మీద ప్రేమ ఉన్న ఎన్డీఏ ఎంపీలంతా ఉపరాష్ట్రపతి ఎన్నికలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీ సుదర్శన్‌రెడ్డికే ఓటేస్తారని ఠాక్రే తెలిపారు. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని రాజ్‌భవన్‌లో అరెస్టు చేయించిన వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి ఏం గౌరవం తీసుకొస్తారంటూ ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి ఎన్‌సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్ ప్రశ్నించారు. సీపీ రాధాకృష్ణన్ ఝార?ండ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరేన్‌ను రాజ్‌భవన్‌లోనే అరెస్టు చేయించిన విషయాన్ని పవార్ గుర్తు చేశారు. రాధాకృష్ణన్‌కు వ్యవస్థలపై ఎలాంటి గౌరవం ఉందో ఆ అరెస్టు చెబుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో భేటీ అనంతరం పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## సుంకాల సమరం - భారత్-అమెరికా

భారత్-అమెరికా సంబంధాలు అంతర్జాతీయ రాజకీయాల చరిత్రలో ఎన్నో మలుపులు చూశాయి. కానీ ఇటీవల సుంకాల సమరం ఈ సంబంధాలపై గాఢమైన మబ్బులను కమ్మేసింది. కొన్ని దశాబ్దాల కిందట 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం'గా భారత్‌ను, 'ప్రపంచంలోనే శక్తివంతమైన ప్రజాస్వామ్యం'గా అమెరికాను మిత్రదేశాలుగా ఊహించారు. ఒకరికి ఒకరు అండగా నిలబడతారని, వ్యూహాత్మకంగా సహకరిస్తారని భావించారు. అయితే నేటి దృశ్యం మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. మోదీ-ట్రంప్ మధ్య వ్యక్తిగత అనుబంధం అంతకంతకూ దెబ్బతింటూ వచ్చింది. తొలివిడతలో ట్రంప్ బేషరతు మద్దతుతో భారత్ పాక్‌పై వ్యూహాత్మక ఒత్తిడి తెచ్చుకున్నా, ఆ తరువాత కాలంలో పరిస్థితులు మారాయి. యుద్ధాన్ని నేనే ఆపానని ముప్పైసార్లు చెప్పుకున్న ట్రంప్, పాకిస్థాన్‌పై భారత్ ఏకపక్ష ధైర్యాన్ని ప్రదర్శించినప్పుడు ఓ మోస్తరు ఆమోదం తెలిపివుంటే బాగుండేదని కొందరు విశ్లేషకులు అంటున్నారు. కానీ అది జరగలేదు. దీనికి తోడు వాణిజ్య రంగంలో పాతికశాతం అదనపు సుంకం అమలు నిర్ణయం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత కఠినంగా మార్చింది. భారత్ ప్రభుత్వం తొలుత నిశ్శబ్దంగా స్పందించింది. కొన్నాళ్లకు 'ఏ ఒత్తిళ్లు లేవు, ఎలాంటి ఫోన్లు లేవు' అని వివరణ ఇచ్చింది. కానీ అమెరికా ఉపాధ్యక్షుడి ఫోన్‌కు మోదీ ప్రభుత్వం గట్టి సమాధానం ఇచ్చామని తర్వాత పేర్కొంది. ఈ కలగాపులగమైన స్పందన ట్రంప్ ఆగ్రహానికి కారణమైందని వాదన ఉంది. భారతీయ వర్గాలు మాత్రం చివరి నిమిషంలో ట్రంప్ సడలింపు ఇస్తారని ఆశపడ్డాయి. కానీ అది జరగకపోవడం మరింత నిరాశ కలిగించింది. ఆగస్టు 25న రావాల్సిన అమెరికా వాణిజ్య చర్చల బృందం పర్యటనను రద్దు చేసుకోవడం ఈ ప్రతిష్ఠంభన ఎంత తీవ్రంగా ఉందో స్పష్టంగా చూపించింది. అమెరికా ఇప్పుడు భారత్‌పై ఉక్రెయిన్ యుద్ధం దృష్టికోణంలో విమర్శలు గుప్పిస్తోంది. చవుకగా రష్యన్ క్రూడ్ కొని, శుద్ధి చేసి ఎగుమతి చేస్తూ భారతీయ కుటుంబాలు లాభపడ్డాయంటూ ఆరోపణలు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడి వాణిజ్య సలహాదారు వరకు వెళ్లి, ఉక్రెయిన్ యుద్ధాన్ని 'మోదీ యుద్ధం'గా అభివర్ణించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తత ఎంత పెరిగిందో చెబుతోంది. ఇక మరోవైపు భారత్ మాత్రం వెనక్కి తగ్గే సూచనలేమీ చూపించడం లేదు. రష్యాతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని సంకల్పించింది. రష్యా, చైనా అనే రెండు శక్తివంతమైన దేశాలతో సమీపత పెంచుకోవడం ద్వారా అమెరికా ఒత్తిడిని ఎదుర్కోవాలని ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా గతంలో శత్రువులా వ్యవహరించిన చైనా, ఈ సందర్భంలో అనూహ్యంగా భారత్‌కు దగ్గరవడం గమనార్హం. అత్యున్నత స్థాయి చర్చలు, భేటీలు భారత్‌కు భరోసా కలిగిస్తున్నాయి. ప్రధాని మోదీ ధైర్యవచనాలు పలుకుతున్నారు. ఎంత ఒత్తిడి వచ్చినా తగ్గేది లేదని, రైతులు, చిరు వ్యాపారులకు నష్టం రానివ్వబోమని హామీ ఇస్తున్నారు. ఆయన నోటివెంట మళ్లీ 'స్వదేశీ', 'ఆత్మనిర్భరత' వంటి నినాదాలు వినిపిస్తున్నాయి. అమెరికా స్థానంలో కొత్త మార్కెట్లు దొరుకుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి ట్రంప్ సుంకాల ప్రభావం ఇప్పటికే అనేక పరిశ్రమలపై పడటం ప్రారంభమైంది. లక్షలాది మందికి ఉపాధి కల్పించే రంగాలపై మబ్బులు కమ్ముకున్నాయి. అమెరికా ఎందుకు భారతపై మాత్రమే ఇంత తీవ్రంగా చర్యలు తీసుకుంటోంది అన్నది కూడా చర్చనీయాంశం. భారత్ కంటే రెట్టింపుగా రష్యన్ క్రూడ్ కొంటున్న చైనాపై అమెరికా ఎందుకు ఇంత సడలింపుగా ఉంది? చమురు ఒక కారణమే కావచ్చు, కానీ మరిన్ని వ్యూహాత్మక, భౌగోళిక రాజకీయ కారణాలు కూడా దాగి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ట్రంప్ వ్యక్తిత్వం కూడా ఈ సంక్షోభానికి కారణమైంది. ఆయన "మాగా" అనే అజెండా కింద రక్షణాత్మక విధానాలను మరింత కఠినతరం చేస్తున్నారు. మోదీ "మిగా" అనే ఆలోచనతో కలిసే దారిలో ఒకప్పుడు ఆశలు పెట్టుకున్నా, నేడు పరిస్థితి పూర్తి విరుద్ధంగా మారింది. ఉభయ దేశాల పరస్పర ప్రయోజనాలను పక్కన పెట్టి ట్రంప్ దూకుడుతో వాణిజ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేశారని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో సుంకాల సమరం త్వరగా ముగిసేలా కనిపించడం లేదు. ఎవరు రాజీపడతారనే సూచనలు కూడా కనబడడం లేదు. రష్యాతో, చైనాతో భారత్ సంబంధాలను మరింత బలపరిచే అవకాశం ఈ సంక్షోభం ద్వారా కలుగుతోంది. కానీ అదే సమయంలో అమెరికా మార్కెట్ నుంచి దూరమవడం భారత్ ఆర్థిక వ్యవస్థకు చిన్న షాక్ కాదు. భారత్-అమెరికా సుంకాల సమరం కేవలం వాణిజ్య యుద్ధం కాదు. ఇది భౌగోళిక రాజకీయాల సమీకరణాలను కూడా మార్చేస్తోంది. అమెరికా ఒకప్పుడు వ్యూహాత్మక మిత్రుడిగా ఉన్నా, ఇప్పుడు అదే భార?త్ వృద్ధిని అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ప్రవర్తిస్తోందనే భావన పెరుగుతోంది. మరోవైపు భారత్ తన స్వీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి రష్యా, చైనా వైపు మరింతగా వాలి పోతున్నది. ప్రపంచ రాజకీయాలు ఒక కొత్త సమీకరణ దిశగా సాగుతున్నాయి. ఈ సమరంలో గీతలు చెరగనిదే, రాజీకి రానిదే సుంకాల యుద్ధం కొనసాగుతుంది. అయితే దీని ఫలితాలు లక్షలాది భారతీయుల జీవనాధారంపై, ప్రపంచ ఆర్థిక వాతావరణంపైనా లోతైన ప్రభావం చూపే అవకాశముంది.

# కేంద్రీకృత బోధన - ఆంగ్లవిద్య నైపుణ్యాలు



రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ సౌత్ ఇండియా 1963 లో స్థాపించబడిన భారత దేశంలో ఒక ప్రముఖ సంస్థ. ఇది ఆంగ్ల భాషా విద్య కోసం స్థాపించబడింది. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి ల ఆంగ్ల భాషా అవసరాలను తీరుస్తుంది. ఇనిస్టిట్యూట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు అందించే స్వల్ప మరియు దీర్ఘకాలిక ఇన్ - సర్వీస్ శిక్షణా కార్యక్రమాలు వారి ఆంగ్ల భాషా ప్రావీణ్యం, వృత్తిపరమైన నైపుణ్యాలు విషయ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. పాఠ్యాంశ సంస్కరణలు, సిలబస్ అవసరాలు, బోధన-అభ్యాస వనరులు, అభ్యాస సాంకేతికతల ఏకీకరణ, పరీక్ష మూల్యాంకనంలో సంస్కరణల పరంగా ఈ రంగంలోని సమస్యలు మరియు ధోరణుల గురించి అవగాహనను సృష్టిస్తాయి. ఈ శిక్షణ ద్వారా ప్రముఖ అధ్యాపక సభ్యులు వివిధ బోధనా పద్ధతులు, విధానాలు మరియు పద్ధతులను అన్వేషిస్తారు. పాల్గొనేవారిని వారి స్వంత తరగతి గది బోధనను అంచనా వేయడానికి, మెరుగుపరచడానికి సహాయపడే ప్రతిబింబ పద్ధతులలో నిమగ్నం చేస్తారు. పాల్గొనేవారికి వారి ఆంగ్ల భాషా జ్ఞానం మరియు నైపుణ్యాలను నవీకరించడానికి, అలాగే వారి ఆంగ్ల భాషా నైపుణ్యాలను అభ్యసించడానికి మరియు పదును పెట్టడానికి ఒక శక్తివంతమైన వేదికను అందించడం. తరగతి గది బోధన, సమీక్ష, సుసంపన్నం మరియు ప్రభావవంతమైన అంచనా సాధనాలు మరియు విధానాల తయారీ అమలు కోసం బోధనా-అభ్యాస సామగ్రిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడే విద్యా సాంకేతికతతో సహా వృత్తిపరమైన నైపుణ్యాలను పొందేందుకు పాల్గొనేవారికి అవకాశాలను అందించడం. చదవడం పట్ల మక్కువను పెంపొందించడం సృజనాత్మక రచనతో సహా వారి స్వంత రచనను మెరుగుపరుచుకోవడానికి వారిని ప్రోత్సహించడం. ఇంగ్లీష్ భాష నేర్చుకోవడం వేగవంతం కావడానికి దారితీసే వివిధ కార్యకలాపాలలో అభ్యాసకులు పాల్గొనగలిగే ఆసక్తికరమైన, ప్రభావవంతమైన మరియు వినూత్నమైన బోధనా మార్గాలను రూపొందించడంలో ప్రణాళిక చేయడంలో



ఆచరణాత్మక అనుభవాన్ని అందించడం. ఉపాధ్యాయ-అభ్యాస పాత్రలను అర్థం చేసుకోవడంలో అవగాహనను సృష్టించడం మరియు ఉపాధ్యాయుడు, అభ్యాసకుడు, పాఠశాల మరియు సమాజం మధ్య ఉన్న సంబంధంపై అన్ని వృత్తిపరమైన నైతిక చిక్కులతో అంతర్దృష్టిని పొందడం. ఉపాధ్యాయ పాల్గొనేవారు అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని గ్రహించేలా చేయడం ఈ ప్రక్రియ జీవితాంతం ఉంటుంది. ఉపాధ్యాయులకు సమకాలిక మరియు అసమకాలిక మోడ్‌లలో ఇంగ్లీష్ బోధించడానికి అవసరమైన నైపుణ్యాలను అందించే ఆన్‌లైన్ వనరులు మరియు సాంకేతిక సాధనాలను పంచుకోవడం. అన్నింటికంటే ముఖ్యంగా, సమర్థవంతమైన తరగతి గది పరస్పర చర్య మరియు కంటెంట్ లావాదేవీల కోసం బాగా కమ్యూనికేట్ చేయగల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం. సమగ్ర విద్య అనేది బోధన మరియు అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వబడిన ఒక విధానం, ఇక్కడ పిల్లలందరూ వారి సామర్థ్యాలు, వైకల్యాలు, నేపథ్యాలు లేదా తేడాలతో సంబంధం లేకుండా ఒకే తరగతి గది మరియు పాఠశాల వాతావరణంలో కలిసి నేర్చుకుంటారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య సమాన అవకాశాల హక్కు ఉందనే నమ్మకంపై ఇది ఆధారపడి ఉంటుంది. సమగ్ర విద్య యొక్క కేంద్ర ఆలోచన అంగీకారం మరియు వైవిధ్యం. ఇది వైకల్యాలు లేదా అభ్యాస ఇబ్బందులు ఉన్న పిల్లలను ప్రత్యేక పాఠశాలలుగా విభజించదు, బదులుగా ప్రతి అభ్యాసకుడి అవసరాలను తీర్చడానికి ప్రధాన స్రవంతి పాఠశాల వ్యవస్థను అనుసరిస్తుంది. దీని అర్థం శారీరక, మానసిక, భావోద్వేగ లేదా సామాజిక సవాళ్లు ఉన్న పిల్లలకు సవరించిన బోధనా పద్ధతులు, సహాయక పరికరాలు, కౌన్సెలింగ్ మరియు సహచరుల సహకారం ద్వారా మద్దతు ఇవ్వబడుతుంది. సమగ్ర విద్య సమానత్వం, భాగస్వామ్యం మరియు గౌరవాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది పిల్లలు తమ నుండి భిన్నంగా ఉండే తోటివారితో కలిసి నేర్చుకోవడం ద్వారా సానుభూతి, సహనం సహకారాన్ని అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. ఇది వివక్షను తగ్గిస్తుంది మరియు వైవిధ్యం సమాజంలో భాగమైన నిజ జీవిత పరిస్థితులకు విద్యార్థులను సిద్ధం చేస్తుంది. యూనెస్కో ప్రకారం, సమగ్ర విద్య అనేది పాఠశాలలకు ప్రాప్యతను అందించడం గురించి మాత్రమే కాదు, ప్రతి బిడ్డ విలువైనదిగా, మద్దతుగా మరియు విజయం సాధించగలరని భావించే అభ్యాస వాతావరణాన్ని సృష్టించడం గురించి కూడా. ఉపాధ్యాయులు సరళమైన బోధనా పద్ధతులు, విభిన్న బోధన మరియు సానుకూల తరగతి గది నిర్వహణను ఉపయోగించడం ద్వారా కీలక పాత్ర పోషిస్తారు.

బోధన-అభ్యాస విధానంలో భాగంగా శిక్షణలో ఉపన్యాస-ఆధారిత అభ్యాసం కేంద్రీకృతమై ఉంటుంది, ఇక్కడ విద్యార్థులు ఉపాధ్యాయుడిని నిష్క్రియాత్మకంగా వినడానికి బదులుగా తరగతి గదిలో పరస్పర చర్య, చర్చ వ్యక్తీకరణ ద్వారా చురుకుగా నేర్చుకుంటారు. ఇక్కడ, ఉపన్యాసం అంటే సంభాషణలు, చర్చలు, సంభాషణలు, ప్రెజెంటేషన్లు లేదా వ్రాతపూర్వక వ్యక్తీకరణల రూపంలో కమ్యూనికేషన్ విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకున్నప్పుడు, ప్రశ్నించినప్పుడు, వివరించినప్పుడు, వాదించినప్పుడు ప్రతిబింబించినప్పుడు అభ్యాసం ఉత్తమంగా జరుగుతుందనే ఆలోచన ఉంది. అభ్యాసకులు అర్థవంతమైన సంభాషణలో పాల్గొనే మరియు కలిసి జ్ఞానాన్ని నిర్మించే పరిస్థితులను ఉపాధ్యాయులు సృష్టిస్తారు. విద్యార్థి-కేంద్రీకృత బోధన అనేది విద్య కోసం శిక్షణా ప్రక్రియలో దృష్టి కేంద్రీకరించబడిన విధానం, ఇక్కడ దృష్టి ఉపాధ్యాయుడిపై కాకుండా అభ్యాసకుడిపై ఉంటుంది.

ఈ పద్ధతిలో, విద్యార్థులు అభ్యాస ప్రక్రియలో చురుకైన భాగస్వాములు. ఉపాధ్యాయుడు అందించే సమాచారాన్ని గుర్తుంచుకోవడానికి బదులుగా జ్ఞానాన్ని అన్వేషించడానికి, ప్రశ్నించడానికి, చర్చించడానికి మరియు అన్వయించడానికి వారిని ప్రోత్సహిస్తారు. ఉపాధ్యాయుడి పాత్ర జ్ఞానాన్ని ఇచ్చేవాడు నుండి సులభతరం చేసేవాడు, మార్గదర్శి మరియు గురువుగా మారుతుంది. ఈ విధంగా, విద్యార్థులు వారి సామర్థ్యాలు, ఆసక్తులు మరియు అవసరాల ఆధారంగా వారి స్వంత వేగంతో నేర్చుకుంటారు. ఉపాధ్యాయులు తమ సొంత బోధనా పద్ధతులను మెరుగుపరచుకోవడానికి మరియు తరగతి గది సమస్యలను పరిష్కరించడానికి నిర్వహించే క్రమబద్ధమైన, ప్రతిబింబించే విచారణగా కార్యాచరణ పరిశోధనను ప్రోత్సహించడం. భాషా ఉపాధ్యాయుడికి, దీని అర్థం విద్యార్థులు వినడం, మాట్లాడటం, చదవడం లేదా రాయడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించడం, వ్యూహాలను ప్రయత్నించడం మరియు వాటి ప్రభావాన్ని తనిఖీ చేయడం.

అభ్యాస పాఠ్యాంశాలు అనేది ఉపాధ్యాయ శిక్షణార్థులకు ఒక నిర్మాణాత్మక ప్రణాళిక, ఇది విద్యార్థులు పాఠశాలలో ఏమి, ఎలా ఎందుకు నేర్చుకుంటారో మార్గనిర్దేశం చేస్తుంది. ఇది విద్యా లక్ష్యాలను సాధించడానికి లక్ష్యాలు, కంటెంట్, బోధనా పద్ధతులు, కార్యకలాపాలు మూల్యాంకనాన్ని కవర్ చేస్తుంది.

అభ్యాస పాఠ్యాంశాలు విద్యకు వెన్నెముక. చక్కగా రూపొందించబడిన పాఠ్యాంశాలు విద్యార్థులు జ్ఞానం మరియు నైపుణ్యాలను పొందడంలో సహాయపడటమే కాకుండా వారి వ్యక్తిత్వం, విలువలు భవిష్యత్తును కూడా రూపొందిస్తాయి. ఏడు రాష్ట్రాల ఉపాధ్యాలు శిక్షణ తీసుకోని విద్యార్థి కేంద్రీకృత బోధనకు రీజనల్ ఇన్స్టూట్ బెంగుళూరు శిక్షణను అందిస్తున్నారు. ప్రతి ఆంగ్ల ఉపాధ్యాయ డికి శిక్షణ అందించే లక్ష్యంతో ముందుకు పోతున్నారు.

**డాక్టర్ మైపతి సంతోష్ కుమార్**
**ఇంగ్లీష్ టీచర్ - ములుగు**

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నదెవరు




భారతదేశం లోకతంత్ర గణతంత్రం. సమానత్వం అనే మూల్యాన్ని రాజ్యాంగం మౌలిక సూత్రంగా ప్రతిపాదించింది. అయినప్పటికీ, చారిత్రకంగా వెనుకబడిన వర్గాల పరిస్థితిని సరిచేయడానికి రిజర్వేషన్ల విధానం అవశ్యకమైంది. ఈ దేశంలో అగ్రకుల ఆధిపత్యం శతాబ్దాలుగా కొనసాగింది. శ్రామిక వర్గాలు, వెనుకబడిన సామాజిక వర్గాలు విద్య, ఉద్యోగాలు, రాజకీయ అధికారంలో పూర్తిగా వెనుకబడి పోయాయి. ఈ వాస్తవం తెలుసుకున్న నాటి ప్రభుత్వాలు రిజర్వేషన్లను ఒక సాధనంగా తీసుకుని సామాజిక న్యాయాన్ని సాధించడానికి ప్రయత్నించాయి. 1978-80 కాలంలో ఏర్పడిన లిలిమండల్ కమిషన్‌లిలి ఈ దిశలో కీలక మలుపు. ఆ కమిషన్ సిఫారసులను అమలు చేయడం అంటే అగ్రకుల ఆధిపత్యానికి గట్టి ఎదురుదెబ్బ. అందుకే బీజేపీ నేతలుగా ఎదిగిన ఎల్.కె.అద్వానీ వంటి వారు "కమండల్" యాత్రలతో దానికి వ్యతిరేకంగా మతపరమైన పిలుపులు ఇచ్చి బీసీల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కృషి చేశారు. ఈ వ్యూహం వెనుక అసలు ఉద్దేశం స్పష్టమే-హిందూ బీసీలను ఒకవైపు, ముస్లిం బీసీలను మరోవైపు వేరు చేసి చూపడం. కుల ఆధారంగా ఏర్పడిన రిజర్వేషన్లలో మతాన్ని జొప్పించడం, విభజన రాజకీయాన్ని నడపడం బీజేపీ విధానం అయ్యింది.

నేటి పరిస్థితిని పరిశీలిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రవేశపెట్టిన రెండు ముఖ్య బిల్లులు

1. విద్య, ఉద్యోగాలలో బీసీలకు రిజర్వేషన్లు
2. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు

ఇవి అసెంబ్లీలో బీజేపీ మద్దతు ఇచ్చినా, పార్లమెంటులో మాత్రం అడ్డుకోవడమే కనిపిస్తుంది. 9వ షెడ్యూల్‌ను సవరించేందుకు వీలు లేదంటూ ద్వంద్వ నాటకాలు ఆడుతోంది. కానీ అదే బీజేపీ 2019లో అగ్రకులాలకు చెందిన ఆర్థికంగా బలహీన వర్గాలకు -10% రిజర్వేషన్లు ఇచ్చింది. అప్పుడు సుప్రీంకోర్టు లేదా 50% లిమిట్ గుర్తుకు రాలేదా? ఒకవైపు అగ్రకులాలకు మినహాయింపులు కల్పిస్తూ, మరోవైపు ఓబీసీల రిజర్వేషన్లను అడ్డుకోవడం అంటే ఇది సామాజిక న్యాయం కాదు, ఓటు రాజకీయమే అని తేలిపోతుంది. అదేవిధంగా, రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి అనేక సార్లు సవరణలు జరిగాయి. ప్రతి ప్రభుత్వం తన రాజకీయ అవసరాల కోసం రిజర్వేషన్లను ఉపయోగించింది. బీజేపీ కూడా మినహాయింపు కాదు. కానీ బీసీల విషయానికి వస్తే మాత్రం ఆ పార్టీ దూరం పాటించడం గమనించదగ్గ విషయం. అమిత్ షా ఆధ్వర్యంలో బీజేపీ నాయకత్వం రిజర్వేషన్ల అంశాన్ని జాగ్రత్తగా ఓటు లెక్కలకే పరిమితం చేస్తోంది.

మరొక ముఖ్యమైన అంశం, హిందూ మతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చినట్లే, క్రైస్తవ మతంలోకి మారిన వారికి కూడా అదే వర్తింపచేయడం జరిగింది. అయితే ముస్లింలలోని వెనుకబడిన తరగతులకు మాత్రమే రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వకూడదు? బీసీ అంటే కేవలం హిందూ బీసీనా? ముస్లింలు మనుషులు కారా? ఈ ప్రశ్నకు బీజేపీ దగ్గర సమాధానం లేదు. కానీ దానిని మత రాజకీయాలుగా మలిచి, బీసీల ఐక్యతను విభజించే ప్రయత్నం జరుగుతోంది.

చరిత్ర చెబుతున్నట్లుగా, 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తూ ఒక చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అదే నిర్ణయం బీజేపీకి ఇష్టం లేక, మూడు నెలల్లోనే ఆ ప్రభుత్వాన్ని పడగొట్టింది. ఈ రోజు కూడా బీజేపీ అదే వైఖరిని కొనసాగిస్తోంది. బీసీల ఐక్యత కుదరనీయకుండా, మతరేఖలతో విభజించి, రాజకీయ లాభాలను కాపాడుకోవడమే అసలు లక్ష్యం.

ప్రధాని మోదీ విషయానికి వస్తే, ఆయన స్వంత కులాన్ని ఓసీ నుంచి బీసీగా మార్చుకోవడం సాధ్యమవుతుంది. కానీ కోట్లాది హిందూ ఓబీసీలకు మాత్రం విద్య, ఉద్యోగాలు, రాజకీయాలలో సరైన రిజర్వేషన్లు ఇవ్వరా? ఇది ఏ విధమైన న్యాయం? ఒక నాయకుడి వ్యక్తిగత ప్రయోజనం కోసం కుల స్థాయిని మార్చుకోవడం సాధ్యమవుతుంటే, వాస్తవంగా వెనుకబడిన వర్గాల హక్కులను ఎందుకు దూరం పెడుతున్నారు?

ఇక తెలంగాణలోని ప్రస్తుత పరిస్థితి చూస్తే, కాంగ్రెస్ బీసీలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల కోసం చేసిన ఉద్యమం దానికి ఉదాహరణ. మరోవైపు బీజేపీ మాత్రం 'హిందూ బీసీలు-ముస్లిం బీసీలు' అని వేరు చేస్తూ ఐక్యతను చెరిపేయాలని చూస్తోంది. ఇది బీసీల హక్కులపై ఒక సూటి దాడి.

దేశంలో సామాజిక న్యాయాన్ని నిలబెట్టాలంటే, బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే కాకుండా మరింత బలోపేతం చేయాలి. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో సరైన ప్రాతినిధ్యం లేని వరకూ బీసీలకు రిజర్వేషన్లు అవశ్యకమే. ఈ వాస్తవాన్ని తప్పించుకోవడం అంటే దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ ఆత్మను ద్రోహం చేయడమే. అందువల్ల, బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది ఎవరో ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. బీజేపీ మాటల్లో మద్దతు ఇస్తున్నట్లున్నా, పనిలో మాత్రం అడ్డుకుంటోంది. ఇది ద్వంద్వ రాజకీయమే. రేపటి రోజుల్లో ఈ ద్వంద్వాన్ని బీసీ వర్గాలు గుర్తించి, బీజేపీకి తగిన బుద్ధి చెప్పడం తప్పదని అనిపిస్తోంది.


ముగింపు:బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న శక్తి ఒక్కటే అగ్రకుల ఆధిపత్యానికి బానిసగా మిగిలిన రాజకీయ శక్తులు, ముఖ్యంగా బీజేపీ. వారు సామాజిక న్యాయం అనే పదాన్ని ముక్కుసూటిగా ఉచ్చరిస్తున్నా, వాస్తవానికి దాన్ని అడ్డుకుంటూ, తమ రాజకీయ ఆధిపత్యం కోసం బీసీలను విభజిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ వర్గాలు ఐక్యంగా నిలబడి, తమ హక్కులను కాపాడుకోవడం తప్ప మరే మార్గం లేదు.

## అన్యోన్యతకు అర్థం అర్ధ నారీశ్వర తత్త్వం

భక్తి



ఏదైనా కథ విన్నప్పుడు... ఆ కథలోని విశేషాలను గ్రహించడం, మంచి విషయాలను పాటించడం ప్రధానం. గౌరీ శంకరుల కథలో... అర్ధనారీశ్వర తత్త్వాన్ని లోతుగా తెలుసుకోవాలి. ఆ ఆది దంపతుల అన్యోన్యతను అర్థం చేసుకోవడం, ఆ విలువలను అనుసరించడమే ఆనందకరమైన గృహస్థ జీవితానికి సోపానం. హిమవంతుని పుత్రిక అయిన హైమవతి (శైలజ) తండ్రి ఆదేశం మేరకు శంకరుడికి పరిచర్య చెయ్యడానికి వచ్చింది. అది నిర్జనమైన వనం. వారిద్దరూ యవ్వనంలో, ఏకాంతంలో ఉన్నారు. కానీ వారి మనసుల్లో శృంగారపరమైన భావన లేదు. చివరకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు శంకరుడి మీద మన్మథుడు బాణం వేయాల్సి వచ్చింది. శారీరక సౌందర్యం లాంటి వాటికే ప్రాధాన్యం ఇస్తున్న నేటి కాలపు పద్ధతులకు ఇది విరుద్ధం. అంటే శారీరక సౌందర్య దృష్టితో చూసినంతకాలం మానసిక ప్రేమ అనేది ఉండదని భావం. ఈ భేదాన్ని గుర్తించగలిగితే దాంపత్యం అన్యోన్యంగా ఉంటుంది. మరో విషయం ఏమిటంటే... మన్మథుణ్ణి శంకరుడు తన మూడో కంటితో భస్మం చేయడం చూశాక కూడా... శైలజ తనంతట తానుగా నిర్ణయం తీసుకోలేదు. తల్లిదండ్రులకు చెప్పింది. తద్వారా ఆమె మానసికమైన ప్రేమ ఆమె తల్లితండ్రులకు అర్థమయింది. ఒక నిర్జన వన ప్రదేశానికి, ఏకాంతంలో ఉన్న పురుషుడి సేవ కోసం హిమవంతుడు తన పుత్రికను పంపాడంటే... తన కుమార్తె ప్రవర్తన, శీల సంపద మీద ఆయనకు ఎంత నమ్మకం ఉందో గమనించాలి. భిన్నత్వంలో ఏకత్వం...వివాహానికి ముందు ప్రేమించుకున్న కాలంలో... చెప్పలేనంత అన్యోన్యంగా కనిపించేజంటల సంసార సౌధం కొన్నాళ్ళకే బీటలు వారడం నేడు చూస్తున్నాం. ఇలాంటి సందర్భంలోనే గౌరీ శంకరుల కథను శ్రద్ధగా ఒంట పట్టించుకోవాలి. గౌరీ శంకరులు... అర్ధనారీశ్వర రూపంలో ఉంటారు. కుడివైపున శంకరుని రూపం, ఎడమవైపు గౌరీ రూపం. పూర్వం ఈ అర్ధనారీశ్వర చిత్రాన్ని దేవాలయం గోడల మీదో, ప్రధాన స్తంభం మీదో... శిల్ప రూపంలోనో, చిత్ర రూపంలోనో కనిపించేలా ఉంచేవారు. "కుడి అర చేత్తో కుడి కంటిని మూసి గౌరీదేవిని, ఎడమ అరచేత్తో ఎడమకంటిని మూసి శివయ్యను చూడు" అని తమ పిల్లలకు తల్లిదండ్రులు చెప్పేవారు, ఆ విధంగా చేయించేవారు. ఎందుకని? ఏ సంస్కారమూ లేని బిరుసైన జేగురు రంగు శిరోజాలు... అవి కూడా మోకాళ్ళు దాటేంత పొడవున శివుడికి ఉంటాయి. సంపెగ, అశోక, సురపొన్న, సౌగంధిక (చంపాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా) పుష్పాలంకృతమైన కొప్పు ఆమెకు ఉంటుంది. ఆగ్రహం వచ్చినా, అనుగ్రహాన్ని కురిపిస్తున్నా ఏ మార్పూ కనిపించని అష్టమి చంద్రుడిలా ఆమె నుదురు ఉంటే... ఏమాత్రం తేడా కనిపించినా ఆయన నుదుటి భ్రుకుటి ముడిపడిపోతూ ఉంటుంది. ఆయన కన్ను రుద్ర రూపంలో వెలుగుతూ ఉంటే ఆమె నేత్రం నీటి మడుగులో కదలాడే చేపలా... ఇంకా ఇంకా చూడాలనిపించేలా ఉంటుంది. మరో చిత్రం... ఆమె నయనం పరమ మనోహరంగా, ప్రశాంతంగా, అందరికీ ఉండేలా అడ్డంగా ఉంటే... ఆయనకు నుదుటి మధ్యలో మరో నేత్రం ఛటచ్ఛటలాడే అగ్నితో ఉండడమే కాదు, నిలువుగా ఉంటుంది. ఇలా... ఇద్దరూ ఒకే తీరుగా ఉండనే ఉండరు.



## బెంగళూరు తొక్కిసలాట ఘటన.. ఆర్‌సీబీ కీలక ప్రకటన



**బెంగళూరు - నవభూమి:**బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నష్ట పరిహారం ప్రకటించింది.

ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వనున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేసింది. బెంగళూరులో జరిగిన దురదృష్టకర ఘటన ఆర్‌సీబీ కుటుంబానికి తీవ్ర బాధను కలిగించినట్లు పేర్కొంది. బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది.కాగా, ఇప్పటికే ఆర్‌సీబీ బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేసి గాయపడిన వారికి సాయం చేస్తామని అప్పట్లో ప్రకటించింది. ఇప్పుడు నష్ట పరిహారం రూ.25 లక్షలుగా ప్రకటించడం గమనార్హం.


## లాల్‌బాగ్చా రాజాను దర్శించుకున్న అమిత్ షా..




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగు తున్నాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబై లో ఈ వేడుకలు ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. తాజాగా ముంబై నగరంలోని ఫేమస్ లాల్ బాగ్చా రాజా ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా) దర్శించుకున్నారు. లాల్ బాగ్చా మార్కెట్‌లో కొలువుదీరిన ఈ భారీ గణనాథుడిని షా తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముంబైలో గణేశ్ చతుర్థి అంటే ముందుగా గుర్తొచ్చేది 'లాల్‌బాగ్చా రాజా' గణనాథుడు. హైదరాబాద్‌లో ఖైరతాబాద్ మహా గణపతి ఎంత ఫేమస్సో ముంబై వాసులకు ఈ గణనాథుడు అంత ఫేమస్. 1934 నుంచి లాల్‌బాగ్చా మార్కెట్‌లో కొలువుదీరే ఈ గణనాథుడి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. సినీ సెలబ్రిటీల నుంచి రాజకీయ నాయకుల వరకూ ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఈ గణనాథుడిని దర్శించుకుంటుంటారు.

## ఉత్తరాది రాష్ట్రాల్లో జలవిలయం..

క్లౌడ్ బరెస్ట్



**ఉత్తరాఖండ్-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఢిల్లీతోపాటూ ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. ప్రధాన నదులు, వాటి ఉప నదులు ప్రమాదకర స్థాయిని మించి ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలు, వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జలవిలయానికి సంబంధించిన షాకింగ్ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## బీఫ్ తినొద్దన్న బ్యాంక్ మేనేజర్.. బ్యాంక్ బయటే బీఫ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసిన ఉద్యోగులు



**చెన్నై-నవభూమి:** కేరళ లోని కొచ్చిలో ఉన్న కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో చోటు చేసుకున్న ఒక ఘటన ఆ బ్యాంక్ ఉద్యోగుల నిరసనకు దారితీసింది. బీహార్‌కు చెందిన బ్రాంచ్ మేనేజర్ ఉద్యోగులు బీఫ్ తినడంపై నిషేధం విధించగా.. ఈ నిర్ణయంపై ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు.అసలు ఏం జరిగిందంటే.. బీహార్ నుంచి కేరళకు బదిలీ అయిన రిజినల్ మేనేజర్ ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన బ్యాంకు క్యాంటీన్‌లో బీఫ్ (గొడ్డు మాంసం) వడ్డించరాదని ఆదేశించినట్లు సమాచారం. అయితే మేనేజర్ ఇచ్చిన ఆదేశాల పట్ల ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు.మేనేజర్‌పై నిరసన తెలుపుతూ.. బ్యాంక్ ఆఫీసు బయట బీఫ్, పరోటాలతో విందు ఏర్పాటు చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నిరసన జరుగగా.. ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రకారం నచ్చిన ఆహారం తినే హక్కు ఉందని, ఈ హక్కును ఎవరూ ఉల్లంఘించలేరని ఉద్యోగులు తెలిపారు. బ్యాంక్ ఉద్యోగులు చేసిన ఈ నిరసన పట్ల రాజకీయ నాయకులతో పాటు పలు సంఘులు తమ మద్దతును తెలిపాయి.

## బుల్లెట్ రైల్లో ప్రయాణించిన ప్రధాని మోదీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జపాన్‌లో పర్యటిస్తున్న విష యం తెలిసిందే. ఈ సంద ర్భంగా అక్కడ బుల్లెట్ రైలు లో ప్రయాణించారు. జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో కలిసి టోక్యో నుంచి సెందాయ్ నగరానికి వెళ్లారు. ఈ జర్నీని ప్రధాని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన దృష్యాలు వైరల్ అవుతున్నాయి.కాగా, రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని జపాన్ వెళ్లిన విషయం తెలిసిందే. ఏఐ, సెమీకండక్టర్లు, పెట్టుబడులే ప్రధాన లక్ష్యంగా ప్రధాని మోదీ జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా భారత్- జపాన్ 15వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. పలువురు ఉన్నతస్థాయి వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులను కలుస్తున్నారు.

## పంజాబ్‌లో వరదలు.. 23 మంది మృతి, వెయ్యి గ్రామాలు మునక

**చండీఘడ్-నవభూమి:**పంజాబ్‌లో భీకర వర్షాలుకురుస్తున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వరదలు సంభవించాయి. వదరల్లో కనీసం 23 మంది మరణించారు. సుమారు వెయ్యి గ్రామాలు వాననీటిలో మునిగిపోయాయి. వరద ప్రభావిత జిల్లాల నుంచి సుమారు 16వేల మందిని రక్షించారు. వరద నష్టాన్ని అంచనా వేస్తున్న ఆమ్ ఆద్మీ ప్రభుత్వం.. నీటి మునిగిన ప్రాంతాలకు రిలీఫ్ మెటీరియల్‌ను పంపిస్తోంది. పఠాన్‌కోట్‌లో 8 మంది, హోషియార్‌పూర్‌లో ఏడు, రూప్‌నగర్, బార్నాలాలో మూడేసి మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని రావి, బియాస్, సట్లజ్ నదులు ఉప్పొంగి ప్రవాహిస్తున్నాయి.

# ప్రేమించినోళ్లను అర్ధాంతరంగా వదిలేస్తున్న ఈ కొత్త ట్రెండ్ ఏంటి?



**న్యూఢిల్లీ-నవభూమి:**అనుకోకుండా ఓ డేటింగ్ యాప్‌లో పరిచయమైన యువతి, యువకుడు.. ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. భవిష్యత్తు గురించి యువతి అందమైన కలలు కంది. ప్రేమలో సమయం హాయిగా సాగిపోతున్న తరుణంలో.. ప్రియుడు అకస్మాత్తుగా మాయమైపోయాడు. మెసేజ్ లేదు, కాల్ లేదు. ఏమైందో, ఎక్కడున్నాడో, ఎందుకిలా చేశాడో తెలియదు. ఇలా సమాధానాలు తెలియని ప్రశ్నలు ఆ యువతిని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అలా కొద్ది రోజులు గడిచాక ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా తెలిసింది.. ప్రియుడు కులాసాగానే ఉన్నాడని. ఒక్కసారిగా ఆ యువతికి దిమ్మతిరిగిపోయింది. అప్పుడు అర్థమైంది.. అతడు కావాలనే తనను దూరం పెట్టాడని. ఇలా చెప్పాపెట్టకుండా జీవితాల్లోంచి వెళ్లిపోవడాన్ని ఘోస్టింగ్ఇలా చేసినవాళ్ల సంగతేంటో గానీ.. దీని బారిన పడినవారు మాత్రం వర్ణించలేని వేదన అనుభవిస్తున్నారట. ఈ ఘోస్టింగ్ ఎన్నిరకాలుగా జరుగుతోంది? ఇది బంధాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తోంది? దీని వల్ల మనిషి జీవితంలో జరుగుతున్న నష్టాలేంటి? అనే విషయాలపై కీలక వివరాలు..ఘోస్టింగ్ ఎన్ని రకాలుగా జరుగుతోంది? డేటింగ్ ఘోస్టింగ్, ఫ్రెండ్‌షిప్ ఘోస్టింగ్, వర్క్‌ప్లేస్ ఘోస్టింగ్, ఫాంటమ్ , క్యాస్పర్ ఘోస్టింగ్ .. అంటూ అనేక రకాల ఘోస్టింగ్‌లు ఉన్నాయి. అయితే, పేర్లు ఏవైనా.. చెప్పా పెట్టకుండా కనెక్షన్, కమ్యూనికేషన్ కట్ చేయడమే ఘోస్టింగ్. వర్క్‌ప్లేస్ ఘోస్టింగ్‌లో.. ఇంటర్వ్యూకి పిలిచిన అభ్యర్థులకు నియామకం స్టేటస్ గురించి చెప్పకపోవడం లేదా కంపెనీల్లోంచి చెప్పా పెట్టకుండా ఉద్యోగులు వెళ్లిపోవడం, జాబ్ ఆఫర్లకు రిప్లై ఇవ్వకపోవడాన్ని వర్క్‌ప్లేస్ ఘోస్టింగ్ అంటున్నారు.ఫాంటమ్ గోస్టింగ్‌లో అకస్మాత్తుగా కాకుండా.. క్రమంగా ముఖం చాటేస్తున్నారట. ఇక క్యాస్పర్ లేదా పొలైట్ ఘోస్టింగ్‌లో చిన్న చిన్న కారణాలు చెప్పి వదిలించుకుంటున్నారట. డేటింగ్, ఫ్రెండ్‌షిప్‌లలో ఇది ఎక్కువగా జరుగుతోంది.

**ఘోస్టింగ్ వల్ల నష్టాలేంటి?**

ఘోస్టింగ్ చేసిన వాళ్లు ఏమనుకున్నారో, ఏ కారణాలు ఉన్నాయో తెలియదు గానీ.. ఘోస్టింగ్‌కు గురైనవారు మాత్రం మానసికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సన్నిహితులు సడెన్‌గా ఇలా ఎందుకు చేశారనే ప్రశ్నలు.. బాధితులను ఉన్న చోట ఉండనివ్వడం లేదు. భయాందోళనకు గురవుతూ.. వారిని వారే సందేహించుకుంటున్నారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. అతిగా ఆలోచిస్తూ మతి పోగొట్టుకుంటున్నారని అంటున్నారు.

ఈ చేదు అనుభవం వల్ల వ్యక్తిగత జీవితంలో తల్లిదండ్రులు, స్నేహితులు, కొలీగ్స్.. తదితర బంధాలకు దూరం అవుతున్నవారూ ఉన్నారు. అంతేకాకుండా.. మళ్లీ కొత్త రిలేషన్‌షిప్‌లోకి అడుగు పెట్టాలంటే కూడా భయాందోళనకు గురవుతున్నారట. ఘోస్టింగ్.. బాధితుల ప్రొఫెషనల్ లైఫ్‌నూ దెబ్బతీస్తోందని నిపుణులు చెబుతున్నారు.

**బంధాలపై ఘోస్టింగ్ ఎలాంటి ప్రభావం చూపిస్తోంది?**

ఘోస్టింగ్ బాధితులకు నష్టం.. వారు ఉన్న రిలేషన్‌షిప్ లోతును బట్టి ఉంటుంది. పరిచయమైన కొద్ది రోజులకే ఇలా చేస్తే.. లైట్ తీసుకుంటారు. కానీ, బంధం బలపడిన తర్వాత ఘోస్టింగ్ చేస్తే తట్టుకులేకపోతున్నారట మోడర్న్ మృదుస్వభావులు. అయితే, ప్రస్తుత జరనేషన్‌లో ఈ ఘోస్టింగ్ సర్వసాధారణమైపోయింది. కానీ, ఇది మంచి పరిణామం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా ఘోస్టింగ్ చేయడం అనేది.. ఒక వ్యక్తిని పూర్తిగా విస్మరించడమని, ఇది మానవత్వానికి విరుద్ధమైనది, అగౌరవపరిచే చర్య అని చెబుతున్నారు.

సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌లలో ఎక్కువగా ఘోస్టింగ్ జరుగుతోందట. ఈ ఘోస్టింగ్ ఉదంతాలు ఎక్కువైన నేపథ్యంలో.. దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఒక వ్యక్తిని అలా చేసే హక్కు ఎవరిచ్చారు? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు.. ఇలా చేసినవాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్‌లు కూడా వినిపిస్తున్నాయి.

**భారత్‌లో.. ఘోస్టింగ్ చేస్తే క్రిమినల్ కేసు!**

ఘోస్టింగ్‌ను క్రిమినల్ చర్యగా భావించాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది. 2022లో జులైలో ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ చట్టసభ సభ్యుడు ఆర్నోల్ఫో టీవ్స్ జూనియర్ . ఘోస్టింగ్‌ను ఎమోషనల్ క్రూయెల్టీగా అభివర్ణించారు. దీన్ని ఇల్లీగల్ చర్యగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. శరీరానికి దెబ్బ తగిలితే ఎలా నొప్పి వస్తుందో.. ఘోస్టింగ్‌కు గురైనవారు కూడా మానసికంగా మైండ్‌లో అలాంటి బాధనే అనుభవిస్తారని వాదించారు. ఎమోషనల్ అబ్యూజ్ లాగానే.. శిక్ష విధించే నేరంగా ఘోస్టింగ్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.భారత్‌లో ఘోస్టింగ్‌ను క్రిమినల్ చర్యగా ప్రకటించడం ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చని ట్రై లీగల్ ఫర్మ్ ప్రతినిధి నిఖిల్ నరేంద్రన్ అభిప్రాయపడ్డారు. భారతీయ చట్టాల ప్రకారం మానసిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ ఉంది. కానీ, సాధారణంగా ఇలాంటి ఘోస్టింగ్‌ను భారత చట్టాలు గుర్తించలేదని నరేంద్రన్ తెలిపారు. మానసిక వైద్య నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

క్లినికల్ సైకాలజిస్ట్, డేటింగ్ కోచ్ ప్రాచి వైశ్ ప్రకారం.. ఘోస్టింగ్ వేధింపులు, అబ్యూజ్ కిందకు రాదు. కానీ, ఇది ఒక టాక్సిక్ ప్యాటర్న్ అని చెబుతున్నారు.

**ఇది ఎందుకు ఆందోళన చెందాల్సిన విషయం..?**

2024 నాటికి భారత్‌లో దాదాపు 10 కోట్ల మంది డేటింగ్ యాప్స్‌ను వాడుతున్నారని అంచనాలు ఉన్నాయి. ఇక్కడ ఆందోళనకర విషయం ఏంటంటే.. 2023లో చేసిన ఓ సర్వే ప్రకారం.. 68 శాతం భారత యూజర్లు ఘోస్టింగ్ లేదా వేధింపులకు గురయ్యారట. మిల్లీనియల్స్, జెన్ జీ యువతే ఈ డేటింగ్ యాప్‌లను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారట. ఇలా ఘోస్టింగ్‌కు గురవుతున్న వారిలో ఒత్తిడి, యాంక్జైటీ, నేనేం చేశాననే అపరాధ భావన ఎక్కువ అవుతున్నాయట. అలా ఫ్రెండ్‌షిప్‌లో, రిలేషన్‌షిప్‌లో, వివాహ బంధాల్లో కూడా ట్రస్ట్ ఇష్యూలు వస్తున్నాయట. ఇలాంటి పరిస్థితుల్లో యువత నేరాలకు పాల్పడే ప్రమాదం లేకపోలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘోస్టింగ్ అనేది అనూహ్యంగా, ఒకవైపు నుంచి జరిగే చర్య. దాన్ని అరికట్టడానికి చట్టాలు చేయకున్నా, శిక్షలు విధించకున్నా.. యువతలో అవగాహన కోసం కార్యక్రమాలు చేపట్టాలి. ఆధునిక పోకడలతో కాలక్రమేనా అనేక మార్పులు వస్తాయి. అవి యువత దృష్టికోణాన్ని, ఆలోచనా విధానాన్ని మార్చేయగలవు. అందుకే వాటన్నింటి పట్ల సావధానంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను యువతకు అందించాలి. ఆ దిశగా ఇళ్లలో, పాఠశాలలు, కాలేజీల్లోనే అడుగులు పడాలి.

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. 8,477 నాన్-టీచింగ్ పోస్టులకు సర్కారు నోటిఫికేషన్



**పశ్చిమ బెంగాల్ :నవభూమి:**పశ్చిమ బెంగాల్ పాఠశాలల్లో 8,477 నాన్-టీచింగ్ సిబ్బంది నియామకాలకు పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఈ ప్రకటన ద్వారా క్లర్క్‌లు, నైట్ గార్డులు, ప్యూన్‌లు వంటి పోస్టులను భర్తీ చేయనున్నారు. సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించబోతున్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. WBSSC Recruitment% 2025 : పశ్చిమ బెంగాల్ పాఠశాలల్లో 8,477 నాన్-టీచింగ్ సిబ్బంది నియామకాలకు పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నియామకాలు గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టుల భర్తీ కోసం ఉద్దేశించినవి. దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారీ స్థాయిలో ఉద్యోగాల భర్తీకి ప్రకటన రావడంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురించాయి. ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో గతంలో నియామకమైన వేలాది మంది ఉద్యోగాలను కోల్పోవడంతో.. ఈ కొత్త ప్రకటన చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది.పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయ, నాన్-టీచింగ్ ఉద్యోగాల భర్తీ గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర వివాదాలకు కేంద్రంగా మారింది. 2016లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపిక పరీక్ష ద్వారా నియమితులైన 25,753 మంది ఉపాధ్యాయ, నాన్-టీచింగ్ సిబ్బంది నియామకాలను సుప్రీం కోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 3న రద్దు చేసింది. కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించడంతో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు, అవినీతి జరిగాయని ఆరోపణలు రావడంతో న్యాయస్థానాలు కఠిన చర్యలు తీసుకున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో చాలా కాలంగా కొత్త నియామకాలు జరగలేదు.ఈ నేపథ్యంలోనే ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, పారదర్శకంగా నియామక ప్రక్రియను చేపట్టాలనే ఉద్దేశంతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తాజా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ రిక్రూట్‌మెంట్‌లో, గ్రూప్ సి పోస్టుల కింద 2,989 క్లర్క్‌లు ఇతర సిబ్బందిని భర్తీ చేయనున్నారు. అలాగే 5,488 గ్రూప్ డి ఉద్యోగాలను కూడా భర్తీ చేయనున్నారు. గ్రూప్ డి ఉద్యోగాలలో నైట్ గార్డు, ప్యూన్, ల్యాబ్ అటెండెంట్ వంటి పోస్టులు ఉన్నాయి.అయితే ఈ నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబర్ 16వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు ఫీజు చెల్లించడానికి కూడా అదే తేదీ చివరి రోజు. అయితే రాత్రి 11.59 నిమిషాల వరకు దీనికు సమయం ఇచ్చారు.ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు నిర్దిష్ట విద్యార్హతలు కలిగి ఉండాలి. గ్రూప్ సి పోస్టులకు కనీస విద్యార్హత 10వ తరగతి లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. గ్రూప్ డి పోస్టులకు కనీస విద్యార్హత 8వ తరగతి పాస్ అయి ఉండాలి. ఈ ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ, పరీక్షా విధానం, సిలబస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో త్వరలో విడుదల కానున్నాయి.

## జపాన్‌లో మోదీ పర్యటన.. ప్రధానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ కుమార్తె విజ్ఞప్తి



**జపాన్-నవభూమి:**భారత స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్.. మరణం అంశం ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీకి.. నేతాజీ కుమార్తె అనితా బోస్ పాఫ్.. ఒక కీలక విజ్ఞప్తి చేశారు. జపాన్‌లో ఉన్న తన తండ్రి అస్థికలను తిరిగి భారత్‌కు తీసుకురావాలని ఆమె కోరారు. జపాన్ రాజధాని టోక్యోలోని రెంకోజి ఆలయంలో ఉన్న నేతాజీ అస్థికలను భారత్‌కు తెచ్చేందుకు కృషి చేయాలని ఆమె ప్రధాని వేడుకున్నారు.ప్రస్తుతం తనకు వయసు మీదపడుతోందని.. ఇకనైనా తన తండ్రి మరణానికి సంబంధించిన విషయంలో ఒక ముగింపు పలకడం తనకు అత్యంత కీలకమని ప్రధానికి చేసిన విజ్ఞప్తిలో అనితా బోస్ వెల్లడించారు. ఈ సమస్యను గత కొన్ని దశాబ్దాలుగా తాను మోస్తున్నానని.. దీన్ని వారసత్వంగా తన పిల్లలకు ఇవ్వాలని తాను అనుకోవడం లేదని ఆమె స్పష్టం చేశారు. నేతాజీ అస్థికలు తిరిగి భారత్‌కు తీసుకురావడం అనేది కేవలం తన వ్యక్తిగత విషయం మాత్రమే కాదని.. ఇది యావత్ భారతదేశానికి సంబంధించిన విషయమని తేల్చి చెప్పారు.

ఈ సందర్భంగా నేతాజీ అస్థికలను భారత్‌కు తీసుకువచ్చేందుకు గత ప్రభుత్వం చేసిన కృషిని అనితా బోస్ గుర్తు చేసుకున్నారు. గతంలో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు.. అప్పటి కేంద్ర ప్రభుత్వం నేతాజీ అస్థికలను తీసుకురావడానికి అనేక ప్రయత్నాలు చేసిందని తెలిపారు. ఇక.. జపాన్ దేశం ఎప్పుడూ నేతాజీని గౌరవంగానే చూసుకుందని అనితా బోస్ వెల్లడించారు.1945 ఆగస్టు 18వ తేదీన తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణించినట్లు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ నేతాజీ మరణం ఇప్పటికీ ఒక అంతుచిక్కని మిస్టరీగానే మిగిలిపోయింది. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు దర్యాప్తు కమిషన్‌లు.. నేతాజీ తైపీలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించినట్లు నిర్ధారించాయి.కానీ జస్టిస్ ఎంకే ముఖర్జీ కమిషన్ మాత్రం.. తైపీ విమాన ప్రమాదం జరిగిన తర్వాత కూడా నేతాజీ ప్రాణాలతోనే ఉన్నారని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ట్యోక్యోలో ఉన్న రెంకోజి ఆలయంలో భద్రపరిచిన అస్థికలు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌వేనా కాదా అనే విషయంపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం.

## రోడ్డు ప్రమాదంలో చిరుతపులి మృతి..

**న్యూఢిల్లీ-నవభూమి:**రోడ్డు ప్రమాదంలో ఆడ చిరుతపులిమృతిచెందింది. దాని వయసు సుమారు రెండు నుంచి రెండున్నర ఏళ్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గురుగ్రామ్-ఫరీదాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న ఆరావలి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. స్థానిక ఎన్జీవో వన్యప్రాణి అధికారుల్ని అలర్ట్ చేసింది. ప్రమాద ప్రాంతానికి చేరుకున్న అధికారులు ఆ చిరుతను కస్టడీలోకి తీసుకుని పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్నారు. బహుశా ఇది హిట్ అండ్ రన్ కేసు అయి ఉంటుందని వైల్డ్‌లైఫ్ ఆఫీసర్ ఆర్కే జాంగ్రా తెలిపారు. పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్నామని, అతివేగంగా ప్రయాణించే వాహనాలతో ఈ ప్రాంతంలో సమస్యలు వస్తున్నట్లు ఆయన చెప్పారు.గురుగ్రామ్-ఫరీదాబాద్ మార్గంలో ఉన్న అసోలా భాటి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, అరావలి పర్వతాల మధ్య తరుచుగా చిరుతపులులు సంచరిస్తూ ఉంటాయి. అయితే ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా అధికంగా అవుతున్నట్లు గుర్తించారు. గురుగ్రామ్ సమీపంలోని ఆరావలి కొండల్లో సుమారు 50 చిరుత పులులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో అవి తరుచూ కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో కూడా ఇదే మార్గంలో రోడ్డు ప్రమాదానికి ఓ చిరుత బలైనట్లు పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెన్షన్‌కు అప్లై చేసుకున్న జగదీప్ ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. అయితే, ఇప్పుడు ఆయన మాజీ ఎమ్మెల్యే పెన్షన్ కు దరఖాస్తు చేసుకున్నారు.ధనఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికైన విషయం తెలిసిందే. 1993 నుంచి 1998 వరకూ అజ్మేర్‌లోని కిషన్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గానికి (%ఖఅంష్త్రుఅస్త్రుతీష్త్ర ూాంంవఎశ్రీఎ ఒశీఅర్‌ఉబవఅఎ%) ప్రాతినిధ్యం వహించారు. నిబంధనల ప్రకారం.. రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే రూ.35వేల పింఛనుకు అర్హులు. ఈ రూల్స్ ప్రకారం.. ఆయన 2019 జులై వరకూ మాజీ శాసనసభ్యుడిగా ధన్‌ఖడ్ పెన్షన్ పొందారు. అయితే, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులవడంతో పెన్షన్ ఆగిపోయింది.2019 నుంచి 2022 మధ్య పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 ఆగస్టులో ఉపరాష్ట్రపతిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా తన పదవీకాలం ముగియడంతో మాజీ ఎమ్మెల్యేగా తన పెన్షన్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతూ ధన్‌ఖడ్ రాజస్థాన్ అసెంబ్లీ సచివాలయానికి కొత్తగా దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ విషయాన్ని రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ వాసుదేవ్ దేవనాని తాజాగా వెల్లడించారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ మాజీ ఎమ్మెల్యే పెన్షన్‌కు దరాఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దానికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.కాగా, రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యేకు రూ.35వేల పెన్షన్ వస్తుంది. అంతేకాదు వయసు ఆధారంగా ఆ మొత్తంలో పెంపు కూడా ఉంటుంది. 70 ఏళ్లు దాటిన మాజీ ఎమ్మెల్యేకి 20 శాతం అదనపు పింఛను అందుతుంది. 80 ఏళ్లు దాటితే అది 30 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం ధన్‌ఖడ్ వయసు 74 ఏళ్లు కావడంతో ఆయనకు మాజీ ఎమ్మెల్యే పెన్షన్ కింద రూ.42 వేల వరకు వస్తుంది.

## రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్..



**న్యూఢిల్లీ-నవభూమి:** రైల్వే ప్రయాణి కులకు గుడ్‌న్యూస్.. టికెట్ల కోసం ఇకపై రైల్వే స్టేషన్లలో క్యూలైన్లలో నిల్చోవాల్సిన అవసరం లేదు. బస్సులో మాదిరిగానే రైలులోనే ఇకపై టికెట్లను తీసుకోవచ్చు. టీటీఈలు, టికెట్ తనిఖీ బృందాలు ఈ టికెట్లను జారీ చేయనున్నాయి.రైల్వే స్టేషన్లలోని టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ నుంచి ఉపశమనం కలిగించేందుకు రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మొబైల్ టికెటింగ్‌ను రాయ్‌పూర్ రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. టీటీఈ, టికెట్ తనిఖీ బృందానికి అరచేతిలో ఇమిడి ఉండే పరికరాన్ని అందజేశారు. వాటి సాయంతో ప్రయాణికులు ఎంతమంది, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్న వివరాలను నమోదు చేస్తున్నారు. అనంతరం వారికి అందజేసిన ప్రింటర్ల ద్వారా టికెట్లు జారీ చేస్తున్నారు. ఈ విధానాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా అన్ని మేజర్ స్టేషన్లలో ప్రవేశపెట్టేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఉక్రెయిన్ యుద్ధానికి ఇండియా కారణం కాదు: అమెరికా యూదు కమిటీ

**న్యూయార్క్-నవభూమి:**రష్యా నుంచి భారత్ ఇంధనం కొనుగోలు చేయడం వల్లే.. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేయగలుగుతోందని ఇటీవల అమెరికా ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవర్రో పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే శ్వేతసౌధం సలహాదారుడు చేసిన వ్యాఖ్యలను అమెరికా అమెరికా యూదు కమ్యూనిటీ ఖండించింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ఇండియా కారణం కాదు అని, భారత్, అమెరికా మధ్య బంధాన్ని మళ్లీ బలోపేతం చేయాలని యూద వర్గం పేర్కొన్నది.రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేయడం వల్ల పుతిన్‌కు ఇండియా నిధులు ఇచ్చినట్లు అవుతోందని, దాని వల్లే ఆ దేశం ఉక్రెయిన్‌తో పోరాడుతు న్నట్లు శ్వేతసౌధ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో ఆరోపించారు.



# మఖ్‌నా మతలబు

మఖ్‌నా కచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారమే! పొట్ట కదలికలను క్రమబద్ధీకరించి, జీర్ణశక్తిని పెంచే మఖ్‌నా, పేగుల ఆరోగ్యంతో పాటు శక్తి ఖర్చయ్యే వేగాన్ని కూడా పెంచుతాయి. అయితే ఈ ఆరోగ్యకరమైన పదార్థాన్ని తినకూడని వాళ్లూ ఉన్నారు. వాళ్లెవరంటే....మూత్రపిండాల్లో రాళ్లు: వీటిలోకి ఆక్సలేట్స్, క్యాల్షియం, మెగ్నీషియం శోషణను కుంటుపరచడంతో పాటు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడడానికి తోడ్పడతాయి. కాబట్టి మూత్రపిండాల్లో రాళ్ల ముప్పు ఉన్నవాళ్లు మఖ్‌నాలను తినకపోవడమే మేలు.జీర్ణ సమస్యలు: ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ లేదా ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ సమస్యలున్నవారు, మఖ్‌నా లాంతి అత్యధిక పీచు పదార్థాలను జీర్ణం చేసుకోలేరు. దాంతో కడుపుబ్బరం, పొత్తికడుపులో అసౌకర్యం తలెత్తుతాయియూరిక్ యాసిడ్: మఖ్‌నాల్లో ప్యూరిన్స్ అనే సమ్మేళనాలుంటాయి. ఇవి శరీరంలో యూరిక్ యాసిడ్‌ను పెంచుతాయి. కాబట్టి గౌట్ సమస్య ఉన్నవారు, అత్యధిక యూరిక్ యాసిడ్ మోతాదులున్నవారు మఖ్‌నాకు దూరంగా

ఉండాలిరక్తం పలుచనయ్యే మందులు: మఖ్‌నాలో విటమిన్ కె ఉంటుంది. రక్తం గడ్డకట్టడానికి తోడ్పడే కె విటమిన్ అధికంగా ఉండడం వల్ల వీటిని తిన్నప్పుడు, వార్ఫారిన్ లాంటి రక్తం పలుచనయ్యే మందుల ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఇలాంటి మందులు వాడుకుంటున్నవారు మఖ్‌నా తినడం మానుకోవాలి.

## నవతార



# మలి వయసులో గర్భం

**మలి వయసులో గర్భందివంగత పంజాబీ గాయకుడు సిద్ధు మూసేవాలా తల్లితండ్రులు, లేటు వయసులో బిడ్డను కనడంతో అందరి దృష్టి ఐవిఎఫ్ వైపు మళ్లింది. అయితే ఈ దంపతుల్లాగే పెద్ద వయసులో తల్లితండ్రులయ్యే ప్రయత్నం చేసే పెద్దలు కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.**



మలి వయసులో గర్భం

దివంగత పంజాబీ గాయకుడు సిద్ధు మూసేవాలా తల్లితండ్రులు, లేటు వయసులో బిడ్డను కనడంతో అందరి దృష్టి ఐవిఎఫ్ వైపు మళ్లింది. అయితే ఈ దంపతుల్లాగే పెద్ద వయసులో తల్లితండ్రులయ్యే ప్రయత్నం చేసే పెద్దలు కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

2021 కృత్రిమ పునరుత్పత్తి ప్రక్రియ నియంత్రణ చట్టం (ఆర్టిఫిషియల్ రిప్రొడక్టివ్ టెక్నిక్ రెగ్యులేషన్ యాక్ట్) ఈ చికిత్సను ఆశ్రయించే దంపతుల్లో మహిళల వయో పరిమితిని 50 ఏళ్లకూ, పురుషుల వయో పరిమితిని 55 ఏళ్లకూ పరిమితం చేసింది. తల్లీబిడ్డల ఆరోగ్యభద్రత కోసం, బిడ్డ భవిష్యత్తు కోసం ప్రభుత్వం సూచించిన నియమాలను లెక్క చేయకుండా, మలి వయసులో ఐవిఎఫ్ ద్వారా బిడ్డలను కనే వాళ్లున్నారు. కెరీర్ పరంగా ఒంటరిగా మిగిలిపోయిన మహిళలు, అదే పనిగా పెళ్లి వాయిదా వేస్తూ వయసు మీరిపోయిన మహిళలు, సంతాన నిర్ణయాన్ని వాయిదా వేస్తూ, సహజసిద్ధంగా గర్భం దాల్చలేని లేటు వయసు మహిళలు పెద్ద వయసులో గర్భం దాల్చడంలో ఉండే ఆరోగ్యపరమైన ఇబ్బందులు, తల్లీబిడ్డలకు పొంచి ఉండే సవాళ్ల గురించి తెలుసుకోవడం అవసరం.

**దుష్ప్రభావాలు లేకపోలేదు**

ఐవిఎఫకు నిర్దిష్ట వయో పరిమితి లేకపోయినప్పటికీ, 40 ఏళ్లు దాటిని మహిళల్లో అండాల నాణ్యత, మోతాదులు తగ్గిపోతాయి. అలాగే ఐవిఎఫ్ విజయమయ్యే అవకాశాలు కూడా పెరిగే వయసుతో పాటు తగ్గిపోతూ ఉంటాయి. మన దేశంలో మహిళలు మెనోపాజ్‌కు చేరుకునే సగటు వయసు 46 ఏళ్లు. ఈ దశకు 13 ఏళ్ల ముందు నుంచే అండాల నాణ్యత దిగజారడం మొదలవుతుంది. అలాగే పెద్ద వయసు మహిళల్లోని అండాల్లో క్రోమోజోమ్‌ల లోపాలు, జన్యుపరమైన లోపాలు తలెత్తుతాయి. గర్భస్రావాలు కూడా ఎక్కువే! కాబట్టి పిల్లలు డౌన్స్ సిండ్రోమ్‌తో పుట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి లేటు వయసులో ఐవిఎఫను ఆశ్రయించేవాళ్లు దానంగా పొందిన అండాలతో గర్భం దాల్చడం ఉత్తమం.

**బిడ్డను పెంచే శక్తి ఉంటుందా?**

దానంగా పొందిన అండాలతో గర్భం దాల్చినప్పటికీ, పెద్ద వయసు మహిళల్లో అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలుంటాయి. వీటి మూలంగా గర్భం దాల్చిన తర్వాత, జెస్టేషనల్ డయాబెటిస్, హైపర్‌టెన్షన్, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ. ఐవిఎఫ్ ద్వారా బిడ్డ పుట్టడంతోనే దంపతుల కథ ముగిసిపోదు. నిజానికి బిడ్డ శ్రేయస్సు కోసం దంపతుల జీవితకాలపు నిబద్ధత బిడ్డ పుట్టుకతోనే మొదలవుతుంది. పిల్లల శ్రేయస్సుకు ఆరోగ్యకరమైన, దీర్ఘాయుష్షు కలిగి ఉన్న తల్లితండ్రులు అవసరం. కాబట్టి పెద్ద వయసులో పిల్లలను కనాలనుకునే దంపతులు బిడ్డను పెంచే ఓపిక, వయసుతో పాటు క్షీణిస్తుందనే విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలి.

# అవును... మాకు కాళ్లున్నాయి

కేరళ సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లు గత రెండు రోజులుగా తమ కాళ్లు కనిపించే ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'ఎస్ వుయ్ హావ్ లెగ్స్' అని పెడుతున్నారు. ఇప్పుడక్కడ అది ఉద్యమం. అక్కడి వర్ధమాన నటి అనస్వర రాజన్ 'షార్ట్స్' ధరించి పెట్టిన ఫొటోను చూసి కేరళలోని పురుషులు 'అమ్మాయిలు ఇలా చేయొచ్చా' అని ట్రోల్ చేయడమే ఇందుకు కారణం. అనస్వర రాజన్‌కు మద్దతుగా దేశ విదేశాలలోని మహిళా నెటిజన్స్ కూడా తమ కాళ్ల ఫొటోలు పెట్టి మగవారిని హెచ్చరిస్తున్నారు. తమ శరీరం తమ ఇష్టం అని తేల్చి చెబుతున్నారు. ఇటీవల తెలుగులో 'అల వైకుంఠపురములో' సినిమా 'లవ్ ట్రాక్' అచ్చు హీరోయిన్ కాళ్ల చుట్టే తిరిగింది. అందులో హీరో అయిన అల్లు అర్జున్ హీరోయిన్ అయిన పూజాహెగ్డే కాళ్లను చూసే ప్రేమిస్తాడు. 'సిరివెన్నెల'ను అరువు తెచ్చుకుని పాట కూడా పాడతాడు. ఆ పాట పెద్ద హిట్ అయ్యింది కూడా. సినిమా మొత్తం ఆ హీరోయిన్ కాళ్లు కనిపించేలానే దుస్తులు ధరించి ఉంటుంది. స్త్రీలు తమ కాళ్లు కనిపించేలా దుస్తులు ధరించడం మొదలెట్టి చాలా కాలం అయ్యింది. కాళ్లు కనిపించడాన్ని అభ్యంతరం పెట్టే రోజులు దాటేశామని స్త్రీలు భావిస్తున్నారు కూడా. కాని కాదు.

**వివాదం రేపిన అనశ్వర రాజన్ ఫొటో, భర్త ఫాహద్ ఫాజిల్‌తో నజ్రియా నజీమ్**

సెప్టెంబర్ 12- శనివారం కేరళలో జరిగిన ఒక సంఘటనే ఇందుకు తార్కాణం. అక్కడి వర్ధమాన నటి అనుస్వర రాజన్ తన తాజా ఫొటోను ఆ రోజున ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. అందులో ఆమె 'షార్ట్స్'లో ఉంది. అలాంటి ఫొటోలు సర్వసాధారణమైనవే. అయినప్పటికీ కేరళలో పురుషులు ఆమె మీద దాడి మొదలెట్టారు.





ఆమె ఫొటో కింద కామెంట్స్‌లో 'పద్దెనిమిదేళ్ల అమ్మాయివి. ఇలా చేయొచ్చా' అని ఒకరు, 'మంచి అమ్మాయిలు ఇలాంటి దుస్తులు ధరించరు' అని మరొకరు వందల మంది కామెంట్లు చేశారు. దాదాపు 13 వేల కామెంట్లు నడిచాయి. మొత్తం మీద ఆ కామెంట్స్ సారాంశం 'దుస్తులను బట్టి మర్యాద'. 'స్త్రీ తన శరీరాన్ని దాచుకోవాలి'. 'స్త్రీ అనవసరంగా తన అవయవాలను బహిర్గతం చేయకూడదు', 'ఇలా చేయడం కామ ప్రకటన చేయడం'... గట్రా గట్రా అనే. ఇంకా చెప్పాలంటే స్త్రీ శరీరానికి మాత్రమే 'లైంగికత' ఉంటుంది. స్త్రీ శరీరం మాత్రమే 'సంస్కృతికి ప్రతీక'. 'ఆమె శరీరాన్ని చూపించడం అంటే సంస్కృతిని నాశనం చేయడమే'.

**పార్వతి తిరువోతు**

అనశ్వర రాజన్ ప్రతిభ కలిగిన అమ్మాయి. ఆమె నటించిన 'ఉదాహరణం సుజాత', 'తన్నీర్ మథన్ దినన్‌గళ్' సినిమాలు హిట్ అయ్యాయి. తనమీద వచ్చిన కామెంట్స్‌కు ఆమె రియాక్ట్ అయ్యింది. 'నేనేం చేస్తున్నాననే దాని గురించి ఆందోళన చెందకండి. నేను చేస్తున్నదాని గురించి మీరెందుకు ఆందోళన చెందుతున్నారో దానిగురించి ఆందోళన చెందండి' అని కామెంట్ పెట్టింది. అయితే మరో మలయాళ నటి రీమా కళింగల్ తాను బికినిలో ఉన్న ఫొటోను పోస్ట్ చేసి 'హ్యాష్‌టాగ్ ఎస్ వుయ్ హావ్ లెగ్స్' ఉద్యమాన్ని మొదలెట్టింది. 'స్త్రీలకు మెదడు ఉంది. భుజాలున్నాయి. హక్కులున్నాయి. కలలున్నాయి. తెలివితేటలు ఉన్నాయి. కాళ్లు కూడా ఉన్నాయి. ఆమె తనను ఎలా వ్యక్తపరుచుకోవాలనుకుంటున్నదనేది ఆమె ఇష్టం. దీనికి వ్యక్తిత్వాన్ని, సంస్కృతిని, ప్రతిష్టను ముడిపెట్టాల్సిన అవసరం లేదు' అని ఈ ఉద్యమ ప్రకటనలో భావాన్ని మరికొంత మంది నెటిజన్లు పోస్టర్లుగా విడుదల చేశారు.

దీనికి వెంటనే మలయాళ ఇండస్ట్రీలోని చాలామంది హీరోయిన్లు స్పందించారు. ప్రసిద్ధ హీరో ఫాహద్ ఫాజిల్ భార్య నజ్రియా నజీమ్ కూడా తన భర్తతో పొట్టి దుస్తుల్లో ఉన్న ఫొటోను పోస్ట్ చేసి 'లెగ్‌డే' అని క్యాప్షన్ రాసింది. 'కరీబ్ కరీబ్ సింగిల్' ఫేమ్ మలయాళ నటి పార్వతి తిరువోతు, అహనా కృష్ణ లాంటి హీరోయిన్లు అందరూ తమ కాళ్ల ఫొటోలు పెడుతున్నారు. 'మగవాళ్ల శరీరాలు ఆడవాళ్ల శరీరాలు ఒకటే. మగవాళ్లు పొట్టి దుస్తులు ధరిస్తే రాని కామెంట్లు ఆడవాళ్లు ధరించగానే వచ్చేస్తాయి. మేము ఎలాంటి బట్టలు వేసుకోవాలో మా ఇష్టం. మీ ఇష్టం కాదు' అని అహనా కృష్ణ రాసింది. ఇది మగస్వామ్యపు వ్యవస్థ అనేది వాస్తవం. ఇక్కడ స్త్రీలకు బంధనాలు ఉన్నాయి అనేది వాస్తవం. కాళ్లు కనిపించినా కూడా సమస్య చేసేంతగా వారికి బంధనాలు వేస్తుంటే వారింక ఏ విధంగా అడుగు ముందుకేస్తారనేది కూడా ప్రశ్నే.తెలుగునాట కూడా ఇలాంటి పరిస్థితి ఉంది. గతంలో పార్లమెంట్‌లో నటుడు మురళీమోహన్ స్త్రీల దుస్తుల గురించి 'జాగ్రత్తలు' చెప్పి తీవ్రమైన నిరసనను ఎదుర్కొన్నారు. ఇటీవల యాంకర్ అనసూయ ఒక టీవీ షోలో ధరించిన బట్టలపై కూడా సోషల్ మీడియాలో కామెంట్లు వచ్చాయి. ఈ సాంఘిక భద్రత, సంఘ మర్యాదల బరువును తమ శరీరాల మీద వేయడం గురించి స్త్రీలు నిరసన తెలుపుతూనే ఉన్నారు. 'స్త్రీలు శరీరాలను చూపడం వల్లే అత్యాచారాలు' అనే మూస అభిప్రాయానికి 'మరి చిన్న పిల్లల మీద పండు ముదుసలుల మీద ఎందుకు అత్యాచారాలు జరుగుతున్నాయి?' అని నిలదీస్తూనే ఉన్నారు. స్త్రీని భోగవస్తువుగా చూసే దృష్టి, ఆమె శరీరాన్ని లైంగిక కారకంగా చూసే దృష్టి పోనంత కాలం ఇలాంటి హాష్‌టాగ్ ఉద్యమాలు మరిన్ని జరుగుతూనే


# బొట్టు బిళ్లలనూ నగలుగానే చూద్దాం..



బొట్టు బిళ్లలు మనకు రోజువారీ జీవితంలో భాగమే. కానీ ఇటీవలి కాలంలో చాలామంది ఫ్యాషన్ అంటూ వాటిని పెట్టుకోవడం మానేస్తున్నారు. దీనికి ఓ చక్కని పరిష్కారాన్ని వెతికింది హైదరాబాద్‌లో పుట్టిన మేఘన ఖన్నా. ట్రెండీ లుక్ కోరుకునే వాళ్ల కోసం బొట్టు బిళ్లలనే ట్రెండీగా మారిస్తే సరిపోతుంది కదా%ా% అన్న ఆలోచన చేసింది. 'బిందీ ప్రాజెక్ట్' పేరిట ఓ సంస్థను స్థాపించి స్టేట్‌మెంట్ తరహా స్టిక్కర్ల తయారీ ప్రారంభించింది. దుస్తులు యాక్సెసరీల పునర్వినియోగానికి కృషిచేస్తున్న ఫ్రీలవ్‌డ్ కో అనే సంస్థకు సహవ్యవస్థాపకురాలిగా, మహిళలకు మోటార్ సైకిల్ కోచ్‌గా, పర్సనల్ ట్కస్టైలిస్ట్‌గానూ పనిచేస్తున్నది. తన బొట్టు బిళ్లలను నగలుగా చూడాలని చెప్పే ఈమె పంచుకున్న సంగతులు!,, నేను గమనించినంత మేర నా చుట్టు పక్కల ఏదైనా మిస్ అయింది అని అనిపిస్తే దాన్ని అక్కడికి తీసుకురావడం నాకు అలవాటు. బిందీ ప్రాజెక్ట్ విషయంలో ఇదే జరిగింది. మా అమ్మ బెంగాలీ. నాన్న పంజాబీ. అయితే నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్ పైలట్ కావడం వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉండాల్సి వచ్చింది. అమ్మానాన్న చాలా ఏండ్లు సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలో ఉన్నారు. నేను ఇక్కడే పుట్టాను. అయితే నా మిత్రులు అప్పుడప్పుడూ వంశపారంపర్యంగా వచ్చే బంగారు బొట్టు బిళ్లల గురించి మాట్లాడుకునేవాళ్లు. అయితే ఇప్పుడసలు బొట్టు బిళ్లలే ఎవరూ పెట్టుకోవడం లేదని కూడా చర్చ వచ్చేది. అందుకే నేను బొట్టు బిళ్లలను ఆకర్షణీయంగా తయారు చేయాలి అనుకున్నాను. నిజానికి వ్యాపారవేత్తగా నా తొలి సంస్థ కూడా ఇలా ప్రారంభం అయిందే. దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళలను అమ్మే లావిటేట్ సంస్థ స్థాపన వెనకా ఇలా ఖాళీలను పూరించే తరహా ఉద్దేశమే ఉంది.

తొలి అడుగు,,దేశం విడిపోయినప్పుడు పంజాబ్‌లోని లాహోర్ నుంచి సికింద్రాబాద్ వచ్చి స్థిరపడింది మా కుటుంబం. మా నాన్న ఇక్కడే పెరిగారు. భారత ఎయిర్‌ఫోర్స్ విభాగంలో పనిచేస్తూ శ్రీనగర్ నుంచి సికింద్రాబాద్ దాకా అనేక చోట్ల సేవలందించారు. నాన్న ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేయడం వల్ల మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ ఇలా అనేక రాష్ట్రాల్లో తిరిగాం. పుణెలో డిగ్రీ చేశాను. తర్వాత ఎంబీఏ చేసి ముంబైలో మార్కెట్ రీసెర్చ్ సంస్థలో ఏడాది పాటు పనిచేశాను. కానీ ఉద్యోగం అన్నది నాకెందుకో మింగుడుపడలేదు. బాగా పనిచేస్తున్నానన్న పేరు వచ్చింది కానీ అది అంత సంతృప్తినివ్వలేదు. వెంటనే ఉద్యోగం మానేశా. నిజానికి తర్వాత ఏం చేయాలి అన్నదాని మీద నాకు స్పష్టత లేదు. నాకు నచ్చిన ఊళ్లనీ తిరిగా. అక్కడి ప్రత్యేకతలు తెలుసుకున్నా. ఎప్పుడూ రాని నగరం బెంగళూరుకు కూడా వచ్చి కొన్నాళ్లు ఉన్నా. అయితే ఉత్తర భారతదేశం వైపు ఉన్న హస్త కళలకు సంబంధించిన వస్తువులు, నగలు దక్షిణ భారతంలో దొరకడం లేదని అర్థమైంది. నేను చెప్పేది 2002 నాటి సంగతి. అప్పుడు వేరువేరు రాష్ట్రాలకు వెళ్లడానికి సరైన రవాణా సదుపాయాలు ఉండేవి కావు. దీంతో నేను వివిధ రాష్ట్రాల హస్తకళలను ఒక్క దగ్గరికి తీసుకొచ్చేలా 'లావిటేట్' అనే సంస్థను బెంగళూరులో ప్రారంభించా. అందులో రకరకాల చోట్ల నుంచి వచ్చిన అందమైన నగలు, యాక్సెసరీలు, గృహాలంకరణ వస్తువులు ఉండేవి. పద్దెనిమిది సంవత్సరాలు దాన్ని నడిపాను. చాలా పేరొచ్చింది. కొవిడ్ సమయంలో అప్పటి పరిస్థితుల కారణంగా దాన్ని మూసివేశాను. ఆ తర్వాత నా స్నేహితురాలితో కలిసి ప్రారంభించిన ఫ్రీలవ్‌డ్ కో అనే సంస్థ కోసం పనిచేయడం ప్రారంభించాను. థ్రిఫ్టింగ్ అనే పద్ధతిలో ఇది నడుస్తుంది. అంటే ఒకరి దగ్గర నిరుపయోగంగా ఉన్న వస్తువులు మరొకరికి ఇచ్చి, అవతలి వాళ్ల దగ్గరి వస్తువులు లేదా దుస్తులను వీళ్లు తీసుకోవడం అన్నమాట. ఇది కూడా ప్రస్తుతం బెంగళూరులోనే ఉంది. పర్యావరణానికి ఎంతో మేలు చేసే ఈ ప్రయత్నాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే పనిలో ఉన్నాం.ఉషా ఉతుప్‌కి,,%రెండేండ్ల క్రితం బిందీ ప్రాజెక్ట్ ప్రారంభించేప్పుడు కూడా పర్యావరణహితంగానే ఉండాలన్న నియమాన్ని పెట్టుకున్నాను. అందుకే నా స్నేహితుల లెదర్ ఫ్యాక్టరీలో మిగిలిపోయిన ముక్కలను తీసుకొచ్చి బొట్టు బిళ్లల తయారీకి వినియోగిస్తున్నా. ఎరుపు, నలుపు, మెరూన్ రంగులే కాకుండా మా దగ్గరి బొట్టు బిళ్లలు బ్రౌన్, సిల్వర్‌లాంటి విభిన్న వర్ణాల్లో కనిపించడానికి ఇదే కారణం. ఇక, మా దగ్గరి స్టిక్కర్లన్నీ పూర్తిగా హ్యాండ్ మేడ్. వీటి తయారీలో వస్త్రంతో పాటు, రంగు రాళ్లు, ఇత్తడి ముక్కలు, పూసల్లాంటి వాటిని వినియోగిస్తాం. మా దగ్గర తయారయ్యే ఒక్కో బొట్టు బిళ్లా ఒక్కో నగలా ఉంటుంది. ఆభరణాల్లో పెద్దపెద్దవి స్టేట్‌మెంట్ పీస్‌లుగా ఎలా పెట్టుకుంటామో, బొట్టు బిళ్లలో మా దగ్గరివి అలా స్టేట్‌మెంట్ పీస్‌లన్నమాట. చీర, సంప్రదాయ దుస్తుల మీదకే కాదు, చిరిగిన జీన్సు మీదకి కూడా పెట్టుకోగలిగేలా వీటిని తయారు చేస్తున్నాం. అయితే మా బొట్టు బిళ్లలు చిన్న చుక్కల్లా మాత్రం ఉండవు, 8 మిల్లీమీటర్ల వెడల్పుతో ఇవి ప్రారంభం అవుతాయి. అంటే ఇందాక చెప్పినట్టు మన ఆహార్యంలో ఇవి కూడా ఒక నగ లేదా యాక్సెసరీ అనుకోవాలి. వీటితో పాటు ఇచ్చే ప్రత్యేకమైన గమ్‌తో మళ్లీమళ్లీ వాడుకోవచ్చు. ఆమని, రుహాని, దేవయాని, కళ్యాణి%ా% ఇలా రకరకాల పేర్లతో విభిన్నమైన కలెక్షన్లు తీసుకొచ్చాం.

# నోటి క్యాన్సర్.. పారా హుషార్..



ఇంటర్ తరగతుల నుంచే చదువులని ఇంటికి దూరంగా ఉండి అబ్బాయిలు ఆ తర్వాత పై చదువులు, ఉద్యోగాలు, కానాఫరెన్స్‌లు, మీటింగులు అని దూరపు ప్రయాణాలు ఎక్కువగా చేస్తుంటారు. ఇంటి వంటకు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండక తప్పని పరిస్థితులు. అంతేకాకుండా అబ్బాయిలకు స్నేహితులు, సరదాలు అమ్మాయిలతో పోలిస్తే చాలా ఎక్కువ అని చెప్పుకోవచ్చు. ఈ క్రమంలో సరదాగా మొదలయ్యే స్మోకింగ్, గుట్కా, ఆల్కహాల్ వంటి దురలవాట్లతో బయట తిండి కూడా చాలా ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. బయట తీసుకునే ఆహారం రుచికరంగా, అందంగా కనిపించడానికి నూనెలు, ఉప్పు కారాలు ఎక్కువగా వాడటమే కాకుండా కొన్ని ఆర్టిఫీషియల్ ఫుడ్ కలర్స్, కెమికల్స్, వాడిన నూనెలే మళ్లీ మళ్లీ వాడడం జరుగుతూ ఉంటుంది. ఇవి క్యాన్సర్ కారకాలు కావచ్చు.

దురలవాట్లు, బయటి తిండి ఎక్కువగా తినడం, వ ృత్తి పరమైన కారణాలు ఎక్కువై మానసిక ఒత్తిడికి గురవడం, వాతావరణ కాలుష్యానికి గురవడం, నైట్ డ్యూటీలు, ఏసీ రూముల్లో నిద్ర లేకుండా పనిచేయడం, శారీరక శ్రమ చాలా తక్కువ ఉండడం కారణాలు ఏమైనా మొత్తంగా చూస్తే పురుషులు స్త్రీలకంటే క్యాన్సర్‌కు ఎక్కువగా గురవుతారని మనం గమనించగలం. పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన కాన్సర్ తప్పితే ఇంక ఏవి తీసుకున్నా స్త్రీలకంటే పురుషులలోనే ఎక్కువ. ఈ మధ్య పురుషులు కూడా రొమ్ము క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువ కావడం మరింత బాధాకరం. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌కు గురయ్యే వారి సంఖ్యను చూస్తే 2007 నుంచి 2030 సంవత్సరానికి ఈ సంఖ్య 45 శాతం పెరిగే అవకాశం ఉంది. అవగాహన పెంచే కార్యక్రమాలు, జాగ్రత్తలు, ముందుగానే పసిగట్టే స్క్రీనింగ్ టెస్ట్‌లు ఎన్నివచ్చినా క్యాన్సర్ రాకుండా నివారించగలగడం ఎవ్వరి చేతుల్లో లేదు అనేది సత్యం. 2030 నాటికి ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాల సంఖ్య అన్ని క్యాన్సర్‌ల కంటే అధికంగా ఉండవచ్చు అని అంచనా. సిగరెట్, బీడీలు, పాన్, గుట్కా, ఆల్కహాల్, పొగాకు నమలడం మొదలగునవి నోటి క్యాన్సర్‌కు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే నోటి క్యాన్సర్స్ విషయంలో మన దేశమే మొదటి స్థానంలో ఉంది. ప్రతి సంవత్సరం దాదాపు 80,000 మంది దాకా ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్న కోలకతాలో ప్రతి లక్ష మందిలో20 మంది లంగ్ క్యాన్సర్‌కు గురవుతున్నారు. తర్వాత కాలుష్యం అధికంగా ఉండే ఢిల్లీలో ఈ సంఖ్య 15 మందిదాకా ఉంది. ఉప్పు, కారాలు, పచ్చళ్లు, మసాలాలు ఎక్కువగా తీసుకోవడం ఇంకా దురలవాట్లు కూడా ఉండడం పొట్టకు సంబంధించిన క్యాన్సర్‌కు గురిచేస్తున్నాయి. అందుకే భారతదేశంలోని పురుషులు ఈ క్యాన్సర్ బారిన పడడం ఎక్కువ అని గణాంకాలు తెలియజేస్తున్నాయి. మన దేశంలోని పురుషులు నోరు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, పొట్ట, కోలన్ క్యాన్సర్‌కు గురికావడం చాలా ఎక్కువగా గమనిస్తూ ఉంటాం. అలవాట్లు, జీవనశైలి, ఆహారం ఆరోగ్యకరంగా లేకపోవడం క్యాన్సర్ కారకాలు కావడంతో పాటు పురుషులలో వ ృత్తిపరమైన కారణాలు ఉంటాయి. ఆస్‌బెస్టాస్ కంపెనీలో పనిచేసేవారు. అల్యూమినియం ప్రొడక్షన్ కంపెనీలో పని, ఆల్కహాలిక్ బేవరేజెస్, పొగాకు ఉత్పత్తుల కంపెనీ, రేడియం ఉత్పత్తులు, రేడియో న్యూక్లయిడ్స్, చెక్కపొడి, గామ రేడియేషన్ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో పనిచేసేవారికి ఊపిరితిత్తులు, హెడ్ అండ్ నెక్ క్యాన్సర్స్ ఇతర వ ృత్తులలో వారి కంటే ఎక్కువగా వచ్చే రిస్క్ ఉంటుంది. ఎండలో ఎక్కువగా తిరగడం లేదా ఎండ అసలు తగలకుండా ఏసీ రూముల్లో గంటల తరబడి పనిచేయడం, నైట్ డ్యూటీలు, పెస్టిసైడ్స్, కెమికల్స్‌కు మగవారే ఎక్కువగా గురవుతారు. కాబట్టి వారికి క్యాన్సర్స్ ముప్పు పొంచి ఉంటుంది. సాధారణంగా పురుషులు ఇంట్లో ఏవి పడితే అవి తింటుంటారు. అందుకే బయటకు వెళ్లినప్పుడు తేలికగా దొరికే జంక్‌ఫుడ్‌ను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఫలితంగా ఊబకాయం. ప్రొస్టేట్ క్యాన్సర్‌ను ముందుగానే తెలుసుకోవడానికి పీఎస్ఏ(ప్రొస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్) అనే రక్త పరీక్షను 50 ఏళ్లు పై బడ్డాక చేయించుకోవడం మంచిది. ఎందుకంటే ప్రొస్టేట్ క్యాన్సర్ లక్షణాలు వీర్యంలో, మూత్రంలో రక్తం కనిపించడం, నడుము, తుంటి, పక్క టెముకల నొప్పులు, మూత్ర సంబంధ సమస్యలు కనిపించే సరికే దశ ముదిరిపోయి ఎముకలకు కూడా పాకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పీఎస్‌ఏ పరీక్షలో యాంటిజెన్ పెరుగడాన్ని గమనిస్తే ఇతర పరీక్షలు బయాప్సీతో పాటు అవసరమయితే అల్ట్రాసౌండ్, బోన్‌స్కాన్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, బయాప్సీ వంటి పరీక్షలు చేస్తారు. 50 ఏళ్లు పైబడిన పురుషుల్లో లక్షణాలు ఉన్నా లేకున్నా పీఎస్ఏ టెస్ట్, డీఆర్ఈ చేయించుకొని డాక్టర్ సలహా మేరకు ఎంత కాలంలో మళ్లీ చేయించుకుంటే మంచిది? పీఎస్ఏ టెస్ట్ మార్పులు ఎలా ఉంటున్నాయి? ఇంకా ఇతర పరీక్షలను ఎటువంటి లక్షణాలు ఉన్నప్పుడు తప్పనిసరిగా చేయించుకోవాలి? అనే విషయాల మీద అవగాహన పెంపొందించుకోవడం తప్పనిసరి. -పురుషులు ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయడం తగదు.

-తగ్గని దగ్గు, దాంతో పాటు రక్తం
-ఆకలి, బరువు తగ్గడం
-నొప్పితో పాటు జ్వరం
-మూత్రం ఆగి ఆగి రావడం, రక్తం కనిపించడం
-మలవిసర్జనలో రక్తస్రావం
-తీవ్రమైన ఆజీర్తి
-గొంతు నొప్పి, ఘన పదార్థాలు తీసుకోలేకపోవడం
-నోటిలో మానని పుండు
-ఎముకల నొప్పులు

పైలక్షణాలను ఇన్‌ఫెక్షన్స్ అని, పైల్స్ అని, రోగనిరోధక శక్తి తగ్గిందని, స్మోకింగ్ వల్ల కొద్దిగా దగ్గు వస్తుందని నిర్లక్ష్యం చేయడం జరుగతూ ఉంటుంది. కానీ వయసు పై బడి దురలవాట్లు ఉండి లక్షణాలు కనిపిస్తే మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. పురుషులలో ఎక్కువగా కనిపించే నోరు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, పొట్ట, కోలన్, ప్రొస్టేట్ కాన్సర్లకు సంబంధించిన హెచ్చరికలూ కావచ్చు.




# నవ బిజినెస్

## 64 పైసలు తగ్గి ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి రూపాయి విలువ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత రూపాయి విలువ శుక్రవారం (ఆగస్టు 29న) అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూ.88కి చేరుకుని ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. అమెరికా భారతదేశంపై విధించిన భారీ సుంకాలు ఈ పతనానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ట్రేడింగ్ సమయంలో రూపాయి విలువ 64 పైసలు తగ్గి, ఒక డాలర్‌కు రూ.88.29 స్థాయికి చేరింది.ఇది ఇప్పటివరకు అత్యంత తక్కువ స్థాయి. అయితే, మధ్యాహ్నం 2:10 గంటల సమయానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డాలర్లను విక్రయించడం ద్వారా రూపాయికి కొంత మద్దతు లభించింది. దీంతో రూపాయి విలువ రూ.88.12 వద్ద ట్రేడైంది.ఈ ఏడాది ఫిబ్రవరిలో రూపాయి ఒక డాలర్‌కు రూ.87.95 వద్ద ఆల్-టైమ్ కనిష్ఠ స్థాయిని తాకింది. 2025లో ఇప్పటివరకు రూపాయి విలువ 3% తగ్గింది. దీంతో ఆసియాలో అత్యంత బలహీనమైన కరెన్సీగా రూపాయి మారింది. శుక్రవారం నాడు చైనీస్ యువాన్‌తో రూపాయిని పోలిస్తే రికార్డు కనిష్ఠ స్థాయికి చేరింది. అమెరికా భారత వస్తువులపై విధించిన భారీ సుంకాలు భారత ఆర్థికవృద్ధి, విదేశీ వాణిజ్యాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వారం అమెరికా భారత వస్తువులపై అదనంగా 25% సుంకం విధించింది, దీంతో మొత్తం సుంకం 50%కి చేరింది.ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం, ఈ టారిఫ్‌లు ఒక సంవత్సరం కొనసాగితే భారత్ జీడీపీ వృద్ధి 0.6% నుంచి 0.8% వరకు తగ్గే అవకాశం ఉంది. భారత్ అమెరికాకు చేసే ఎగుమతులు మొత్తం జీడీపీలో 2.2%. టారిఫ్‌ల కారణంగా దుస్తులు, జ్యువెలరీ వంటి కార్మిక ఆధారిత రంగాలు ఎక్కువగా నష్టపోతాయి.

## మిసెస్ ఇండియా 2025 హైదరాబాద్‌కు చెందిన మీను సింగ్‌కు కిరీటం




**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌కు చెందిన ఇంజనీర్, సామాజిక కార్యకర్త మోడల్ మీను సింగ్ న్యూఢిల్లీలోని మయూర్ విహార్‌లోని క్రౌన్ ప్లాజాలో జరిగిన ఒక అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమంలో గృహలక్ష్మీ మిసెస్ ఇండియా 2025 కిరీటాన్ని పొందారు. ఈ ప్రతిష్టాత్మక పోటీని భారతదేశంలోని ప్రముఖ మహిళా పత్రిక గృహలక్ష్మీ నిర్వహించింది, ఇది 35 సంవత్సరాల స్త్రీత్వాన్ని జరుపుకునే వారసత్వాన్ని కలిగి ఉంది.కిరీటంతో పాటు, మీను రెండు ప్రత్యేక బిరుదులను కూడా గెలుచుకుంది – లా పింక్ నేచురల్ స్కిన్‌కేర్ సమర్పించిన "రేడియంట్ స్కిన్" మరియు "బెస్ట్ డ్రెస్డ్".తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మీను సింగ్ ఇలా అన్నారు:

"ఈ కిరీటాన్ని ధరించడం నాకు చాలా గౌరవంగా మరియు కృతజ్ఞతగా అనిపిస్తుంది. నాకు, ఇది కేవలం వ్యక్తిగత విజయం కాదు, స్ఫూర్తినిచ్చే మరియు సాధికారత కల్పించే బాధ్యత. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి మరియు మహిళా సాధికారతకు దోహదపడటానికి నేను ఈ వేదికను ఉపయోగించాలనుకుంటున్నాను"

## సెప్టెంబర్‌లో సగం రోజులు బ్యాంకులు బంద్.. లిస్ట్ ఇదే




**న్యూఢిల్లీ-నవభూమి:** కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రతి నెలా బ్యాంకు సెలవుల జాబితాను ముందుగానే జారీ చేస్తుంది. అందుకు తగ్గట్టుగానే సెప్టెంబర్ నెలకు సంబంధించిన సెలవుల జాబితా కూడా తాజాగా విడుదలైంది. కాగా, ఆ నెలలో పండుగలు, వారాంతాలతో కలిపి సగం రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. అయితే ఆర్‌బీఐ సెలవుల జాబితాలోని బ్యాంకు సెలవులు అన్ని రాష్ట్రాలకు వర్తించవు. ఆయా ప్రాంతీయ వేడుకలు, పండుగల ప్రకారం సెలవులు ఇస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులకు పబ్లిక్ హాలిడేస్ మాత్రం కామన్ గా ఉంటాయి.

ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ ప్రకారం.. సెప్టెంబర్ నెలలో బ్యాంకు సెలవుల జాబితా..సెప్టెంబర్ 3 (బుధవారం) : కర్మ పూజ సందర్భంగా జార?ండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సెలవు.

సెప్టెంబర్ 4 (గురువారం) : కేరళలో ఓనం మొదటి రోజు సందర్భంగా హాలిడే

సెప్టెంబర్ 5 (శుక్రవారం) : మిలాద్-ఉన్-నబీ సందర్భంగా అహ్మదాబాద్, ఐజ్వాల్, బేలాపూర్, బెంగళూరు, భోపాల్, చెన్నై, డెహ్రాడూన్, హైదరాబాద్, ఇంఫాల్, కాన్పూర్, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూ ఢిల్లీ, రాంచీ, శ్రీనగర్, తిరువనంతపురం, విజయవాడలో బ్యాంకులకు సెలవు.

సెప్టెంబర్ 6 (శనివారం): ఇంద్రజాత్ర సందర్భంగా సిక్కిం, జమ్ము, రాయ్‌పూర్, శ్రీనగర్‌లో బ్యాంకులు పనిచేయవు.

సెప్టెంబర్ 7 : ఆదివారం

సెప్టెంబర్ 12 (శుక్రవారం) : ఈద్ ఇ మిలాద్ ఉల్ నబీ సందర్భంగా జమ్ము, శ్రీనగర్ ప్రాంతాల్లో బ్యాంకులు మూసి ఉంటాయి.

సెప్టెంబర్ 13 : రెండో శనివారం

సెప్టెంబర్ 14 : ఆదివారం

సెప్టెంబర్ 21 : ఆదివారం

సెప్టెంబర్ 22 (సోమవారం) : నవరాత్రి స్థాపన సందర్భంగా రాజస్థాన్‌లో బ్యాంకులకు సెలవు.

సెప్టెంబర్ 23 (మంగళవారం) : మహారాజా హరి సింగ్ జీ జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్ము, శ్రీనగర్‌లో బ్యాంకులకు సెలవు.

సెప్టెంబర్ 27 : నాలుగో శనివారం

సెప్టెంబర్ 28 : ఆదివారం

సెప్టెంబర్ 29 (సోమవారం) : మహా సప్తమి/దుర్గాపూజ సందర్భంగా త్రిపుర, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది.

సెప్టెంబర్ 30 (మంగళవారం) : మహా అష్టమి / దుర్గాష్టమి / దుర్గా పూజ సందర్భంగా త్రిపుర, ఒడిశా, అస్సాం, మణిపూర్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేయవు.

## బాధ్యతలు స్వీకరించిన ఉర్జిత్ పటేల్



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఆర్బీఐ మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ ఏడాది ఏప్రిల్ 30న అప్పటిదాకా ఈ హోదాలో పనిచేసిన కేవీ సుబ్రమణ్యన్‌కు మోదీ సర్కారు ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే. నిజానికి ఆయన పదవీకాలం మూడేట్కుండ్లైనా 6 నెలల ముందే తొలగించారు. అప్పట్నుంచి ఐఎంఎఫ్‌లో భారత్ తరఫున ఈడీ పోస్టు ఖాళీగానే ఉంటుండగా, దాన్ని పటేల్‌తో భర్తీ చేశారిప్పుడు.

ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ అనుమతుల్ని ఇచ్చింది. మూడేండ్లు లేదా తదుపరి ఆదేశాలు వచ్చేదాకా ఈ నియామకం అమల్లో ఉంటుందని గురువారం విడుదల చేసిన ఓ అధికారిక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో 25 మంది ఈడీలుంటారు. సభ్య దేశాలు లేదా ఆయా దేశాలతో కూడిన గ్రూపులు వీరిని ఎన్నుకుంటాయి. ఇదిలావుంటే ఇంతకుముందు ఏఐఐబీ పెట్టుబడి కార్యకలాపాల ఉపాధ్యక్షుడిగా ఉర్జిత్ పటేల్ పనిచేశారు. అయితే నిరుడు జనవరిలో కుటుంబ ఆరోగ్య సంబంధిత సమస్యల దృష్ట్యా రాజీనామా చేశారు.

## జీఎస్టీ శ్లాబ్స్‌లో మార్పు.. ఫార్మా ఎగుమతి సంస్థలకు కొత్త అవకాశాలు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశం నుంచి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ఔషధాలు ఎగుమతి అవుతుంటాయి. అందుకే ఇండియాను ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్ అని పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు ఇండియా కీలక పాత్ర పోషిస్తుంది. ఇదే సమయంలో భారత ప్రభుత్వం ఒక కొత్త (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధపడుతోంది. ఈ మార్పులు చిన్న వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని భారత ఫార్మాస్యూటికల్ ఎగుమతి ప్రోత్సాహక మండలి హెచ్చరిస్తోంది. దీని వల్ల అనేక సవాళ్లు ఎదురవుతాయని అంటోంది.ప్రస్తుతం భారతదేశంలో ఫార్మాస్యూటికల్స్‌కు రెండు విభిన్న రేట్లలో పన్నులు ఉన్నాయి. పూర్తైన ఔషధాలపై 12% ట్యాక్స్, వాటి ఉత్పత్తిలో భాగంగా ఉండే యాక్టివ్ ఫార్మాస్యూటికల్‌పై 18% ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఆ మధ్య 6% వ్యత్యాసం ఉంది. ఇప్పుడు, ప్రభుత్వం రేట్లను 5%, 18% అని రెండు శ్లాబులుగా తీసుకురావాలని యోచిస్తోంది. ఈ మార్పు అమలైతే, గ్యాప్ మరింత పెరిగి 13%కి చేరుకుంటుంది. దీంతో చిన్న వ్యాపారాలు, ప్రత్యేకంగా నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అంటున్నారు.

అలాగే సమస్య ఏంటి?ఈ క్రమంలో జీఎస్టీ మార్పులు అనేక వర్గాల్ని ప్రభావితం చేస్తాయని చెబుతున్నారు. ప్రత్యేకంగా, ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు సంబంధించిన చిన్న వ్యాపారాలు, ప్రత్యేకంగా ప్రెస్క్రిప్షన్ ఔషధాలను తయారు చేసే కంపెనీలు నష్టపోతాయని ఆయా వర్గాలు అంటున్నాయి.జీఎస్టీ రీఫండ్ వసూళ్లను సాధించాలంటే, పన్ను కట్టిన తర్వాత కొన్ని రోజుల్లో మరొకటి దరఖాస్తు చేయాలి. కానీ, ఎన్నో సందర్భాలలో ఈ పద్ధతులు ఆలస్యం అవుతుంటాయని, తద్వారా పనివేళల్లో డబ్బు తగ్గడం, పన్ను వసూలు చేయడంలో ఆలస్యం అవుతుందన్నారు. దీని ద్వారా వ్యాపారాలకు నగదు ప్రవాహం క్రమంగా తగ్గుతుందని ఆయా వర్గాలు చెబుతున్నాయి.

ఏం చేయాలి?ఈ సమస్యలు పరిష్కరించడానికి ఫార్మెక్సిల్ కొన్ని సూచనలు ఇచ్చింది. ఈ సూచనల్లో ప్రధానమైనది ఫార్ములేషన్ (పూర్తయిన ఔషధాలు)పై రేట్లు సమానంగా ఉంచాలని కోరారు. ఒకే రేటులో ఫార్ములేషన్‌లు ఉంటే ఇన్వర్టెడ్ డ్యూటీ కేటగిరి సమస్యను తగ్గిపోతుందన్నారు. దీని ద్వారా రేట్ల మధ్య తేడా లేకుండా పరిశ్రమకి స్థిరత్వం లభిస్తుందన్నారు. అలాగే, రీఫండ్ ఫెసిలిటేషన్‌ను మరింత వేగవంతం చేయాలని ఫార్మెక్సిల్ సూచించింది. 15-30 రోజులలోపు రీఫండ్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు.

## ఏఐ సరికొత్త కామధేనువు



**న్యూఢిల్లీ-నవభూమి:** రిలయన్స్ జియోతో దేశ టెలికాం రంగంలో సంచలనం సృష్టించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో సంచలనానికి సిద్ధమవుతోంది. దేశంలో ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ కృత్రిమ మేధ (ఏఐ) సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం రిలయన్స్ ఇంటలిజెన్స్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. శుక్రవారం కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఆర్ఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. 'జియో ద్వారా దేశంలో ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ డిజిటల్ సేవలను చేరువ చేశాం. ఇప్పుడు అదే తరహాలో రిలయన్స్ ఇంటలిజెన్స్ ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటా ఏఐ సేవలు అందిస్తాం' అన్నారు. ఏఐ కామధేనువులా తమ వ్యాపార విస్తరణకు తదుపరి చోదక శక్తి కాబోతోందని ముకేశ్ అంబానీ ప్రకటించడం విశేషం.మెటా, గూగుల్‌తో జట్టు: అంతర్జాతీయ టెక్ దిగ్గజాలతోనూ రిలయన్స్ చేతులు కలుపుతోంది. ఏఐ సేవల కోసం ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా'తో కలిసి ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేసింది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బెర్గ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ జేవీలో తొలుత ఇరు సంస్థలు రూ.10 కోట్ల డాలర్ల (రూ.855 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ జేవీ ద్వారా కంపెనీలు, ప్రభుత్వానికి అవసరమైన ప్రత్యేక ఏఐ సేవలను అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం మెటాకు చెందిన ఓపెన్‌సోర్స్ ఎల్ఎల్ఏఎంఏ మోడల్స్‌ను ఉపయోగిస్తామని జుకర్‌బర్గ్ తెలిపారు. మరోవైపు గూగుల్‌తో కలిసి గుజరాత్, జామ్‌నగర్ ప్రాంతంలోని తన వ్యాపార అవసరాల కోసం ప్రత్యేక క్లౌడ్ రీజియన్ ఏర్పాటు చేయబోతున్నట్టు అంబానీ ప్రకటించారు.జియో నుంచి స్మార్ట్ గ్లాసెస్: జియో ఫ్రేమ్స్ పేరుతో జియో స్మార్ట్ గ్లాసెసలోకి ప్రవేశించింది. ఆర్ఐఎల్ ఏజీఎంలో రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ ఈ స్మార్‌గ్లాసెసను ఆవిష్కరించారు. ఈ గ్లాసెస్ ద్వారా చేయి పెట్టకుండానే ఏఐ వాయిస్ అసిస్టెంట్ 'రియా' సాయంతో అన్ని భారతీయ భాషల్లో ఫోన్ కాల్స్, మ్యూజిక్, వీడియో రికార్డింగ్స్ వంటి పనులు చేసుకోవచ్చు.జోరుగా రిటైల్ వ్యాపారం: రిలయన్స్ రిటైల్ వ్యాపారం కూడా జోరందుకున్నట్లు ఆర్ఐఎల్ డైరెక్టర్ ఈషా అంబానీ ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈ విభాగం రూ.3.3 లక్షల కోట్లకుపైగా వ్యాపారం నమోదు చేసిందని వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో రిటైల్ వ్యాపారం ఏటా సగటున 20 శాతం చొప్పున పెరగనుందన్నారు. తమ వ్యాపార ఆదాయంలో 70 శాతం స్టోర్ల ద్వారానే వస్తున్నందున ఏటా 2,000 నుంచి 3,000 కొత్త స్టోర్ల ఏర్పాటు కొనసాగుతుందని ఈషా అంబానీ తెలిపారు.

ఏజీఎం ఇతర ప్రధాన అంశాలు

**2030 నాటికి రెండింతలు పెరగనున్న వ్యాపారం**

వచ్చే మూడు, నాలుగేళ్లలో జియో, రిటైల్ ఆదాయాలు రెట్టింపు

కేజీ బేసిన్‌లో చమురు, సహజ వాయువుల కోసం మరిన్ని బావుల తవ్వకం

కేజీ బేసిన్‌లో 21,000 బ్యారళ్లకు చేరిన రోజువారీ ముడి చమురు ఉత్పత్తి

గత ఆర్థిక సంవత్సరం 11 శాతం వృద్ధితో రూ.6,26,921 కోట్ల ఆదాయం

మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా చమురు శుద్ధి సామర్థ్యం పెంపు

న్యూ ఎనర్జీలో కొత్త వ్యాపార ప్రాజెక్టులపై రూ.75,000 కోట్ల పెట్టుబడులు

తొలి మూడు నెలల్లోనే 60 కోట్లకు చేరిన జియోహాట్‌స్టార్ వినియోగదారులు


త్వరలో రిలయన్స్ నుంచి ఏఐ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోలు

2035 నాటికి పూర్తి కాలుష్య రహిత కంపెనీగా ఆర్ఐఎల్

2026 జూన్ నాటికి జియో మెగా ఐపీఓ

రిలయన్స్ జియో మెగా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మీద కూడా ముకేశ్ అంబానీ స్పష్టత ఇచ్చారు. వచ్చే ఏడాది (2026) జూన్ లోపే ఈ ఐపీఓ మార్కెట్‌కు వస్తుందని ప్రకటించారు. భారత క్యాపిటల్ మార్కెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద ఐపీఓ అవుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జియో ఖాతాదారుల సంఖ్య 50 కోట్లు మించిపోయిందని జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రకటించారు. దీంతో ప్రపంచంలోని అతిపెద్ద టెలికాం కంపెనీల్లో ఒకటిగా జియో ఆవిర్భవించినట్టు తెలిపారు.

## బంగారం ధరల్లో మళ్లీ పెరుగుదల.. నేటి రేట్స్ ఇవీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో బంగారం ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. పండుగ సీజన్‌తో పాటు అంతర్జాతీయ పరిణామాలు కూడా బంగారం ధరలకు రెక్కలొచ్చేలా చేస్తున్నాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా పెరిగి రూ.1,03,320కు చేరుకుంది . ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.94,710, 18 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.77,490గా ఉంది. కిలో వెండి ధర రూ.1,19,800కు చేరుకుంది. ప్లాటినం ధర కూడా స్వల్పంగా పెరిగి రూ.38,160కు చేరింది.

దేశంలో పండుగ సీజన్‌తో పాటు భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధిస్తుందన్న అంచనా బంగారం ధరలు పెరిగేలా చేస్తున్నాయని స్టాక్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

దేశంలోని వివిధ నగరాల్లో బంగారం (24కే, 22కే, 18కే) రేట్స్

చెన్నై: -1,03,320-94,710-78,310

ముంబయి: 1,03,320-94,710-77,490

ఢిల్లీ: -1,03,470బీ ?94,860-77,620

కోల్‌కతా: -1,03,320-4,710బీ -77,490

బెంగళూరు: -1,03,320-94,710 -77,490

హైదరాబాద్: ?1,03,320-94,710బీ -77,490


కేరళ: -1,03,320బీ ?94,710-77,490

పుణె: -1,03,320బీ ?94,710-77,490

వడోదరా: -1,03,370బీ 94,760బీ -77,540

అహ్మదాబాద్: -1,03,370-94,760బీ 77,540

## రిటైర్మెంట్ తర్వాత నెలవారీ ఆదాయం..ఇదిగో సులభమైన మార్గం



**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు రిటైర్మెంట్ తర్వాత కూడా ప్రతి నెలా స్థిరమైన ఆదాయం పొందాలని చూస్తున్నారా. ఇది అసాధ్యమైన పనేమి కాదు. మీరు పని చేసే సమయంలో తెలివిగా పెట్టుబడి పెడితే, రిటైర్మెంట్ తర్వాత కూడా ఆర్థిక స్వేచ్ఛను పొందవచ్చు. దీని కోసం సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ ఒక మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు. దీనిని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. కాబట్టి దీనిలో ఎలాంటి రిస్క్ ఉండదు.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ అనేది పోస్టాఫీసు ద్వారా అందుబాటులో ఉన్న ఒక పెట్టుబడి పథకం. ఇది 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఈ పథకంలో ఒకేసారి కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం ద్వారా, మీరు ప్రతి నెలా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు.

ఈ స్కీమ్‌లో మీరు గరిష్టంగా 30 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఇంతకుముందు ఈ పరిమితి 15 లక్షలుగా ఉండేది. ఈ పథకంలో మీకు 8.2% వడ్డీ రేటు లభిస్తుంది. ఈ స్కీమ్ మెచ్యూరిటీ వ్యవధి 5 సంవత్సరాలు. అంటే, మీరు ఈ రిటర్న్‌లను 5 సంవత్సరాల పాటు పొందవచ్చు.

**ఎంత ఆదాయం వస్తుంది?**

ఒకవేళ మీరు 30 లక్షల రూపాయలు ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెడితే, మీకు సంవత్సరానికి దాదాపు 2,46,000 రూపాయల వడ్డీ లభిస్తుంది. దీన్ని నెల వారీగా లెక్కిస్తే, మీరు ప్రతి నెలా 20,500 రూపాయలు పొందవచ్చు. ఇది మీ రిటైర్మెంట్ జీవితాన్ని సౌకర్యవంతంగా మార్చే స్థిరమైన ఆదాయమని చెప్పవచ్చు. దీనిలో మీకు ఎలాంటి రిస్క్ ఉండదు.

**ఎవరు పెట్టుబడి పెట్టవచ్చు?**

60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న భారతీయ పౌరులు ఈ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు.

55 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు, స్వచ్ఛంద రిటైర్మెంట్ తీసుకున్నవారు కూడా ఈ స్కీమ్‌లో చేరవచ్చు.

ఈ స్కీమ్‌లో చేరడానికి మీరు మీ సమీపంలోని పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా తెరవాలి.

**ఎలా చేరాలి?**

ఈ స్కీమ్‌లో చేరడం చాలా సులభం. మీరు మీ సమీప పోస్టాఫీసుకు వెళ్లి, ఖాతా తెరవడానికి అవసరమైన ఫారమ్‌ను పూర్తి చేయాలి. అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి, మీ పెట్టుబడి మొత్తం గురించి వారికి తెలియజేసి అందజేయండి. ఆ తర్వాత మీ నెలవారీ ఆదాయం ప్రారంభమవుతుంది. ఈ స్కీమ్ ద్వారా వచ్చే ఆదాయంపై మీరు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి, మీ ఆదాయాన్ని లెక్కించేటప్పుడు పన్ను అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

## జీడీపీ హుషారు.. రూపాయి బేజారు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత ఆర్థిక వ్యవస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో (క్యూ1) అంచనాల ను మించి 7.8% వృద్ధి రేటును నమోదు చేసింది. తొలి త్రైమాసికానికి ఇటీవల ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 6.5్ద కన్నా ఇది చాలా అధికం. ఇది ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి. ఆ రకంగా ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకుంది. గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు 8.4్ద తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. కాగా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి రేటు 5.2 శాతానికే పరిమితం అయింది. అయితే ఇది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు అమలులోకి రాక ముందు పరిస్థితి. ఇప్పుడు భారత ఉత్పత్తులపై 50్ద సుంకాలు అమలులోకి రావడంతో టెక్స్‌టైల్స్ సహా కీలక ఎగుమతి రంగాలు డీలా పడి వృద్ధి అంచనాలను తలకిందులు చేయవచ్చని పరిశీలకులంటున్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎసఓ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం వ్యవసాయ రంగం క్యూ1లో బలమైన వృద్ధి రేటు నమోదు కావడానికి ఊతం ఇచ్చింది. అలాగే వాణిజ్యం, హోటళ్లు, ఆర్థిక, రియల్ ఎస్టేట్ రంగాలు సహా సేవల రంగం కూడా ఈ వృద్ధికి బాసటగా నిలిచింది. ఎన్ఎసఓ గణాంకాల్లోని ప్రధానాంశాలు...

వ్యవసాయ రంగం క్యూ1లో 3.7్ద వృద్ధి రేటు నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగం వృద్ధి రేటు 1.5 శాతంగా ఉంది. తయారీ రంగం వృద్ధి మాత్రం మందకొడిగా ఉంది. ఈ రంగం వృద్ధి రేటు 7.6% నుంచి 7.7 శాతానికి పెరిగింది.

స్థిర ధరల్లో ఆర్థిక వ్యవస్థ విలువ గత ఏడాది క్యూ1తో పోల్చితే రూ.44.41 లక్షల కోట్ల నుంచి రూ.47.89 లక్షల కోట్లకు పెరిగింది. అంటే వృద్ధి రేటు 7.8 శాతంతో సమానం.

ప్రస్తుత ధరల ప్రకారం ఆర్థిక వ్యవస్థ విలువ రూ.రూ.86.05 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.79.08 లక్షల కోట్లతో పోల్చితే వృద్ధిరేటు 8.8 శాతంగా ఉంది.

ప్రభుత్వ తుది వినియోగ వ్యయం బలమైన పునరుజ్జీవంతో 4్ద నుంచి 9.7 శాతానికి పెరిగింది. రిటైల్ ప్రైవేట్ తుది వినియోగ వ్యయం మాత్రం 8.3్ద నుంచి 7 శాతానికి దిగజారింది. స్థిర ధరల ప్రకారం స్థూల స్థిర పెట్టుబడులు 6.7్ద నుంచి 7.8 శాతానికి పెరిగాయి.

విభిన్న విధానాల ద్వారా జీడీపి మదింపులో ఏర్పడిన వ్యత్యాసం రూ.33,384 కోట్ల నుంచి రూ.1.11 లక్షల కోట్లకు పెరిగింది.


**పాతాళానికి రూపాయి**

ట్రంప్ సుంకాల ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై తీవ్రంగా పడింది. శుక్రవారం అమెరికా డాలర్ మారకంలో రూపాయి తొలిసారిగా 88 కన్నా దిగజారింది. శుక్రవారం ఉదయం 87.73 వద్ద ప్రారంభమైన రూపాయి త్వరితగతిన దిగజారుతూ ఒక దశలో 88.33 వరకు కూడా పడిపోయింది. చివరికి నష్టాన్ని 51 పైసలకు పరిమితం చేసుకుని 88.09 వద్ద ముగిసింది. ఈ రెండూ జీవితకాల కనిష్ఠ స్థాయిలే. కాగా గురువారం నాడు రూపాయి 11 పైసలు నష్టపోయి 87.58 వద్ద ముగిసింది.

విదేశీ నిధుల తరలింపే కారణం: ట్రంప్ సుంకాల అమలు అనంతరం భారత మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారీ ఎత్తున నిధులు తరలించుకుపోతున్నారు. ఎఫ్‌పీఐలు శుక్రవారం ఒక్క రోజులోనే రూ.8,312.66 కోట్లు తరలించుకుపోయారు. గురువారం రూ,3,856.51 కోట్ల విలువ గల ఈక్విటీలు విక్రయించారు. ఒకపక్క విదేశీ నిధులు భారీగా తరలిపోవడంతో పాటు మరోపక్క భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఏర్పడిన ఉద్రిక్తతలతో దేశీయ కరెన్సీ తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు.

ఫారెక్స్ నిల్వలు డౌన్: రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ నెల 22వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 438.6 కోట్ల డాలర్లు దిగజారి 69,072 కోట్ల డాలర్లకు తగ్గాయి. అమెరికా సుంకాల ప్రభావం వల్ల వృద్ధి రేటు క్షీణించే ముప్పు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు 6.3్ద-6.8్ద మధ్యన ఉండవచ్చు. దేశీయ డిమాండు బలంగా ఉండడం ఇందుకు కారణం. జీడీపీపై సుంకాల ప్రభావం తాత్కాలికంగానే ఉంటుంది. జీఎసటీ రేట్ల సరవణకు కసరత్తు జరుగుతూ ఉండడం, పండగల డిమాండు వృద్ధికి ఊతం ఇచ్చే అంశాలు.

## ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ విస్తరణ




**న్యూఢిల్లీ-నవభూమి:** హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్.. ఫిలిప్పీన్స్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ఇందులో భాగంగా మరో ఐదు డయాలసిస్ క్లినిక్స్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. నెఫ్రోప్లస్ పేరుతో కంపెనీ డయాలసిస్ సేవలందిస్తోంది. ఈ కొనుగోలుతో ఫిలిప్పీన్స్‌లో మొత్తం క్లినిక్ సంఖ్య 39కి చేరుకుంది. 2020లో కంపె నీ ఫిలిప్పీన్స్ మార్కెట్లోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఏటా కార్యకలాపాలు విస్తరిస్తూ వస్తోంది.

# అమ్మమ్మను కడసారి చూడటానికి వచ్చిన రామ్ చరణ్



టాలీవుడ్ స్టార్ ఫ్యామిలీ అల్లు కుటుంబంలో విషాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ నానమ్మ, అల్లు అరవింద్ తల్లి అల్లు కనకరత్నమ్మ (94) కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న కనకరత్నమ్మ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. దీంతో అల్లు కుటుంబంతో పాటు మెగా కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇప్పటికే అరవింద్ ఇంటికి మెగాస్టార్ చిరంజీవితో పాటు పలువురు ప్రముఖులు వచ్చి సంతాపం తెలుపుతున్నారు.అయితే తన అమ్మమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న నటుడు రామ్ చరణ్ మైసూరులో తన సినిమా షూటింగ్‌ను మధ్యలో ఆపేసి హుటాహుటిన హైదరాబాద్ వచ్చారు. అనంతరం అమ్మమ్మ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ క్రమంలోనే మేనమామ అరవింద్‌తో పాటు అల్లు అర్జున్‌ని రామ్ చరణ్ ఓదార్చారు. పెద్ది సినిమా షూటింగ్‌లో మధ్యలో ఆపేసి వచ్చిన రామ్ చరణ్ మళ్లీ మైసూర్ వెళుతున్నట్లు సమాచారం.



# బాలీవుడ్ మోస్ట్ క్రేజీ మల్టీస్టారర్ మూవీలో సయామీ ఖేర్



సరిగ్గా పదేళ్ల క్రితం సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన 'రేయ్' సినిమాతో సయామీ ఖేర్ నటిగా తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా మొత్తం ఇండస్ట్రీకి పరిచయం అయిన విషయం తెల్సిందే. మొదటి సినిమా తెలుగులో చేసిన ఈ అమ్మడికి పెద్దగా గుర్తింపు రాలేదు. రేయ్ సినిమా కొంతలో కొంత సాయి ధరమ్ తేజ్‌కి గుర్తింపు తెచ్చి పెట్టింది. కానీ కమర్షియల్‌గా ఫ్లాప్ కావడంతో సయామీ ఖేర్ కి పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. దాంతో తెలుగులో ఆఫర్లు కష్టం అయ్యాయి. తెలుగు ఫిల్మ్ మేకర్స్‌ను ఈమె సంప్రదించేందుకు ప్రయత్నించినా తిరస్కరణకు గురి అయింది. ఆ సమయంలో బాలీవుడ్‌లో చిన్నా చితకా సినిమాల్లో నటించే అవకాశం దక్కించుకుంది. అయితే అక్కడ కూడా పెద్దగా గుర్తింపు దక్కలేదు. తెలుగులో మరోసారి వైల్డ్ డాగ్, హైవే సినిమాలతో అవకాశాలు దక్కాయి. ఆ సినిమాలు కూడా సయామీ ఖేర్ కు హిట్‌ను తెచ్చి పెట్టలేదు. దాంతో మొత్తానికి సయామీని టాలీవుడ్ తిరస్కరించి, ఆమెకు ఆఫర్లు నో అంటూ చెప్పేసింది. రేయ్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం టాలీవుడ్ నో చెప్పడంతో అప్పటికే పరిచయం ఉన్న బాలీవుడ్‌లో రీ ఎంట్రీకి సిద్ధం అయింది. 2023లో ఈమె 8 ఏఎం మెట్రో అనే సినిమాలో నటించింది. ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ఈమెకు నటిగా గుర్తింపు తెచ్చి పెట్టింది. అదే ఏడాది మరో సినిమాతో సయామీ ఖేర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈసారి అభిషేక్ బచ్చన్ తో కలిసి చేసిన స్పోర్ట్స్ డ్రామా ఆకట్టుకుంది. అంతే కాకుండా నటిగా మరింత మంచి పేరును తెచ్చి పెట్టింది. అక్కడ నుంచి ఈమె జోరు పెరుగుతూ వస్తోంది. ఏడాదికి రెండు సినిమాల చొప్పున ఈమె చేస్తోంది. గత ఏడాది ఈమె నటించిన రెండు హిందీ సినిమాలు విడుదల అయ్యాయి. అందులో అగ్ని తో మంచి పేరును సొంతం చేసుకోవడంతో మరిన్ని ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటికే జాట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. జాట్ మూవీలో సయామీ ఖేర్ సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన జాట్ సినిమాలో ఎస్ఐ పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమాలోని సయామీ ఖేర్ నటనకు మంచి స్పందన దక్కింది. అందుకే ఇప్పుడు ఏకంగా బాలీవుడ్ మోస్ట్ క్రేజీ మల్టీస్టారర్ మూవీలో నటించే అవకాశం దక్కింది. అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ హీరోలుగా రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా సయామీ ఖేర్‌కు ఛాన్స్ దక్కింది. ఇప్పటికే ఆమెను ఎంపిక చేసినట్లు సమాచారం అందుతోంది. ఇంతటి క్రేజీ మల్టీస్టారర్ మూవీలో ఈమెకు చోటు దక్కడంతో ఖచ్చితంగా ముందు ముందు బాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా మారుతుంది అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. 17 ఏళ్ల తర్వాత అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ నటిస్తున్న నేపథ్యంలో ఈ సినిమా పై బాలీవుడ్ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. సయామీ ఖేర్ ఫ్యామిలీ ఇండస్ట్రీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారు కావడంతో ఈజీగానే ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ముఖ్యంగా తండ్రి అద్వైత్ ఖేర్ సుదీర్ఘ కాలం పాటు మోడల్‌గా చేశారు. దాంతో ఇండస్ట్రీలో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ఇక తల్లి సైతం మోడలింగ్‌లో ఉంది. 1980 ల్లో చాలా అందాల పోటీల్లో గెలిచి ఉత్తర ఖేర్ మంచి గుర్తింపును

# మెగాస్టార్‌తో విక్టరీ బాక్స్ బద్దలయ్యేలా!



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో 157వ చిత్రం మన శంకర వరప్రసాద్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సినిమా ఆన్ సెట్స్‌లో ఉంది. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తయింది. ప్రారంభోత్సవం నుంచి అనీల్ ఎలాంటి విరామం లేకుండా షూటింగ్ పనిలోనే బిజీగా ఉన్నాడు. అప్పుడప్పుడు ప్రధాన తారలు తప్పా మిగతా అందరూ షూట్ లో పాల్గొంటున్నారు. సంక్రాంతి టార్గెట్ రిలీజ్ ఫిక్స్ అవ్వడంతో అనీల్ షెడ్యూల్ ఎక్కడా డిస్టబెన్స్ కాకుండా ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నాడు. మనోజ్ చాలా అగ్రెస్సివ్‌గా ఉంటాడు చిరుతో వెంకీ యాక్షన్: ఇదే సినిమాలో విక్టరీ వెంకటేష్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఆయన ఎంట్రీ ఎప్పుడు? ఉంటుంది అన్నది ఇంత వరకూ క్లారిటీ లేదు. దీంతో వెంకీ కేవలం గెస్ట్ రోల్‌కే పరిమితమవుతారా? అన్న సందేహం కూడా తెరపైకి వస్తోంది. తాజాగా అందుతోన్న సమాచారం మేరకు వెంకటేష్ కూడా సినిమాలో స్ట్రాంగ్ రోల్ పోషిస్తున్నట్లు కనిపిస్తుంది. చిరంజీవితో వెంకటేష్ కాంబినేషన్ సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని టీమ్ నుంచి లీకైంది. చిరుతో పాటు వెంకీ యాక్షన్ సన్నివేశాల్లో కనిపిస్తారుట. ఈ యాక్షన్ సన్నివేశం కూడా ఓ కాన్సెప్ట్ ప్రకారం డిజైన్ చేసారుట. వినోదం,యాక్షన్ అంశాల మేళవింపుతో సాగే కుటుంబ కథా చిత్రమిది. దీంతో యాక్షన్ సన్నివేశంలో ఫన్ కూడా యాడ్ అవుతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ వచ్చే నెలలో హైదరాబాద్ లో ప్రారంభం కానుంది. చిరంజీవి-వెంకటేష్ ఇంత వరకూ ఏ చిత్రంలో కలిసి నటించలేదు. దీంతో ఆ కాంబినేషన్ లో సన్నివేశాలు ఎలా ఉంటాయి? అన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇద్దరు మంచి కామెడీ టైమింగ్ ఉన్న నటులు. కానీ ఆ టైమింగ్ వేర్వేరుగా ఉంటుంది. హ్యాట్రిక్ తర్వాత వెంకీ: ఈ విషయంలో వెంకీ చిరునే డామినేట్ చేస్తారు. మరి ఆ కామెడీ టింజ్ ను అనీల్ ఎలా రాబట్టుకుంటు న్నారో చూడాలి.

ఇప్పటికే వెంకటేష్ తో కలిసి పని చేసిన అనుభవం అనీల్ కు ఉంది.ఎఫ్ 3-, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలతో వెంకీ కామెడీ టైమింగ్ ని పట్టాడు అనీల్. సినిమాకు ఆ టైమింగ్ బాగా వర్కౌట్ అయింది. మరి ఆ టైమింగ్ ని చిరుతో ఎలా మ్యాచ్ చేస్తారో చూడాలి. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ మరో కొత్త చిత్రం కమిట్ అవ్వని సంగతి తెలిసిందే.


# అల్లు కుటుంబంలో విషాదం.. చిరంజీవి ఎదుట అల్లు అర్జున్ కంటతడి



అల్లు కుటుంబంలో విషాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ నానమ్మ, అల్లు అరవింద్ తల్లి అల్లు కనకరత్నమ్మ (94) కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న కనకరత్నమ్మ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. దీంతో అల్లు కుటుంబంతో పాటు మెగా కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఇక నానమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న అల్లు అర్జున్ ముంబైలో తన సినిమా షూటింగ్‌ను మధ్యలో ఆపేసి హుటాహుటిన హైదరాబాద్ వచ్చారు.

అనంతరం నానమ్మ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ క్రమంలోనే అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్న మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ తన తల్లి మరణంతో శోకసంద్రంలో ఉన్న అల్లు అరవింద్, అలాగే తీవ్ర దుఃఖంలో ఉన్న అల్లు అర్జున్‌ను చిరంజీవి ఓదార్చారు. ఇక నానమ్మ మీద ఉన్న ప్రేమతో అల్లు అర్జున్ చిరంజీవి ఎదుట కంటతడి పెట్టుకున్నారు. మరోవైపు అల్లు కనకరత్నమ్మ మృతి పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.

# దివ్వెల మాధురి బిగ్ బాస్ హౌస్‌కి?



దివ్వెల మాధురి పరిచయం అవసరం లేని పేరు. దువ్వాడ శ్రీనివాస్ తో కలిసి ఉంటున్న ఆమె ఇప్పటికే ఏపీలో స్పెషల్ డిస్కషన్ పాయింట్ అయ్యారు. ఇప్పటికే సోషల్ మీడియాలో దివ్వెల మాధురి గురించి ప్రత్యేకమైన చర్చ నడుస్తుంది. అలాంటి ఆమె ఇప్పుడు బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్తే ఎలా ఉంటుంది. ఏంటి నిజమేనా దివ్వెల మాధురి బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్తుందా అంటే పరిస్థితి చూస్తుంటే అవుననేలా ఉన్నాయి. సీజన్ 9 లో సెలబ్రిటీ హోదాలో దివ్వెల మాధురి.. బిగ్గెస్ట్ రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 లో సెలబ్రిటీ హోదాలో దివ్వెల మాధురి కూడా హౌస్ లోకి వస్తారని టాక్. ఐతే అందులో ఎంతవరకు నిజం ఉందన్నది తెలియాల్సి ఉంది. సోషల్ మీడియాలో దివ్వెల మాధురి గురించి ఎప్పుడూ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. అలాంటి పొలిటికల్ గా ప్రభావం ఉన్న పర్సన్ బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్తే తప్పకుండా మంచి ఇంపాక్ట్ చూపించే ఛాన్స్ ఉంటుంది. ఇప్పటికే బిగ్ బాస్ సీజన్ 9 లో సెలబ్రిటీస్ 9 మందితో పాటు కామన్ మ్యాన్ ని కూడా 9 మెంబర్స్ ని తీసుకుంటారని తెలుస్తుంది. ఈ క్రమంలోనే బిగ్ బాస్ అగ్నిపరీక్ష అంటూ హౌస్ లోకి వెళ్లే కామన్ మ్యాన్ ఎంపిక జరుగుతుంది. ఇక బిగ్ బాస్ సీజన్ 9 సెలబ్రిటీస్ లిస్ట్ కూడా భారీగానే ఉంది. జబర్దస్త్ ఇమ్మాన్యుయెల్, సీరియల్ యాక్ట్రెస్ తనూజ, భగత్, ఒకప్పటి హీరోయిన్ ఆషా శైనీ, హీరోయిన్ సంజన ఇలా కొందరి పేర్లు సోషల్ మీడియాలో డిస్కషన్ లో ఉన్నాయి. విషయాన్ని వదిలి పెట్టే వ్యక్తి కాదు.. ఇక ఇప్పుడు వారితో పాటుగా దివ్వెల మాధురి కూడా హౌస్ లోకి వస్తారన్న టాక్ నడుస్తుంది. అదే జరిగితే మాత్రం ఈసారి ఆట మరింత రసవత్తరంగా ఉండబోతుందని చెప్పొచ్చు. దివ్వెల మాధురి అంత తేలికగా ఒక విషయాన్ని వదిలి పెట్టే వ్యక్తి కాదు. ఆమె దాకా వస్తే డూ ఆర్ డై రేంజ్ లో పోరాడుతుంది. తను అనుకున్న పని చేసి తీరుతుంది. అలాంటి గట్స్ ఉన్న వ్యక్తి హౌస్ లోకి వస్తే మాత్రం మిగతా వాళ్లకి కాస్త టెన్షన్ అనే చెప్పొచ్చు. ఆమె హౌస్ లో ఉంటే ఆమె సపోర్టర్స్ అంతా కూడా ఆమెకు సపోర్ట్ చేసే అవకాశాలు ఉన్నాయి. బిగ్ బాస్ ఇన్ని సీజన్లలో ఇలా పొలిటికల్ గా సోషల్ మీడియా సెన్సేషన్ అయిన ఒక వ్యక్తిని హౌస్ లోకి తీసుకెళ్తున్నారు. మరి నిజంగానే మాధురి హౌస్ లోకి వస్తారా లేదా అన్నది త్వరలో తెలుస్తుంది.

# నా పిల్లల్ని నేను కనలేదు.. సన్నీ లియోన్



అందాల శృంగార తార సన్నీ లియోన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు శృంగార తారగా ఒక ఊపు ఊపిన సన్నీ.. ఆ తరువాత ఆ వృత్తి నుంచి బయటకు వచ్చి బాలీవుడ్ లో నటిగా స్థిరపడింది. డేవిడ్ వెబర్‌ను పెళ్ళాడిన సన్నీ లియోన్ ముగ్గురు పిల్లలకు తల్లిగా మారింది. అయితే వారికి ఆమె జన్మనివ్వలేదు. సరోగసీ ద్వారా ఇద్దరు పిల్లలకు జన్మనివ్వగా.. ఒక పాపను మాత్రం దత్తత తీసుకుంది.హిందీ సినిమాలు తాజాగా తన సరోగసీ ప్రయాణంపై సన్నీ మొదటిసారి నోరువిప్పింది. బాలీవుడ్ హీరోయిన్ సోహా అలీఖాన్ పాడ్ క్యాస్ట్ కు హాజరైన సన్నీ.. తన బిడ్డలా గురించి మాట్లాడింది. తనకు బిడ్డలను కడుపులో మోయడం ఇష్టం లేకనే సరోగసీ ద్వారా పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలిపింది. ' మొదట నుంచి నాకు ఒక బిడ్డను దత్తత తీసుకోవాలని ఉండేది. మొదటిసారి ఐవీఎఫ్ ఫెయిల్ అయ్యాకా.. బిడ్డ దత్తతకు మేము అప్లై చేసాం కూడా. అప్పుడే ఒక పాపను దత్తత తీసుకున్నాం.ఇక సరోగసీనే ఎందుకు ఎంచుకున్నాను అంటే.. నాకు కడుపులో బిడ్డను మోయడం ఇష్టం లేదు. అందుకే ఒక మహిళను ఎంచుకొని ఆమె కడుపులో మా బిడ్డను పెంచాం. దానికి చాలా డబ్బు ఖర్చు చేసాం. ఆమెతో పాటు ఆమె భర్తకు కూడా మేము డబ్బులిచ్చాం. మా బిడ్డల వలన ఆమె ఒక ఇల్లు కట్టుకుంది. మొదటి భర్తకు విడాకులిచ్చి రెండోపెళ్లి చేసుకుంది' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం సన్నీ వ్యాఖ్యలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి.హిందీ సినిమాలుచాలామంది సెలబ్రిటీలు ఇలానే అందాన్ని కాపాడుకోవడానికి సరోగసీ వెంటపడుతున్నారు. ప్రియాంక చోప్రా, నయనతార, శిల్పాశెట్టి ఇలా చాలామంది సెలబ్రిటీలు సరోగసీ ద్వారా తల్లులు అయినవారే.

బిడ్డను మోయడం అనేది ఒక అందమైన అనుభూతి. అనారోగ్య సమస్యల వలన సరోగసీకి వెళ్తే ఓకే కానీ, ఇలా అందాన్ని కాపాడుకోవడం కోసం అయితే అది చాలా దారుణమని పలువురు కామెంట్స్ చేస్తున్నారు.

# అనుచితంగా హీరోయిన్ నడుము తాకిన స్టార్ నటుడు.. వివాదంపై స్పందించిన నటి




భోజ్‌పురి నటుడు పవన్ సింగ్, నటి అంజలి రాఘవ్ నడుమును అనుమతి లేకుండా తాకిన విషయం తెలిసిందే. వీరిద్దరూ కలిసి చేసిన 'సైయా సేవ కరే' అనే ఆల్బమ్ ప్రమోషన్‌లో భాగంగా లక్నోలో జరిగిన ఒక ఈవెంట్‌లో పవన్ సింగ్ అంజలి నడుమును అనుచితంగా తాకాడు. దీంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ ఘటనపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పవన్ సింగ్ తీరును తప్పుబట్టారు. ఈ ఘటన జరిగి రెండు రోజులు అయిన నటి ఇంకా స్పందించలేదని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు మౌనంగా ఉన్న అంజలి రాఘవ్ తాజాగా ఒక వీడియో ద్వారా స్పందిస్తూ.. పవన్ సింగ్ ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేసింది.అంజలి మాట్లాడుతూ.. గత 2 రోజులుగా నేను చాలా బాధపడుతున్నాను. లక్నోలో జరిగిన ఘటనపై ఎందుకు స్పందించలేదని, ఎందుకు చర్యలు తీసుకోలేదని నాకు నిత్యం ఫోన్లతో పాటు సందేశాలు వస్తున్నాయి. కొందరు ఈ ఘటనను తప్పుగా అర్థం చేసుకుని.. నేను నవ్వుతున్నాను. సరదాగా ఉన్నాను అంటున్నారు. ఎవరైన అనుమతి లేకుండా అలా తాకితే ఆనందంగా ఉంటుందా? సరాదాగా ఉంటుందా? అని అంజలి తన ఆవేదన వ్యక్తం చేసింది.నేను ఈవెంట్‌లో మాట్లాడుతుండగా.. పవన్ సింగ్ తన నడుముపై ఏదో అంటుకుని ఉందని చెప్పారని.. దానికి తీసే క్రమంలో తనను తాకారని అనుకున్నానని అంజలి తెలిపారు. నేను ఆరోజు కొత్త చీర కట్టుకున్నందున బ్లౌజ్ ట్యాగ్ ఏమైనా బయటికి వచ్చిందేమోనని తాను నవ్వాను. ఆ తర్వాత తన టీమ్ మెంబర్‌ను అడిగితే అక్కడ ఏమీ లేదని చెప్పడంతో నాకు చాలా కోపంతో పాటు బాధ వచ్చిందని అంజలి అన్నారు. అయితే ఈ విషయంపై ప్రైవేట్‌గా మాట్లాడదామని అనుకునేలోపే పవన్ సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయారని అంజలి వివరించారు.ఈ ఘటన గురించి బయట మాట్లాడితే.. పవన్ సింగ్‌కి భారీ నెట్‌వర్క్ ఉందంటూ తనను బెదిరించారని అంజలి తెలిపారు. అందుకే ఈ ఘటన గురించి తాను మాట్లాడకుండా మౌనంగా ఉన్నానని కొన్నిరోజులకు ఈ విషయం సద్దుమణుగుతుందని భావించినట్లు చెప్పారు. కానీ ఈ ఘటన మరింత పెద్దదిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో తాను తీవ్రంగా కలత చెందానని అంజలి తెలిపారు. ఏ అమ్మాయిని అయిన అనుమతి లేకుండా తాకడం చాలా తప్పు అని అంజలి అన్నారు.

# చెంపదెబ్బ వీడియో రిలీజ్.. లలిత్ మోదీపై శ్రీశాంత్ భార్య ఆగ్రహం



**న్యూఢిల్లీ-నవభూమి:** హర్భజన్ సింగ్.. శ్రీశాంత్ చెంప ఛెళుమనిపించిన ఘటన తాలూకు వీడియోను ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోదీ ఇటీవల షేర్ చేసిన విషయం తెలిసింది. జనాలు మర్చిపోతున్న ఈ ఘటనను లలిత్ మోదీ మరోసారి గుర్తు చేయడంతో ఈ అంశం ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. ఈ ఘటనకు సంబంధించి మునుపెన్నడూ చూడని వీడియోను లలిత్ మోదీ షేర్ చేశారు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ క్లార్క్ పాడ్ కాస్ట్ సందర్భంగా ఈ వీడియోను పంచుకున్నారు.ఈ ఉదంతంపై శ్రీశాంత్ భార్య భువనేశ్వరి మండిపడ్డారు. పాత గాయాలను మళ్లీ రేపుతున్నారంటూ లలిత్ మోదీ, మైఖేల్ క్లార్క్‌పై మండిపడ్డారు. 'ఇలాంటి పని చేసినందుకు లలిత్ మోదీ, మైఖేల్ క్లార్క్ సిగ్గు పడాలి. మీ పబ్లిసిటీ కోసం 2008 నాటి ఘటనను తవ్వితీస్తారా. శ్రీశాంత్, హర్భజన్ ఇద్దరూ ఈ విషయాన్ని ఎప్పుడో వదిలేశారు. తమ జీవితాల్లో బిజీగా ఉన్నారు. వాళ్లు ఇద్దరికీ చదువుకుంటున్న పిల్లలు ఉన్నారు. కానీ మీరు పాత గాయాన్ని మళ్లీ రేపే ప్రయత్నం చేశారు. ఇది నిజంగా అమానవీయం, కర్కశం' అని ఫైరైపోయారు.ఈ విషయమై ఆమె మరో పోస్టులో స్పందిస్తూ.. పాత వీడియో మళ్లీ బయటకు రావడం తమ కుటుంబాలను గాయపరిచిందని అన్నారు. ఏ తప్పు చేయని వారి పిల్లలపై కూడా ప్రతికూల ప్రభావం చూపించే ఈ వీడియోను బయటపెట్టినందుకు ఇద్దరిపైనా కేసులు పెట్టాలని అభిప్రాయపడ్డారు.నాటి ఘటన బ్రాడ్ కాస్ట్ కెమెరాకు చిక్కలేదని మైఖేల్ క్లార్క్ ఇంటర్వ్యూలో లలిత్ మోదీ తెలిపారు. తన వ్యక్తిగత సెక్యూరిటీ కెమెరాలో ఈ దృశ్యం రికార్డు అయ్యిందన్నారు. నాటి వీడియోను తాను డిలీట్ చేయలేదని చెప్పారు. శ్రీశాంత్‌పై చేయి చేసుకున్నందుకు హర్భజన్‌సింగ్‌పై ఎనిమిది మ్యాచ్‌ల పాటు నిషేధం విధించినట్టు కూడా తెలిపారు. ఈ ఉదంతంపై హర్భజన్ సింగ్ ఇప్పటికే పలు బహిరంగ వేదికలపై శ్రీశాంత్‌కు క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే.

# గాఫ్ గర్జన



**న్యూయార్క్-నవభూమి:** ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న అమెరికా యువ తార కొకొ గాఫ్.. సొంతగడ్డపై మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్ మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. క్రొయేషియాకు చెందిన వెకిక్‌తో జరిగిన రెండో రౌండ్ పోరులో గాఫ్ 7-6 (5), 6-2తో విజయం సాధించింది. వెకిక్‌తో మ్యాచ్ మధ్యలో, మ్యాచ్ ముగిశాక గాఫ్ తీవ్ర భావోద్వేగానికిగురై కంటతడి పెట్టుకుంది. తొలి సెట్ ముగింపు దశలో వరుసగా రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేసి సర్వీస్ చేజార్చుకున్న క్రమంలో టవల్ అడ్డం పెట్టుకొని ఏడ్చిన గాఫ్.. మ్యాచ్ ముగిశాక స్టాండ్స్‌లో అమెరికా జిమ్నాస్టిక్స్ స్టార్ సిమోన్ బైల్స్ గురించి మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైంది. 'ఎంతో ఒత్తిడిలోనూ ఆరు అంగుళాల బీమ్‌పై సిమోన్ అద్భుతమైన విన్యాసాలు చేస్తూ అందరినీ అబ్బురపరుస్తుంది. ఆమెలాగే జీవితంలో నేను కూడా మంచి, చెడు చూశా. అందుకే కోర్టులో రాకెట్ పట్టుకున్నప్పుడల్లా సిమోన్ స్ఫూర్తితో ముందుకెళుతుంటా' అని గాఫ్ వ్యాఖ్యానించింది. 8వ సీడ్ అనిసిమోవా 7-6 (2), 6-2తో మయాపై, 15వ సీడ్ కసత్కినా 6-2, 4-6, 7-5తో రఖిమోవాపై, రెండుసార్లు విజేత ఒసాక 6-3, 6-1తో హీలీపై గెలిచి మూడోరౌండ్‌కు చేరారు.

# తలైవాస్ శుభారంభం



**విశాఖపట్నం-నవభూమి:** సొంతగడ్డపై జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)ను విజయంతో ప్రారంభించాలనుకున్న తెలుగు టైటాన్స్‌కు నిరాశే ఎదురైంది. ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం మొదలైన లీగ్‌లో టైటాన్స్ జట్టుకు తమిళ్ తలైవాస్ ఝలకిచ్చింది. హోరాహోరీగా సాగిన తొలి మ్యాచ్‌లో తలైవాస్ 38-35 స్కోరుతో తెలుగు టైటాన్స్‌పై విజయం సాధించింది. స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ సూపర్ 10, కెప్టెన్ పవన్ సెహ్రావత్ 9 పాయింట్లు స్కోరు చేసి తలైవాస్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక, ఆతిథ్య టైటాన్స్ జట్టు తరపున భరత్ హుడా తొమ్మిది పాయింట్లతో రాణించాడు. అనంతరం పుణెరి పల్టన్, బెంగళూరు బుల్స్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో తొలుత 32-32తో స్కోర్లు సమమయ్యాయి. దీంతో ఫలితం కోసం నిర్వహించిన టైబ్రేకర్‌లో పుణెరి జట్టు 6-4తో విజయం సాధించింది. అంతకుముందు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక అతిథిగా హాజరై లీగ్‌ను ప్రారంభించారు. ఆరంభ వేడుకల్లో హాకీ మాజీ కెప్టెన్ ధన్‌రాజ్ పిళ్లై, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, అంతర్జాతీయ అథ్లెట్ యర్రాజీ జ్యోతి, కబడ్డీ దిగ్గజం పర్దీప్ నర్వాల్, పారాలింపిక్స్ పతక విజేత యోగేష్ కథూనియా పాల్గొన్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**